fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 53 | విజయవాడ, శుక్రవారం 23 ఫిబ్రవరి 2018 | 12+12 పేజీలు వెల : 4.00

మాట తప్పొద్దు

ప్రత్యేక హోదాపై కేంద్రానికి చంద్రబాబు వినతి

అనంతలో 'కియో' ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ పనుల ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

"విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీ అమలు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి ఉండేది. ఇచ్చిన మాట తప్పి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కించపరచవద్దు." అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా కోసం ఎవరు పోరాడినా మద్దతిస్తామని చెప్పారు. గురువారం అనంతపురం జిల్లా అమ్మవారిపల్లి వద్ద ఏర్పాటుచేసిన 'కియో' కార్ల పరిశ్రమ ఫ్రేమ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిజెపితో గత ఎన్నికల్లో పొత్తుపెట్టుకున్నామని తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరితే 14వ ఆర్థిక సంఘం ఇవ్వడానికి వీల్లేదని చెప్పిందని కేంద్రం అప్పట్లో వెల్లడించిందని గుర్తు చేశారు. అయినా హోదాకు తగ్గట్టు సహాయం అందజేస్తామని చెప్పడంతో సర్దుకున్నామని వివరించారు. మూడున్నరేళ్లుగా ఎంతో ఓపికగా వేచి చూసామని చెప్పారు. 29 సార్లు ఢిల్లీకి వెళ్లడంతోపాటు, పలుమార్లు ప్రధానమంత్రిని కలిశానని పేర్కొన్నారు. అయినా రాష్ట్రానికి అందాల్సినంత సాయం అందలేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేదని చెప్పారు. కేంద్రం నుంచి సహాయం అందకపోయినా పెట్టుబడుల కోసం కృషి చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు అనంతపురం జిల్లాకు 'కియో' పరిశ్రమ వచ్చిందని తెలిపారు. రాష్ట్రానికి ఐసుజి, హీరో మోటర్స్ తదితర పరిశ్రమలు మరిన్ని రానున్నాయన్నారు. సుమారు 13.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే ఈ పరిశ్రమలు మరిన్ని రావడానికి మార్గం సుగమమై ఉండేదని చెప్పారు. హోదా కోసం ఎవరు ఉద్యమం చేసినా తన మద్దతు ఉంటుందన్నారు. అయితే మిగతా 9లో



కియో కార్ల పరిశ్రమ ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ పరిశ్రమ సూచికగా సంతకాలు చేస్తున్న ఆ పరిశ్రమ సిఇజి హౌన్ హా పార్కు, ముఖ్యమంత్రి చంద్రబాబు

ముందస్తు నిర్బంధం

- సిఎం పర్యటన కోసం పోలీసుల దూకుడు
- అనంతలో సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు సహా పలువురి అరెస్టు

2



విద్యార్థుల ఆత్మహత్యలపై వివరణ ఇవ్వండి

తెలుగు రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యార్థుల ఆత్మహత్యలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) నోటీసులు జారీ చేసింది. రెండు రాష్ట్రాల్లో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులపై ఒత్తిళ్లే ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయంటూ సుప్రీం కోర్టు న్యాయవాది శ్రవణ్ కుమార్ ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి చేసి, తల్లిదండ్రులకు దూరంగా ఉంచుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యాల వైఖరి కారణంగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, అరకొర సౌకర్యాలతో యాజమాన్యాలు విద్యా సంస్థలను నడుపుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో రెండు నెలల్లో దాదాపు 50 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనల వివరాలను, అలాగే ఆయా కాలేజీల్లో సౌకర్యాలు లేమికి సంబంధించిన వివిధ వార్తా పత్రికల్లో వచ్చిన పేపర్ కటింగ్స్‌ను ఎన్‌హెచ్‌ఆర్సీకి అందజేశారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్సీ నాలుగు వారాల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఇరు రాష్ట్రాల సిఎస్‌లకు ఆదేశించింది.

జగన్ కేసులో మోడీకి నోటీసులు!

అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మారిషస్



న్యూఢిల్లీ: ఏపీ వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు మోడీ సర్కారును కోర్టుకు లాగేలా చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇందూ టెక్ జోన్‌లో పెట్టుబడులు పెట్టి తాము నష్టపోయామని పేర్కొంటూ మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని ఆర్బిట్రేషన్ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇందు టెక్ జోన్ కుంభకోణం కేసులో గుత్తేదారు శ్యాంప్రసాద్ రెడ్డి, వైఎస్ జగన్ తదితరులపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిలో మారిషస్‌కు చెందిన కరీసా ఇన్వెస్ట్‌మెంట్ ఎల్ఎల్‌సీ సంస్థ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కింద 49శాతం వాటాల రూపంలో.. మొత్తం రూ.115 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఓ సారి రూ.1.18కోట్లు, మిగతా 9లో

'తీవ్ర అవినీతి' దేశాల జాబితాలో భారత్

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నెషనల్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత తీవ్రమైన అవినీతి పరులున్న దేశాల జాబితాలో భారత్‌కు 81వ స్థానం లభించింది. తాము నిర్వహించిన అధ్యయనంలో భాగంగా 2017లో అవినీతి దేశాల జాబితాను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నెషనల్ సంస్థ విడుదల చేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తీవ్రమైన అవినీతి పరులుండటంతో పాటు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్న దేశాల జాబితాలో సైతం మన దేశానికి స్థానం లభించటం గమనార్హం. ప్రభుత్వ రంగ అవినీతి స్థాయిపై దాదాపు 180 దేశాలలో నిర్వహించిన ఈ అధ్యయనంలో భారత్‌కు 81వ స్థానం దక్కింది. అవినీతి సూచీని 0 నుండి 100 వరకూ విభజించారు. 0 అంటే అత్యధిక స్థాయి అవినీతిగాను, 100వ స్థానం అంటే అత్యంత స్వచ్ఛమైన దేశంగానూ పరిగణనలోకి తీసుకున్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని కొన్ని దేశాలలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నేతలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణా సంస్థలు, లేదా నిఘా సంస్థల సిబ్బంది కూడా బెదిరింపులు ఎదుర్కొంటున్నారని, కొన్ని సందర్భాలలో హత్యలకు కూడా గురవుతున్నారని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నెషనల్ సంస్థ వెల్లడించింది. ఈ విషయంలో ఈ ప్రాంతంలో మాల్దీవులు, ఫిలిప్పైన్స్, భారత్ వంటి దేశాలలో పరిస్థితి అత్యంత భయానకంగా మారుతోందని వివరించింది. ఈ దేశాలలో అత్యధిక స్థాయి అవినీతితోపాటు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్న సందర్భాలు, జర్నలిస్టులు హత్యలకు గురవుతున్న సందర్భాలూ ఎక్కువేనని వివరించింది. ఈ దేశాలలో గత ఆరేళ్ల కాలంలో అవినీతి కేసులపై పరిశోధనలు చేస్తున్న దాదాపు 15 మంది జర్నలిస్టులు హత్యలకు గురయ్యారని కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) నివేదికను మిగతా 9లో

బిజెపిలో అసహనం

మీడియా చర్చలలో దాడులు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రత్యేకహోదా, విభజన హామీల అమలులో చేసిన దగాపై ప్రజానీకంలో ఆగ్రహం వెల్లువెత్తుతుండటంతో బిజెపిలో అసహనం పెరుగుతోంది. రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక హోదాపై జరుగుతున్న మీడియా చర్చల్లో చొరబడుతున్న బిజెపి కార్యకర్తలు గందరగోళం సృష్టించి వాటిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భౌతిక దాడులకూ తెగబడుతున్నారు. విజయవాడలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం తరువాతే ఈ తరహా దాడులు పెరగడం గమనార్హం. గురువారం విజయవాడలో 10 టివి నిర్వహించిన చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఒక బిజెపి నేత ప్రత్యేక హోదా అడిగే వారిని రాష్ట్ర ద్రోహులుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గందరగోళం సృష్టించడానికి బిజెపి కార్యకర్తలు ప్రయత్నించారు. సాక్షి, ఎన్‌టివి, టివి9, మహా టివి తదితర ఛానళ్లు నిర్వహిస్తున్న చర్చ కార్యక్రమాల్లోనూ ఇదే పరిస్థితి నెలకుంటోంది.

వ్యూహం ప్రకారం దాడులు

ప్రత్యేక హోదాపై టివి ఛానళ్లు నిర్వహించే చర్చ కార్యక్రమాల్లోకి ఒక వ్యూహం ప్రకారం బిజెపి కార్యకర్తలు ప్రేక్షకులుగా హాజరవుతున్నారు. చర్చల్లో పాల్గొనే వారు నరేంద్రమోడీ ప్రభుత్వ నిర్వాకాన్ని ఏ మాత్రం ప్రస్తావించినా అరుపులు, కేకలతో అడ్డుకుంటున్నారు. విజయవాడలో టివి9 నిర్వహించిన చర్చ కార్యక్రమంలో సినీ నటుడు శివాజీపై బిజెపి కార్యకర్తలు దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి హాజరైన వామపక్షాలు, ఇతర ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవడంతో ఈ ప్రయత్నం విఫలమైంది. ఆ తరువాత కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టివి చర్చలను లక్ష్యంగా చేసుకుని బిజెపి దాడులు కొనసాగాయి. బుధవారం రాత్రి విజయనగరంలో చర్చను ఏర్పాటు చేసిన మహా టివి సిబ్బంది వాహనంపై దాడి జరిగింది. ఈ దాడి వెనక కూడా బిజెపి మిగతా 9లో



శివాజీతో బిజెపి కార్యకర్తల వాగ్వాదం (ఫైల్)



కారులో కమల్ - రజనీ రహస్య భేటీ

న్యూఢిల్లీ : రాజకీయాల్లోకి కొత్తగా అడుగుపెట్టిన ప్రముఖ నటులు కమల్ హాసన్, రజనీకాంత్‌లు గురువారం ఒక 'రహస్య' సమావేశం జరపడం సంచలనం సృష్టించింది. రాజకీయంగా ప్రత్యర్థులయినప్పటికీ పరస్పర గౌరవంతో వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ తమిళ వార పత్రిక ఆనంద వికటన్‌కు రాసిన కాలమ్‌లో కమల్ తమ 'రహస్య' సమావేశం విషయాన్ని బహిర్గతం చేశారు. అయితే ఈ సమావేశం ఎప్పుడు జరిగిందో ఆయన వెల్లడించలేదు. చెన్నైకి సమీపంలోని పూనమల్లేలోని ఒక ప్రైవేట్ స్టూడియోలో బిగ్ బాస్ టీవీ ప్రోగ్రామ్ షూటింగ్ సమయంలో మిగతా 9లో

టీచర్లకు ఆయుధాలివ్వాలి

- ట్రంప్ సూచన
- అమెరికా వ్యాప్తంగా విద్యార్థుల నిరసన ప్రదర్శనలు

9

కేంద్రం లెక్కలపై అనుమానాలు

విభజన విభాగం ఆరా

వివరాలకై ఆర్థిక శాఖకు సాధారణ పరిపాలన లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై కేంద్రం చెబుతున్న వివరాలు వాస్తవాలేనా? అవసరాలేమిటి? ఎంత రావాలి? వచ్చిందెంత? తదితర కోణాల్లో అధికారులు మేధోమథనం చేస్తున్నారు. సాధారణ పరిపాలన శాఖలోని పునర్విభజన విభాగం అధికారులు రాష్ట్ర ఆర్థిక శాఖకు ఒక లేఖ కూడా రాశారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాలని ఆ లేఖలో కోరారు. ఈ గణాంకాలు, డిమాండ్లతో కేంద్రంతో చర్చించేందుకు ఆస్కారముంటుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం తమ వద్ద దీనిపై స్పష్టమైన వివరాలు లేవని తెలిపారు. రాష్ట్ర అధికారుల్లోనే కేంద్ర నిధులపై అయోమయ పరిస్థితులున్నట్లు ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

ప్రత్యేక హోదా బదులుగా ప్రత్యేక ప్యాకేజి ఇస్తామంటూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో హోదాకు, ప్యాకేజి మధ్య తేడా ఏమిటనే దానిపైనా ప్రశ్నించింది. హోదా స్థానంలో లభించే ప్యాకేజి కోసం రూ16,447 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిన సంగతి తెలిసిందే. ఈ అంకె ప్రతిపాదన వెనుక మూలం ఏమిటని సాధారణ పరిపాలనశాఖ ప్రశ్నించింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందా అనే ప్రశ్ననూ సంధించింది. హోదా ఇచ్చేది లేదని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ఇంకా ఆ ప్రతిపాదన బతికే ఉన్నట్లు కొనసాగుతున్న ప్రచారంపైనా స్పష్టత ఇవ్వాలంది. ఇప్పటికే హోదా స్థాయి ఉన్న హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో కలిగిన ఉపయోగాలు, అక్కడ అమలు చేస్తున్న పథకాల వివరాలు కూడా చెప్పాలని కోరింది. దీనివల్ల హోదాకు, ప్యాకేజికి మధ్య అంతరాలను గుర్తించవచ్చునని రాష్ట్ర విభజన కమిటీ అభిప్రాయపడింది. విభజనతో ఎపికి రూ.16,078 కోట్లు ఆదాయ లోటు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ రూ.11,960 కోట్లను కేంద్రం అంగీకరించడం లేదు. ఇందులో రుణ మాఫీ కింద రూ.7069 కోట్లు, వృద్ధాప్య పింఛన్ల కింద రూ.3391 కోట్లు, డిస్కాంలకు ఆర్థిక ప్రయోజనాల ప్యాకేజి కింద రూ.1500 కోట్లు ఉన్నాయని, అలాగే 2015 వేతన సవరణ అమలు ద్వారా ఏర్పడ్డ భారాన్ని కూడా కేంద్రం అంగీకరించడం లేదు. అందువల్లనే ఆ మొత్తాన్ని తిరస్కరిస్తున్నట్లు కేంద్రం చెప్పడాన్ని విభజన విభాగం ప్రస్తావిస్తూ, కేంద్రం తిరస్కరణ వెనుక ఉన్న పూర్తి వివరాలను ఇవ్వాలని ఆర్థిక శాఖను కోరింది. పెరిగిన 41 శాతం వేతనాలు పిఆర్‌సి వల్లనేనా? అని కూడా ప్రశ్నించింది. పెట్రోలియం బావుల్లో తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సగం సగం వాటాగా కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం చేసిన సూచనలను కేంద్రం కూడా ఆమోదించిన విషయాన్ని ప్రస్తావిస్తూ దానిపై తాజా పరిస్థితిని నివేదించాలని విభజన విభాగం అధికారులు కోరారు. ఈ మొత్తం సమాచారాన్ని రెండు రోజుల్లో ఇస్తే, తాము అధ్యయనం చేసి, కేంద్రం వద్దకు వెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు.

రెండో రోజు టెట్ ప్రశాంతం
93.33 హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రెండో ప్రశాంతం జరిగింది. గురువారం నిర్వహించిన పేపర్-1(తెలుగు)కు మొత్తం 46,352 (93.33 శాతం) హాజరయ్యారని టెట్ కన్వీనర్ ఎ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన పేపర్-1 (తెలుగు)కు 25,350 మంది అభ్యర్థులకు కేటాయించగా 23,086 (91.07శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 24,312 మందిని కేటాయించగా 23,266 (95.70శాతం) పరీక్ష రాశారు.

దీక్ష

చిత్తూరులో జరిగిన ఆత్మగౌరవ దీక్షల్లో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి



ప్రత్యేకహోదా ఇవ్వడం కాంగ్రెస్‌కే సాధ్యం
పిసిసి రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడం కాంగ్రెస్‌కే సాధ్యమని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వవైభవాన్ని సంతరించు కోనున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రుల ఆత్మగౌరవం పేరుతో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ మార్చి 9వ తేది నుంచి ఏప్రేల్ 9వ తేదీలోపు ప్రత్యేక హోదా సాధించుకుంటేనే తెలుగుజాతి ఆత్మగౌరవం నిలుస్తుందని, లేకుంటే ప్రత్యేకహోదా సాధ్యం కాదన్నారు. మొన్నటి వరకూ ప్యాకేజీ చాలన్న టిడిపి నేడు హోదా కోసం పోరాటం చేస్తున్నామనడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి, టిడిపిలు తెలుగు ప్రజలను మోసం చేశాయని, తిరుపతి సభలో నరేంద్రమోడీ, వెంకయ్య నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటలను మరిచిపోయారని విమర్శిం చారు. మాజీ ఎంపి చింతామోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ కారణమంటూ తప్పుడు ప్రచారం చేశారని, నేడు ప్రజలు వాస్తవ పరిస్థితిని గమనించి కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పరిశ్రమలు, ప్రాజెక్టులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి షాజహాన్‌భాషా, నాయకులు టికారామ్, కలికిరి సుబ్రమణ్యం, రాష్ట్ర పరిశీలకులు మార్థిన్ లూథర్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నైరుతి బంగాళాఖాతంలో ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ తమిళనాడు- శ్రీలంక తీరానికి సమీపంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. మరోవైపు దక్షిణ అండమాన్ సముద్రంలో ఆగ్నేయ బంగాళా ఖాతానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నట్లు తెలిపింది. మరోవైపు అరేబియాలో లక్ష్యద్వీప్ నుంచి దక్షిణ గుజరాత్ తీరం వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు పేర్కొంది. వీటి ప్రభావం రాష్ట్రంపై ఉండదని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నాలుగు రోజుల పాటు కోస్తా, సీమల్లో పొడి వాతావరణమే కొనసాగుతుందని తెలిపింది. పగలు ఎండలు, రాత్రి వేళల్లో చలి ప్రభావం చూపిస్తాయని వివరించింది.

ముందస్తు నిర్బంధం

- సిఎం పర్యటనతో అనంతలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సహా పలువురు అరెస్ట్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి/ అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా పెనుకొండలో గురువారం 'కియో' కార్ల పరిశ్రమలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న సందర్భంగా బుధవారం అర్ధరాత్రి నుంచే జిల్లాకు చెందిన పలువురిని అక్రమంగా అరెస్టు చేశారు. సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాలు, న్యాయవాదులను అక్రమంగా నిర్బంధించారు. రాయలసీమ ప్రాంతానికి ప్రభుత్వ మిచ్చిన హామీలను అమలు చేయాలని గత కొంత కాలంగా జిల్లాలో వామపక్షాలు, ప్రజా సంఘాలు, న్యాయవాదులు పోరాటం సాగిస్తు న్నారు. సిపిఎం ఉత్తర ప్రాంత కార్యదర్శి వి.రాంభూపాల్‌ను అరెస్టు చేసి అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దక్షిణ ప్రాంత కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌ను హిందూపురంలో అరెస్టు చేశారు. రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులును పెనుకొండలో అరెస్టు చేశారు. బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు హరినాథరెడ్డి, నారాయణరెడ్డి, రాజారెడ్డి లను బుధవారం సాయంత్రమే అరెస్టు చేశారు. వీరితోపాటు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తదితర ప్రజాసంఘాల నాయకులనూ అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా 160 మంది సిపిఎం నాయకులు, కార్యకర్తలను, 250 మంది న్యాయవాదులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. కొందరు ముఖ్య నాయకులను దూం ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. కొందరిని పోలీస్ వాహనాల్లో ఎక్కించుకుని చంద్రబాబు సభ ముగిసే వరకూ ఎక్కడెక్కడో తిప్పారు.



హిందూపురంలో ఇంతియాజ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు



పెనుకొండ పోలీసులు ఓబులు తదితరులను అరెస్టు చేసిన దృశ్యం

ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయటం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసినట్లుగా ఉందని సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసి కియా పేరుతో మభ్యపెడుతున్నదని విమర్శించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని సిపిఎం రాయలసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టులు అక్రమం సిపిఎం, సిపిఐ ఖండన

అనంతపురంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులను సిపిఎం, సిపిఐ ఖండించాయి. ఈ మేరకు ఇరు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు పి మధు, కె రామకృష్ణ గురువారం వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్ల గడిచినా ఇప్పటికీ హైకోర్టు విభజన పూర్తి కాలేదని ఎంతో కాలంలో రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారని మధు తెలిపారు.

ప్రభుత్వం హైకోర్టు విభజనకు, రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు అవసరమైన చర్చలు చేపట్టకుండా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న న్యాయవాదులను, సిపిఎం నాయకులను ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తుగా అరెస్టు చేయడం నిరంకుశ చర్య తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు. దీనిని ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని కోరారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, న్యాయవాదులతో చర్చ జరిపి హైకోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించడం అమానుషమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. న్యాయవాదుల జెఏసి నేతలను ముందురోజు రాత్రి నుంచే పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తిప్పి నిరంకుశంగా వ్యవహరించారని, ఇది తీవ్ర గర్హనీయమని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి దుర్మార్గంగా నిర్బంధకాండకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. బ్యాంకుల కుంభకోణాలపై అధ్యయానికి ఆర్‌బిఐ నియమించిన కమిటీ?
2. భవిష్యత్ సాంకేతిక, కృత్రిమ మేధస్సు, 5జి కోసం ఏ సంస్థతో బిఎస్‌ఎన్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది?
3. 5వ కామెన్వెల్త్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్ 2018ను ఏ దేశం గెలుచుకుంది?
4. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ప్రారంభించిన పార్టీ పేరు?
5. మాతృభాష దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఏప్రిల్ 8న గురుకుల ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష

మార్చి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయాలు, ఎపి గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతి ప్రవేశానికి ఇకపై ఉమ్మడిగా ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడించారు. 2018-19 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 8వ తేదీన నిర్వహించే పరీక్షతో ఆయా విద్యా సంస్థల్లో సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సచివాలయంలో పబ్లిసిటి సెల్‌లో పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మంత్రి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వేర్వేరుగా పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు నాలుగు పరీక్షలకు హాజరవ్వాల్సి వచ్చేదన్నారు. విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని, ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా విద్యా సంస్థల్లో సీట్లు భర్తీ చేస్తామన్నారు. 4వ తరగతి ఇంగ్లీషు, తెలుగు, గణితం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల నుంచి 10 ప్రశ్నల చప్పున మల్టిపుల్ ఛాయిస్‌లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరపనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నాటికి 10 నుంచి 13 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మాధ్యమంలో పరీక్ష రాసేందుకు అవకాశం ఉందన్నారు. గత ఏడాది ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ విద్యాలయాల్లో 17 వేల సీట్లకు 54 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 14,760 సీట్లు ఉన్నాయని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2,760, వెనుకబడిన తరగతులు సంక్షేమ పాఠశాలల్లో 3,400 ఏపీ గురుకుల విద్యాలయాల్లో 3,960 సీట్లు చప్పన మొత్తం 24,820 సీట్లకు లక్ష వరకూ దరఖాస్తులు రావచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇందుకోసం రూపొందించిన www.apgpcet.apcfss.in వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి వి.రాము, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి దేవర వాసు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్, వెల్ఫేర్ సర్వీస్ పోస్టుల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి వైద్య విధాన పరిషత్‌లో ఎపిపిఎస్సీ నిర్వహించిన సివిల్ అసిస్టెంట్ పోస్టులు, వెల్ఫేర్ సర్వీస్ పోస్టుల పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. వైద్య విధాన పరిషత్‌లో గైనాకాలజీ పోస్టులకు 20 మంది, అనస్తీషియా పోస్టులకు 13 మంది, పిడియాట్రిక్ పోస్టులకు 19మంది, జనరల్ మెడిసిన్‌కు 6 గురు, జనరల్ సర్జన్‌కు 5గురు, ఈఎన్‌టికి 7గురు అర్హత సాధించారు. ఆర్థోపెడిక్, పైతాలజీ పోస్టులకు ఏవరూ అర్హత సాధించలేదని పేర్కొంది. అర్హత సాధించిన అభ్యర్థులు మార్చి 7న విజయవాడలోని ఎపిపిఎస్సీ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని ప్రకటించింది. అభర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని హజరు కావాలని పేర్కొంది. అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను ఓఓఓ.జూంఎ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వెల్ఫేర్ సర్వీస్ విభాగంలో నిర్వహించిన పోస్టుల ఫలితాలను కూడా విడుదల చేసింది. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు 46 మంది అర్హత సాధించారని వెల్లడించింది. అర్హత సాధించిన అభ్యర్థులకు మార్చి 5 నుంచి 7 వరకు విజయవాడలోని ఎపిపిఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రకటించింది. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొంది. వీరి ఫలితాలను కూడా ఎపిపిఎస్సీ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

ఉత్తమ విధానాలతో వడగాలుల నష్టాన్ని నివారించాలి: ఎన్‌డిఎంఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తమ విధానాల అమలుతో వడగాలుల నష్టాలను ఎదుర్కోవాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) జాయింట్ సెక్రటరీ తిరుప్పుగజ్ సూచించారు. వడగాలులు, సంసిద్ధత, ఉపశమన చర్యలపై విజయవాడ డివి మేనర్‌లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో భాగంగా గురువారం రెండోరోజు ఆయన పాల్గొన్నారు. వాతావరణ మార్పుల వల్ల వడగాలుల తీవ్రత ఆధారపడి ఉంటుందని, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్‌డిఎంఎ సభ్యులు ఆర్‌కె జైన్ మాట్లాడుతూ జాతీయ వర్క్‌షాప్‌లోని అంశాలను అధ్యయనం చేసి రాష్ట్ర స్థాయిలో మార్చి లోపు వర్క్‌షాప్‌లను నిర్వహించాలని కోరారు.

ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా ఎపి
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాష్ట్రాన్ని ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో గురువారం జరిగిన 'కియో' కార్ల పరిశ్రమలో ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. బిజినెస్‌లో ఈజీ ఆఫ్ డూయింగ్‌లో అగ్రభాగంలో ఉన్నందున పెట్టుబడులు రావడానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. 1946 ఒప్పందాలు జరిగాయని, వీటి వల్ల రూ.13.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని చెప్పారు. 32 లక్షల మందికి ఉపాధి లభించే వీలుందని చెప్పారు. కియో కార్ల పరిశ్రమలో స్థానికులకు ఉపాధి కల్పిస్తారా అని మీడియా ప్రతినిధులు అడిగిన దానిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ప్రాధాన్యత ఉంటుంది, అయితే వారికి ఇంత శాతమన్న రిజర్వేషన్ వీలుపడదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో లేపాక్షి తదితర పరిశ్రమల పేరుతో వేల ఎకరాలు సేకరించిన భూములు వృధాగా ఉన్నాయని, ఆ భూములు వ్యవహారం న్యాయ స్థానం పరిధిలో ఉందని చెప్పారు. అయినా బ్యాంకులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి ఇతర పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల వల్ల ఇప్పటికే ఐసుజీ, హీరో తదితర పరిశ్రమలు వచ్చాయన్నారు. రాబోయే కాలంలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పడంతోపాటు రాష్ట్రాన్ని ఒక ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఇవ్వాల్సిందేనని మరోమారు స్పష్టం చేశారు.

మార్చి 5 నుంచి బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్చి 5వ తేదీ నుంచి ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు మార్చి 5 సోమవారం ఉదయం గం.9.30 నిమిషాలకు ప్రారంభం కానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎంపి వ్యాఖ్యలకు విష్ణుకుమార్‌రాజు ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపి విజయసాయిరెడ్డి ఐఎఎస్, ఐపిఎస్‌లపై చేసిన వ్యాఖ్యలను బిజెపి శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజు ఖండించారు. సచివాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు వారికి కేటాయించిన విధులు నిర్వహిస్తారని, ప్రభుత్వాలు మారతాయి కానీ.. అధికారులు మారరు అనే విషయాన్ని గుర్తు చేశారు. అధికారులకు రాజకీయాలు అంటగట్టడం, బురద జల్లడం సరికాదని వ్యాఖ్యానించారు.

మహాటివి వాహనంపై దాడి
ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

విజయనగరం జిల్లా కేంద్రంలో 'ఢిల్లీతో ఢీ.. ఆంధ్ర రెడీ' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బుధవారం రాత్రి జెడ్‌పి అతిథిగృహానికి చేరుకున్న మహాటివి సిబ్బంది కారుపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. ఈ ఘటనలో ఆ కారు అద్దం పగిలిపోయింది. దీనిపై జిల్లా ఎస్‌పి జి.పాలరాజుకు మహాటివి సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ దాడిని ఎపిడబ్లుజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌నాయుడు ఖండించారు.

మోడీ వచ్చి ఏమిస్తారో చూడాలి..
మంత్రి ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో ప్రధాని మోడీ రాష్ట్రానికి వస్తారనే సమచారం అందిందని రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధక శాఖల మంత్రి ఆదినారాయణరెడ్డి అప్పుడైనా ఏం ప్రకటిస్తారో వేచి చూడాలని అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు బుందేల్‌ఖండ్‌కు ఏడాదిలోగా రూ.20 వేల కోట్లు ఇచ్చిన కేంద్రం, నాలుగేళ్లు గడుస్తున్నా ఎపికి ఇచ్చిన హామీలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి మేలు చేకూరుతుందని ప్రత్యేక ప్యాకేజికి అంగీకరించినా 18 అంశాలు నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, లేకుంటే, సిఎం చంద్రబాబు రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

ప్రత్యేకం

సిఐఐ భాగస్వామ్య సదస్సుకు చురుగ్గా ఏర్పాట్లు

- నేషనల్ ఇండస్ట్రియల్ పాలసీపై తుది నిర్ణయం
- 24, 25, 26 తేదీల్లో విశాఖ ఎపిఐఐసి మైదానంలో సదస్సు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) భాగస్వామ్య సదస్సు-2018కు విశాఖ నగరం సిద్ధమవుతోంది. 24,25,26 తేదీల్లో ఎపిఐఐసి మైదానం వేదికకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులను మరింత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమా చారం. సదస్సుల్లో పెట్టుబడులు ఉప్పెనలా ముంచెత్తాలని, గతంలో మాదిరిగానే రాష్ట్రస్థాయి ఇండస్ట్రీస్, ఎపిఐఐసి, ఫుడ్‌ప్రోసెసింగ్, టూరిజం తదితర శాఖాధికారులకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీచేసి చకచకా ఏర్పాట్లు సాగిస్తు న్నారు. 2016లో తొలి సిఐఐ సదస్సులోనే ఇకపై ఏటా జరిగే సిఐఐ సదస్సులకు 'విశాఖ'ను శాశ్వత వేదికగా మార్చాలని తీసుకున్న నిర్ణయం తర్వాత మూడో సదస్సు ఇది. తొలి రోజు 24వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు సిఐఐ సెషన్స్ విశాఖ ఎపిఐఐసి మైదానంలో ప్రారంభమయ్యే కార్యక్ర మంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, సిఎం చంద్రబాబుతో సహా ఆదానీ కూడా పాల్గొంటారు. ఈ సదస్సుకు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' రవిశంకర్ (బెంగళూరు) కూడా హాజరుకానున్నారని సమాచా రం. 24న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జాతీయ పారిశ్రామిక విధానం (తుదిపత్రం)పై ఇక్కడే వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసే కొంతమంది కామర్స్ మినిస్టర్స్ ఆధ్వర్యాన విధానపత్రం వెలువడే అవకాశాలున్నా యని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



సిఐఐ సదస్సుకు సిద్ధమవుతున్న ఎపిఐఐసి మైదానం

ఏరోస్పేస్, ఆటోమొబైల్ ఇండస్ట్రీ, మెడికల్ ఎక్విప్‌మెంట్‌పై ప్రత్యేక సెషన్స్

సిఐఐ సదస్సుల్లో ఏరోస్పేస్, ఆటోమొబైల్ ఇండస్ట్రీ, మెడికల్ ఎక్విప్‌మెంట్‌లపై ప్రత్యేకంగా చర్చించనున్నారని సమాచారం. గతంలో సిఐఐ సదస్సుల్లో పై అంశాలు లేవు. ఫుడ్‌ప్రోసెసింగ్, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు ఎపిలో 2016, 2017 సంవత్సరాల్లో జరిగిన సదస్సుల సందర్భంగా వచ్చిన పరిశ్రమల దరఖాస్తులకు మోక్షం లభించకపోవడానికి భూమి కొరతే కారణమని ఇండస్ట్రియల్ అధికారులు తాజాగా వెల్లడించారు.

సంక్షిప్తం

నాలుగో రోజు కొనసాగిన హెల్త్ వర్సిటీ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిధులను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జిఒ 8ను రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. తమ డిమాండ్లపై హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించేదిలేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. సిఆర్‌డిఎ పరిధిలో వర్సిటీకి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యేటా బడ్జె ట్‌లో కేటాయించే గ్రాంట్ రూ 6 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పెంచా లని కోరారు. యూనివర్సిటీలో గత 25 ఏళ్ల నుంచి ఉద్యోగంలో ఉన్న తాత్కాలిక ఉద్యోగులకు సర్వీస్ రెగ్యులరైజ్ చేసి, వారి జీతాలను వర్సిటీ నిధుల నుంచే చెల్లించేలా ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాల న్నారు. ఈ మేరకు యూనివర్సిటీ వనరుల పరిరక్షణ సమితి సభ్యులు విసి సివి రావును కలిసి తమ డిమాండ్ల పై వినతి పత్రం అందజేశారు.

భట్టరాజ ఫెడరేషన్‌కుపాలక వర్గాన్ని నియమించాలి సిఎంకు సిపిఐ లేఖ

ఆంధ్రప్రదేశ్ భట్టరాజ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించాలని సిపిఐ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ గురువారం లేఖ రాశారు. భట్టరాజ కులస్థులు రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ఉన్నారని, వీరిలో 75 శాతం దారిద్ర్యరేఖకు దిగువన దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని రామకృష్ణ పేర్కొన్నారు. వీరి అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్రంలో జీవో 21 ద్వారా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ భట్టరాజ కోపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఏర్పాటైందని గుర్తు చేశారు. పాలక వర్గాన్ని నియమించి సంక్షేమ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారన్నారు.

స్టీల్‌ప్లాంట్ లోకో షెడ్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు కర్మాగారంలోని ట్రాఫిక్ విభాగంలో లోకో వ్యాగన్ రిపేర్ షాప్ (ఎల్‌డబ్ల్యుఆర్‌ఎస్)లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడున్న కార్మికులు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి. లోకోకు మరమ్మతు నిమిత్తం వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పు రవ్వలు కింద పిట్‌లో ఉన్న ఆయిల్‌లో పడటంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో కార్మికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఏమాత్రం అప్రమత్తంగా వ్యవహరించకుండా ఉండి ఉంటే పెను ప్రమాదం జరిగేదని సాక్షులు చెబుతున్నారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో హ్యాపి మూమెంట్స్ ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్వహించిన గ్రాండ్ మ్యూజిక్‌నైట్‌లో మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

వీనుల విందుగా గ్రాండ్ మ్యూజిక్ నైట్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో నేరేళ్ల సురేష్ కుమార్ నేతృత్వంలోని హ్యాపి మూమెంట్స్ ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్వహించిన గ్రాండ్ మ్యూజిక్‌నైట్ వీనుల విందుగా సాగింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గాయకులు తెలుగు, హిందీ ఆపాతమధురాలను ఆలపించి అలరించారు. హిందీ మెలోడి, తెలుగు యుగళగీతాలతో వీనుల విందు చేశారు. చిన్నారి చెర్రి స్వరూప్ ముత్యాల డ్రమ్స్ వాయించి ఆందరిని ఆశ్చర్యపరిచాడు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ఢిల్లీ పెద్దల హృదయాలను కరిగించి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులను రాబట్టేలా సంగీతాన్ని వినిపించాలని కళాకారులను కోరారు. దీని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఢిల్లీలోని ఎపి భవన్‌లో సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయభాస్కర్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు, కల్చరల్ సెంటర్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి గోళ్ల నారాయణరావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.బలరామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - పెడన

అప్పుల బాధ తాళలేక కృష్ణాజిల్లా పెడనకు చెందిన చేనేత కార్మికుడు మెట్ల లక్ష్మీనారాయణ (45) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే పట్టణానికి చెందిన పిల్లా ఏడుకొండలు వద్ద చేనేతకు సంబంధించి సరులు పనికి వెళ్తున్నాడు. అతని వద్ద రూ.30 వేలు అడ్వాన్స్‌గా తీసుకొని కొన్నిరోజులు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత ఏడుకొండలు లక్ష్మీనారాయణను పనికి రమ్మని ఒత్తిడి చేశాడు. పనికి వెళ్లినా రూ.30 వేలు అప్పు తీర్చే పరిస్థితి కనిపించలేదు. దీంతో బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిర్ణీత వేళల్లో రేషన్ దుకాణాలు తెరిచే ఉంచాలి

మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలోని చౌకధరల దుకాణాలన్నీ ప్రభుత్వం నిర్దేశించిన పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంచకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. గురువారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల సంయుక్త కలెక్టర్లు, జిల్లా పౌరసఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. అనేక ప్రాంతాల్లో డీలర్లు చౌకధరల దుకాణాలు తెరవట్లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. చౌకధరల దుకాణాలు తెరవకపోతే ఐదు రోజులపాటు చూస్తామని, ఆరో రోజు తప్పని సరిగా చర్యలు తీసుకుంటామని, విషయాన్ని డీలర్లకు తెలియచేయాలని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ తప్పనిసరిగా దుకాణం తెరిచి ఉంచాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

కామినేనిపై చినరాజప్ప గరంగరం

వైద్యాధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-సామర్లకోట (తూర్పుగోదావరి)

సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావును ఫోన్‌లో ప్రశ్నించారు. వైద్య విధాన పరిషత్ డిసిహెచ్ఎస్, డిఎంహెచ్ఒలపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట ప్రభుత్వాసుపత్రి ప్రహరీ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి ఆసుపత్రిని సందర్శించి, వైద్య సేవలందిస్తున్న తీరును పరిశీలించారు. ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌కు ఫోన్ చేసి, స్పీకర్ ఆన్‌చేసి అందరిముందే పలు అంశాలపై మాట్లాడారు. కిందిస్థాయి సిబ్బంది సమీపంలోని పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసాయం పొందాలంటూ రోగులకు సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా వెంటనే ఆసుపత్రిలో పిల్లల వైద్యుడిని, ఇతర వైద్యులను నియమించడంతోపాటు రాత్రి సమయాల్లోనూ వైద్యం అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోందని, నిర్మించాలని నాలుగేళ్లలో వందసార్లయినా చెప్పి ఉంటానని కామినేనికి గుర్తు చేశారు. తగు చర్యలు చేపడతామని మంత్రి కామినేని శ్రీనివాస్ ఉపముఖ్యమంత్రి చినరాజప్పకు హామీ ఇచ్చారు. ఆసుపత్రి ఆవరణలో ఆక్రమణలు తొలగించి, దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి రాజప్ప స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్, కిషోర్, డిఎంహెచ్ఒ ఎం.చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కానూరులో ఘర్షణ - ఉద్రిక్తత

మీడియా ప్రతినిధులపై వసతి గృహం నిర్వాహకుల దాడి

ఎపిడబ్ల్యూజెఎఫ్ ఖండన

ప్రజాశక్తి - పెనమలూరు

విజయవాడ సమీప ంలోని పెనమలూరులో వసతి గహం నిర్వాహకు లకూ, ఇంజనీరింగ్ విద్యార్థికీ మధ్య బకాయిల వ్యవహారం పరస్పర దాడులకు దారితీసింది. పరస్పరం కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో పెనమలూరు మండలం కానూరులో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. న్యూస్ కవరేజికి వెళ్లిన టివి 5 ప్రతినిధిపై, కెమెరామెన్‌పై వసతి గృహం నిర్వాహకులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కానూరులోని సాయిచలపతి వసతి గహంలో పీవీపీ ఇంజినీరింగ్ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థి సూర్యవంశీ వసతిగృహంలో అద్దెకుంటున్నాడు. అతను రూ.1400 హాస్టల్‌కు బకాయి ఉన్నాడు. దీనిపై వసతి గహం నిర్వాహకురాలు శ్రీలతకూ, సూర్యవంశీకీ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వివాదం ముదరడంతో సూర్యవంశీపై శ్రీలత, ఆమె భర్త సాయిప్రసాద్‌తోపాటు మరో ఆరుగురు దాడిచేశారు. ఈ దాడిపై పరస్పరం కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనను కవరేజీ చేసేందుకు వెళ్లిన టివి 5 ప్రతినిధిపై, కెమెరామెన్‌పై సాయిచలపతి వసతి గహం నిర్వాహకులు శ్రీలత, ఆమె భర్త సాయిప్రసాద్, మరికొందరు దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ ఖండన

మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) విజయవాడ నగర కమిటీ తీవ్రంగా ఖండించారు.

న్యాయవాదులపై పోలీసుల నిర్బంధం

అనంతపురం, కర్నూలులో అరెస్టు

కడపలో కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదుల దీక్షలు గురువారం కొనసాగాయి. అనంతపురం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని హెచ్చరించిన అనంతపురం, కర్నూలు, కడప న్యాయవాదుల సంఘం నాయకులను బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. పోలీసులను తప్పించుకుని వెళ్లిన న్యాయవాదులను సైతం జిల్లా సరిహద్దుల్లో అరెస్టు చేశారు.

కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగలక్ష్మిదేవి, సీనియర్ అడ్వకేట్ జయరాజు, బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.కుమార్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఐలు నాయకులు బి.వెంకటస్వామి, పి.నిర్మల, సీనియర్ అడ్వకేట్ ఓంకార్ కర్నూలు నుంచి అనంతపురం వెళ్తుండగా వెల్దుర్తి వద్ద పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. అనంతపురం జిల్లాలో దీక్షలు కొనసాగాయి. కదిరి పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలను పోలీసులు భగ్నం చేసి, వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో చేపట్టిన న్యాయవాదుల దీక్షలకు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కడప జిల్లాలో దీక్షలు 31వ రోజుకు చేరాయి. యానాదయ్య, గంగశేఖర్, రంగబాలాజీ, పాలకొండరాయుడు దీక్షలో కూర్చున్నారు. కడప బార్ అసోసిచేషన్ అధ్యక్షలు అరుణకుమారి మాట్లాడారు.



కర్నూలు జిల్లా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట అరెస్టయిన న్యాయవాదుల నిరసన

యువకుని దారుణ హత్య, దహనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైం

ఓ యువకుడ్ని దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని తగులబెట్టిన ఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం పాత తుంగపాడు సమీపంలో గురువారం వెలుగుచూసింది. కడియంలోని చైతన్య నగర్‌కు చెందిన ప్రవీణ్ (20) రాజమహేంద్రవరంలో ఒక ఎమర్జెన్సీ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. నామవరం ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే ఒక వివాహితతో ప్రవీణ్‌కు పరిచయం ఉంది. ఆమె వ్యక్తిగత కారణాల వల్ల కొందరిపై కేసు పెట్టింది. ఆ కేసును ఉపసంహరించుకోవాల్సిందిగా కొందరు వ్యక్తుల నుంచి బెదిరింపులు వస్తున్నాయంటూ మంగళవారం సాయంత్రం ప్రవీణ్‌ను తోడు తీసుకుని వెళ్లింది. ప్రవీణ్ జి.యర్రంపాలెం పాతతుంగపాడు గ్రామంలో గురువారం కాలిన మృతదేహంగా కనిపించాడు.

సంపాదకీయం

ఆశ్రిత కుంభకోణాలు

నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అత్యంత ప్రమాదకరస్థాయికి చేరుకుంది. అందుకు బ్యాంకుల్లో వరుసగా వెలుగు చూస్తున్న భారీ ఆర్థిక కుంభకోణాలే సాక్ష్యం. వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ను మోసగించి రూ.20 వేల కోట్లకుపైన స్వాహా చేసి అవలీలగా తప్పించుకున్నారంటే కేంద్ర ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల ప్రమేయం లేకుండా సాధ్యం కాదు. స్థానికంగా వారిపై కేసులు నడుస్తుండగా ఆదాయపన్ను (ఐటి), కేంద్ర నేర పరిశోధన సంస్థ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), విమానయాన, పాస్‌పోర్టు, ఇమ్మిగ్రేషన్ ఇన్ని శాఖల కళ్లుగప్పి ఆర్థిక నేరస్తులు విదేశాలకు పారిపోవడం మామూలుగా అయితే దుర్లభం. సదరు వైట్ కాలర్ క్రిమినల్స్‌కు నూటికి నూరుపాళ్లు కేంద్ర సర్కారు నుండి మద్దతు లభించబట్టే ఇలా జరిగింది. పిఎన్‌బి కుంభకోణంపై సిబిఐ, ఇడిల దర్యాప్తుల్లో వెలుగు చూస్తున్న ఆర్థిక అరాచకాలు యావత్ దేశాన్నీ కుదుపుతుండగా స్కాం బయట పడి ఇన్ని రోజులైనా ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పకపోవడం ఈ విషయాన్నే చెబుతోంది. ప్రతి చిన్న దానికీ మన్ కె బాత్, చాయి పె బాత్ అంటూ ప్రసార మాధ్యమాల్లో తమ ఏలుబడిని కీర్తించుకునే ప్రధానికి నీరవ్ మోడీ, చోక్సీల దగ్గరకొచ్చేసరికి గొంతు పెగలట్లేదు. ఇటీవలే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొనేందుకు దావోస్‌కు ఏతెంచిన మోడీ ఎంచక్కా నీరవ్‌తో కలిసి ఫొటో దిగారు. అంతలోనే స్కాం బట్టబయలైంది. దీనిపై జాతికి స్వయంగా సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన బాధ్యత ప్రధానిపై ఉంది. నీరవ్, చోక్సీలు కలిసి బ్యాంకులకు రూ.11,400 కోట్లు సున్నం పెట్టారని తమ ప్రభుత్వంలోని అత్యున్నత విచారణా సంస్థలైన సిబిఐ, ఇడిలు వెల్లడించాయి. వీరు స్వాహా చేసిన సొమ్ము అంతకంటే ఎక్కువే, సుమారు 17,000 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇంకా శోధన సాగుతోంది. కుంభకోణాన్ని మాఫీ చేసేందుకు పిఎన్‌బి ప్రయత్నిస్తోంది. అలాంటప్పుడు బాధ్యతాయుత స్థానంలో ఉన్న మోడీ ఈ స్కాంపై మౌనం దాల్చడం దేనికి సంకేతం?

యుపిఎ హయాం కుంభకోణాల మయమని, తాము అధికారంలోకొచ్చాక ఆర్థిక వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని ప్రధాని, ఆర్థిక మంత్రి జైట్లీ చేస్తున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని బ్యాంకుల్లో పరిస్థితులే కళ్లకు కడుతున్నాయి. బ్యాంకుల్లో పేరుకుపోయిన పారు బకాయిలు (ఎన్‌పిఎ) రూ.20 లక్షల కోట్లకుపైమాటే. బ్యాంకులు ఇప్పటి వరకు ప్రకటించిన ఎన్‌పిఎలు రూ.9 లక్షల కోట్లు. అంబానీ, అదానీ, అమాంబాపతు పెద్ద పెద్ద కార్పొరేట్లు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించకుండా మొండికేశారు. బ్యాంకులు తమ లాభాల్లో నుంచి కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తున్నాయి. బ్యాంకులు అంతర్గత సంస్కరణలు అమలు చేయడం ద్వారా పాలనాపద్ధతులను మెరుగుపర్చుకోవాలన్న షరతుపై రానున్న రెండేళ్లలో రూ.రెండు లక్షల కోట్ల పెట్టుబడులు (రీకేపిటలైజేషన్) సమకూరుస్తున్నట్లు జైట్లీ చెపుతున్నారు. పిఎన్‌బికి రూ.5 వేల కోట్లు వచ్చింది. ఇదే సమయంలో నీరవ్, చోక్సీల మోసం వలన అంతకు మూడు రెట్లు ఆ బ్యాంక్ నష్టపోయింది. కేంద్రం బ్యాంకులకు అందజేసే రీకేపిటలైజేషన్ ప్రజల సొమ్ము. అది కార్పొరేట్ల స్కాంల భర్తీకి వాడటం దారుణం. నీరవ్, చోక్సీలు ఇంటర్ బ్యాంకింగ్ మెసేజింగ్ సిస్టం (స్విఫ్టు)ను తన కనుసన్నల్లో పెట్టుకొని తమ ఉద్యోగులను పిఎన్‌బిలోకి చొప్పించి మోసానికి పాల్పడ్డారంటే బ్యాంకులు పారిశ్రామిక వేత్తల చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయని తెలుస్తుంది. తాము మూడు లక్షల డొల్ల కంపెనీలను 'డి' రిజిస్టర్ చేశామని మోడీ వల్లిస్తుండగా నీరవ్, చోక్సీలకు చెందిన 200 కంపెనీలు ఆ జాబితాలోకి ఎక్కలేదు. ఇదీ బిజెపి సర్కారు చేపట్టిన ప్రక్షాళన తీరు.

బ్యాంకులకు పంగనామాలు పెడుతున్న పారిశ్రామికవేత్తలను, కార్పొరేట్ గ్రూపులను శిక్షించి వారి నుంచి బకాయిలు కక్కించాల్సిన మోడీ సర్కారు మరిన్ని పన్ను రాయితీలను ఉదారంగా సమర్పించుకుంటోంది. ఈ మూడున్నరేళ్లలో రూ.3 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేసింది. రక్షణ, మౌలిక సదుపాయాల కల్పనా ప్రాజెక్టుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు (పిపిపి) కుదుర్చుకొని కాంట్రాక్టులు అప్పగిస్తోంది. పన్నులు,బ్యాంక్ రుణాలు ఎగ్గొడుతున్న కార్పొరేట్లను వెంటేసుకొని స్వయంగా ప్రధాని విదేశీ పర్యటనలు చేస్తూ వారి కుంభకోణాలకు, అవినీతికి, నల్లధనానికి సాధనంగా మారుతున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను దిగుమతులపై ఓవర్ ప్రైసింగ్ చేస్తున్నట్లు ఆర్థిక శాఖ దర్యాప్తులో చేరింది. అంబానీ నుంచి అదానీ వరకు బొగ్గు దిగుబడుల్లో ఓవర్ ఇన్వాయిసింగ్‌కు పాల్పడి మోసం చేశారు. దివాలా తీసిన కంపెనీలను బ్యాంకులు వేలం వేసినప్పుడు అతితక్కువ బిడ్‌తో వాటి దూరపు బంధువులు స్వంతం చేసుకుంటున్నారు. ఈ ఉదంతాలన్నీ ప్రభుత్వ ఆశ్రిత పక్షపాతానికి మచ్చుతునకలు. ఇప్పటికైనా ప్రధాని మౌనం వీడి కార్పొరేట్ కుంభకోణాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలి. తూతూ మంత్రపు దర్యాప్తులు, రాజకీయ విమర్శలతో సరిపెడితే కుంభకోణాలకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందన్న విమర్శకు మరింత గట్టి ఆధారం లభించినట్లవుతుంది.

ఇదీ విషయం



రొక్కమెక్కు విస్తారని
ప్యాకేజీ అడిగారట...
జేబు నింపలేదుగా
హోదానే కావాలట!

దింపుడు కల్లం ఆశతో
జనం పైన పాచికలు...
గొంతులు మార్చేసి
ఇక వింత నాటకాలు!

- కొల్లూరు వెంకట్

ఆర్థిక విధానాలపై పోరాటం ద్వారానే బిజెపిని ఓడించగలం

ఇంటర్వ్యూ



2019 ఎన్నికల్లో బిజెపిని ఓడించటమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని, సరళీకరణ ఆర్థిక విధానాలపై పోరాటం ద్వారానే దాన్ని ఓడించగలమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ చెప్పారు. బిజెపి ఆర్థిక విధానాలనే అనుసరిస్తున్న కాంగ్రెస్‌తో కలిసి ఆ విధానాలపై పోరాడలేమని ఆయన ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ విశేషాలు...

రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించటమే ప్రధాన లక్ష్యంగా లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమీకరణ జరగాలని సిపిఎం ముసాయిదా తీర్మానం చెబుతోంది. అయితే కాంగ్రెస్‌తో ఎటువంటి అవగాహనా ఎన్నికల పొత్తూ లేకుండానే దీనిని సాధిస్తామంటున్నారు. ఇది పూర్తి వైరుధ్యంగా వుంది కదా?

ఇందులో వైరుధ్యమేమీ లేదు. కేవలం ఎన్నికల సమయంలోనే కొన్ని పార్టీలు దగ్గరకు చేరతాయని, ఇదంతా అంకెల గారడీ అని భావించే వారికి మాత్రమే వైరుధ్యంగా కన్పిస్తుంది. మాకు మాత్రం ఇది రాజకీయ పోరాటమే. బిజెపికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రజలను, ప్రజాతంత్ర శక్తులను ఏ విధంగా సమీకరించాలన్నదే అసలు ప్రశ్న. మోడీ ప్రభుత్వ విధానాలు.. ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధానం తదితర అంశాలపై మా పోరాటం కొనసాగుతుంది. ఈ విధానాలు, ముఖ్యంగా ఆర్థిక విధానాల కారణంగానే సామాన్యులు, రైతులు, కార్మికులు, మధ్య తరగతి వర్గాల వారు, చిన్న వ్యాపారులు అందరూ అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్‌కు కూడా ఇటువంటి వర్గ లక్షణాలే వున్నాయి. ఆ పార్టీ గతంలో బిజెపి తరహా విధానాలనే అనుసరించింది. వాస్తవానికి ఈ విధానాలను మొదలు పెట్టిందే వారు. అందువల్లే ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించేటప్పుడు అందులో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా లేక మిత్రపక్షంగా ఉండడానికి అవకాశం లేదు. ఈ రాజకీయ పంథా ప్రాతిపదికగానే బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలపైనా ముసాయిదా చర్చించింది.

అతి పెద్ద లౌకిక పార్టీ కాంగ్రెస్ లేకుండా ఇది ఎలా సాధ్యమవుతుంది?

ఎన్నికల వ్యూహాలన్నీ మా రాజకీయ వైఖరికి అనుగుణంగానే వుంటాయి. ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా పోరాడేందుకు అనేక రాజకీయ శక్తులు ముందుకు రావచ్చు. అయితే మా పార్టీ అనుసరిస్తున్న రాజకీయ వైఖరి నేపథ్యంలో వీటన్నింటితో మేం అవగాహన కుదుర్చుకోలేం కదా? ఈ నేపథ్యంలో బిజెపి వ్యతిరేక శక్తులను గరిష్ట స్థాయిలో ఏ విధంగా సమీకరించాలన్నదే అసలు ప్రశ్న. అయితే ఇదేమీ కొత్త కాదు. గతంలో 1993లో సైతం, బాబ్రీ మసీదు విధ్వంసం అనంతరం, బిజెపి ప్రభుత్వాలు రద్దయిన అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఈ అంశంపై తొలిసారిగా మేం అప్పుడే చర్చించాం. బాబ్రీ మసీదు విధ్వంసానికి సారథ్యం వహించిన పార్టీ ప్రమాదకరమైనదన్న విషయాన్ని ఆనాడే హెచ్చరించాం. అయితే అప్పుడు కూడా మేం కాంగ్రెస్‌తో ఎటువంటి అవగాహనకూ రాలేదు. మాకు బలమున్న చోట్ల పరిమిత సంఖ్యలో, స్థానాలలో మాత్రమే పోటీ చేయాలని నిర్ణయించుకున్నాం. మిగిలిన చోట్ల బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని నిర్ణయించాం.

ఇప్పుడు కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తారా?

స్థిరమైన వ్యూహాలేవీ ఇప్పుడు పని చేయవు. త్వరలోనే కొన్ని రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే ఏడాది లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో మేం తగిన వ్యూహాన్ని రూపొందించుకుంటాం.

కానీ, ఈ వ్యూహాలు కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా సహకరించవంటారా?

సహకరిస్తాయా? లబ్ధి కలిగిస్తాయా? అన్నది ప్రశ్న కాదు. పార్టీ స్వతంత్రంగా ఎదుగుతూ బలోపేతం కావటానికి ప్రాధాన్యతనివ్వాలన్నదే మా రాజకీయ వైఖరి. ఇటీవలి కాలంలో సిపిఎం, వామపక్ష శక్తుల బలం కొంతమేర తగ్గింది. అయితే ఇది ఎన్నికల పోరు రూపంలో కాదు. ఉద్యమాల నిర్మాణంలో రాజకీయ పలుకుబడి విస్తరణలో. మా తొలి, మలి ప్రాధాన్యత అంతా వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని నిర్మించటమే. ఈ ప్రత్యామ్నాయంలో కాంగ్రెస్ వంటి పార్టీలకు స్థానం వుండదు. ఎన్నికల సమయం వచ్చినపుడు ఎవరితో ఎంతమేర సహకరించాలి? బిజెపిని ఓడించాలన్న లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలన్న అంశాన్ని అంచనా వేస్తాం.

గత నాలుగేళ్లలో బిజెపి బలం పుంజుకుంది. అయినప్పటికీ గత పార్టీ మహాసభలో తీసుకున్న వ్యూహాన్నే ఇప్పుడు కూడా కొనసాగిస్తారా?

మేం దీనిని రాజకీయ, సైద్ధాంతిక పోరుగా చూడటమే ఇందుకు ప్రధాన కారణం. దీనిని మేం సమర్ధవంతంగా నిర్వహించగలిగితే ఎన్నికల పోరులోనూ ఇది ప్రతిఫలిస్తుంది. బిజెపి రాజకీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందన్న విషయాన్ని మా తీర్మానాలు చెబుతున్నాయి. దీనిని ఏ విధంగా సాధించారన్నదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ప్రధానంగా ఒత్తిడి తేవాలని మేం బలంగా విశ్వసిస్తున్నాం.

అసంతృప్తికి ప్రధాన కారణం ఏమిటి? పోరాటాలు ఎక్కడ నిలిచిపోతున్నాయి?

రైతుల్లో, గ్రామీణ ప్రాంతాలలో బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారు. ప్రభుత్వ విధానాలతో వారి జీవనాధారం దెబ్బతినటమే ఇందుకు ప్రధాన కారణం. ఇక్కడి నుండే మేం విస్తృత స్థాయిలో ఐక్యతను నిర్మించాల్సి వుంది. ఇక్కడ మాకు ఎటువంటి తేడా లేదు. ఎవరైనా ఇందులో చేరవచ్చు.

మూడు రాష్ట్రాలు దాటి మీరు ఎందుకు విస్తరించలేకపోతున్నారు? బెంగాల్‌లో సైతం అనేక ఎదురుదెబ్బలు తగులుతున్నాయి?

ఇటీవలి కాలంలో బెంగాల్‌లో అనేక ఎదురు దెబ్బలు తగిలాయి. అనేక రాష్ట్రాలలో బూర్జువా పార్టీలు, ప్రాంతీయ పార్టీలతో కొనసాగుతున్న దీర్ఘకాలిక మైత్రితో మా సొంత పునాదులు బీటలు వారాయన్న విషయం మా సమీక్షలో వెల్లడయింది. రాజకీయాల్లో స్వతంత్రంగా వ్యవహరించలేకపోతే.. మా పార్టీకి.. ఇతర పార్టీలకు మధ్య గల తేడాను యువత గమనించలేదు. సహజంగానే మేం వారిని ఆకర్షించలేం.

మీ రాజకీయ తీర్మానం 'స్వీయ వైరుధ్యం'తో వుందని సిపిఐ అంటోంది?

మేం కూడా వారి ముసాయిదా తీర్మానాన్ని పరిశీలించాం. వారితో చర్చలు జరిపాం. వారి పార్టీ మహాసభ తర్వాత గత ఏడాది కాలంలో వారి అవగాహనను మార్చుకున్నారు. అన్ని ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలని వారంటున్నారు. దానర్థం కాంగ్రెస్‌ను కూడా కలుపుకోవాలని. దానికి మేం అంగీకరించటం లేదు. మేం ఇప్పటికే వారికి దీనిని స్పష్టంగా చెప్పాం. సిపిఎం, సిపిఐ మధ్య వున్న ప్రాథమిక వైరుధ్యం అది. వారికిది స్వీయ వైరుధ్యంగా కన్పించవచ్చు. కాంగ్రెస్ పార్టీని వారు తమ సహజ మిత్రుడిగా భావిస్తుంటారు. మేం దానిని అంగీకరించడం లేదు. ఈ విషయంలో విభేదాలున్నప్పటికీ రెండు పార్టీలూ కలిసి పని చేస్తూనే వున్నాయి. కాంగ్రెస్‌తో మైత్రి కొనసాగించినప్పుడు గతంలో ఏం జరిగిందో చూశాం.

2004 తరహాలోనే 2019లో హంగ్ తీర్పు వెలువడితే మీరు కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తారా?

2004 నాటి పరిస్థితిని గురించి ఇప్పుడు ఆలోచించటం అనవసరం, అనుచితం. అసలు నాటి ఎన్నికల్లో సిపిఎం అంతటి భారీ విజయాలను సాధిస్తుందని మేం కూడా ఊహించలేదు. నాటి ఎన్నికల్లో కేరళ లోని మొత్తం 20 పార్లమెంట్ స్థానాలలో లెఫ్ట్ 18 స్థానాలలో విజయం సాధించింది. ఇది ఒక మినహాయింపు మాత్రమే. 2019 ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా వుంటుందన్న అంశాన్ని కూడా మేం చెప్పటం లేదు. పరిస్థితి వచ్చినపుడు దానిని అధిగమించేందుకు ప్రయత్నిస్తాం. ఆ సమయంలో పరిస్థితుల ఆధారంగా మా వ్యూహాలుంటాయి. అయితే 2004లో మాదిరిగానే 2019లో కూడా కేంద్రంలో లౌకిక ప్రభుత్వం ఏర్పడుతుందా లేదా అన్నదే ప్రశ్న? ఈ అంశంపైనే మేం దృష్టి పెడతాం. అవసరమైతే అప్పటి పరిస్థితులను బట్టి ఎన్నికల అనంతర వ్యూహాన్ని రూపొందించుకుంటాం.

ప్రాంతీయ పార్టీలతో జాతీయ స్థాయిలో పొత్తు వుండదని చెప్పారు కదా?

ఇంతకు ముందు తృతీయ ప్రత్యామ్నాయ వేదిక (థర్డ్ ఫ్రంట్) పేరుతో అనేక ప్రాంతీయ పార్టీలను ఒకే తాటిపైకి తేవటానికి ప్రయత్నించాం. ఇది అసాధ్యమైన విషయంగా గుర్తించాం. గత కొంతకాలంగా ప్రాంతీయ పార్టీల లక్షణాలు, అవి నిర్వహించే పాత్రలో మార్పులు చోటు చేసుకోవటమే ఇందుకు ప్రధాన కారణం. ఇందులో అనేక పార్టీలు కేవలం రాష్ట్ర స్థాయికి మాత్రమే పరిమితమైనవి. బిజెపిని ఎలాగైనా ఓడించాలన్నది మా అందరి ప్రధాన లక్ష్యం. ఇందులో ఏ ప్రాంతీయ పార్టీ ఏ విధమైన పాత్ర పోషిస్తుందన్నది మేం అంచనా వేస్తాం. వారితో కుదుర్చుకునే అవగాహన మా ప్రయోజనాలకు చేటు చేయదన్న అంశంపైనే ఇది ఆధారపడి వుంటుంది. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్నారు. కానీ అనేక రాష్ట్రాలలో బిజెపి వ్యతిరేక పోరులో కీలక పాత్ర పోషించేది ప్రాంతీయ పార్టీలే. యుపిలో చూసుకుంటే బిజెపి వ్యతిరేక పోరులో కాంగ్రెస్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందా? లేక ఎస్పీ, బిఎస్పీలు కీలక పాత్ర వహిస్తాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇలా ప్రతి రాష్ట్రంలోనూ విభిన్న పరిస్థితులున్నాయి.

ఒకవేళ యుపిలో సమాజ్‌వాది పార్టీతో సిపిఎం పొత్తు కుదుర్చుకుని, ఆ పార్టీ కాంగ్రెస్‌తో దోస్తీ చేస్తే..?

మా వరకూ అది ప్రధానమైన అంశం కానే కాదు. బిజెపి ఓటమిని కోరుకునే ఎవరైనా బిఎస్పీ, ఎస్పీ ఐక్యంగా పోరాడాలని కోరుకుంటారు. ఇది కొంత మేర ప్రభావం చూపుతుంది తప్ప సిపిఎం ఎవరితో కలిసిందన్న విషయం కాదు. ఎన్నికల బరిలో బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావటమే అసలు విషయం.

జాతీయ స్థాయిలో పొత్తు కుదిరే అవకాశాలున్నాయా?

జాతీయ స్థాయిలో పొత్తు కుదిరే అవకాశాలేమీ లేవని భావిస్తున్నాను. బిజెపి వ్యతిరేక పోరులో రాష్ట్రాలవారీగా మాత్రమే పొత్తులుంటాయి.

మీ పార్టీ పొలిట్‌బ్యూరోలో విభేదాలున్నాయి కదా? పార్టీ మహాసభలో మీరు దీనిని ఏ విధంగా ఎదుర్కొంటారు?

ఇవి విభేదాలు కాదు. మా పార్టీలో రాజకీయ అంశాలపై భిన్నాభిప్రాయాలుండటం సహజమే. పొలిట్‌బ్యూరో ముసాయిదా ఒకటి వుంది. మైనార్టీ ముసాయిదా ఒకటి వుంది. ఒక నిర్దిష్ట అంశంపై ఎటువంటి వ్యూహం అనుసరించాలన్న స్పష్టత వుంది. అయితే ప్రస్తుత వ్యూహాలేవీ అంత ప్రధానమైనవి కాదు. ఎన్నికల వ్యూహాలకు అత్యంత చివరి ప్రధాన్యత. అయినప్పటికీ రాజకీయ ఎత్తుగడల విధానానికి ప్రాధాన్యత వుంది. రానున్న మూడేళ్లలో పార్టీ పని తీరును దిశా నిర్దేశం చేసేది ఇదే. ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం.

కానీ బెంగాల్ వ్యూహం.. కేరళ వ్యూహం.. అని రెండు వున్నాయంటున్నారు?

దీనిని గోరంతలు కొండంతలు చేసి చూపుతున్నారన్నదే నా భయం అంతా. కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయిలో పార్టీ పరంగా మాకు స్పష్టమైన అవగాహన వుంది. ఏ ఒక్కరూ ఏదో ఒక విభాగానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించరు. ఈ విషయంపై కేంద్ర కమిటీలో ప్రాంతీయ విభేదాలేమీ లేవు. దీనికి పొలిట్‌బ్యూరోలో 11-5 మెజార్టీ లభించింది. ఈ ఐదుగురూ బెంగాల్‌కు చెందిన వారే. మేం ఇప్పటికే దీనిపై చర్చించాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిర్దిష్టమైన ఎన్నికల అవగాహనను అనుసరించాలని పార్టీ రాష్ట్ర కమిటీ, పార్టీ నిర్ణయించటం, దీనిని కేంద్ర కమిటీ ఆమోదించకపోవటం అందరికీ తెలిసిందే. కొన్ని అంశాలపై కొన్ని సందర్భాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. ఇంతమాత్రానే దీనిని పార్టీలో విభేదాలుగా భావించటం సబబు కాదు. ఈ అంశంపై పార్టీ మహాసభల్లో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పూర్తి స్థాయిలో కొనసాగుతోంది. మేం మా అభిప్రాయాలను స్వేచ్ఛగా కచ్చితంగా చెబుతాం. ఒక నిర్ణయం తీసుకున్నపుడు దానిని అమలు పరుస్తాం.

కాంగ్రెస్ పార్టీతో అవగాహన కోసం బెంగాల్‌లో ఎందుకు డిమాండ్ పెరుగుతోంది?

బెంగాల్‌లో సాధారణ పరిస్థితి లేనందు వల్లే. ఎట్టి పరిస్థితులోనూ సిపిఎంను అణచివేసి తుడిచి పెట్టాలన్న లక్ష్యంతో అక్కడ అధికార పార్టీ పని చేస్తోంది. ఈ పరిస్థితుల్లో దానిని ఎదుర్కోవటం మాకు అవసరం.

ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో మీకు విభేదాలున్నట్లు వార్తలొస్తున్నాయి?

ఈ వార్తలను ప్రచారం చేసే వారు మమ్మల్ని ఇతర పార్టీలలో మాదిరిగానే చూస్తున్నారు. గతంలో వారు సుందరయ్యను, ఇతర నాయకులను ఈ విధంగానే చూశారు. వారు వ్యక్తిత్వం, వ్యక్తిగతం మాత్రమే చూస్తుంటారు. మాకు మాత్రం అది ప్రధానం కాదు. రాజకీయ అంశాలపై మేం చర్చిస్తాం, చర్చిస్తూనే వుంటాం.

పార్టీలో నాయకత్వ మార్పు వుంటుందా? వచ్చే మహాసభలలో కొత్త ప్రధాన కార్యదర్శి వస్తారా?

ఇప్పుడు ఈ అంశంపై మేం ఎటువంటి చర్చా జరపటం లేదు. పార్టీ మహాసభల సమయంలో పార్టీ నాయకత్వంతో మేం ఈ మొత్తం అంశాన్ని చర్చిస్తాం. అప్పుడు కొత్త కేంద్ర కమిటీ, కొత్త పొలిట్‌బ్యూరో ఏర్పడతాయి. దానితో పాటు ప్రధాన కార్యదర్శి కూడా. పార్టీ మహాసభల్లో రాజకీయ తీర్మానం, సంస్థాగత నివేదిక ఆమోదించిన తరువాతే దీనిపై చర్చ వుంటుంది.

త్రిపురలో గెలుస్తారా?

కచ్చితంగా.. త్రిపుర ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామన్న పూర్తి విశ్వాసం మాకుంది. ఎన్నికల అనంతరం ఎనిమిదో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడటం తథ్యం. త్రిపుర ఎన్నికల ద్వారా విస్తృతమైన రాజకీయ సందేశం వెలువడుతుంది. ఒక రాష్ట్రంలో వామపక్షాలకు, బిజెపికి ప్రత్యక్ష పోరు కొనసాగటం ఇదే తొలిసారి. ప్రతి చోటా తామే గెలుస్తామని బిజెపి చెబుతోంది. దానిని తిప్పికొట్టే సామర్థ్యం మాకుంది.

జన వాక్యం

నిధులు కీలకం



రాష్ట్ర ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో ఆదర్శ ఉన్నత పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలి. రాష్ట్రంలో 164 ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ప్రత్యేకంగా విద్యాశాఖ విభాగంలో నడిపించాలి. ఇటీవల కాలంలో ఆదర్శ పాఠశాలల సమస్యలపై, రెగ్యులర్ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు పద్ధతిపై, సర్వీసు నిబంధనల అమలుపై ఎమ్మెల్సీలతో ఒక కమిటీనీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీ సూచనలను తప్పకుండా అమలు చేయాలి. కమిటీ నిర్ణయాలు, అభిప్రాయాలను ప్రభుత్వ ఉత్తర్వుల రూపంలో తక్షణం విడుదల చేయాలి. ఇప్పటికైనా మోడల్ పాఠశాలల సమస్యలపై పరిష్కారం చూపాలి.

బి సురేష్, శ్రీకాకుళం.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

శూర్పణఖ రోదన

శూర్పణఖనే. రోదిస్తున్నాను. ముక్కు, చెవులు పోయి, ముఖాకృతి పోగొట్టుకున్నందుకు కాదు. ఆడవాళ్ల లైంగిక జీవితం మీద దాడి జరుగుతున్నందుకు రోదిస్తున్నాను. ఆ యుగంలో-కృతయుగంలో సరే, కలియుగంలో, నేటి ఆధునిక యుగంలోనూ స్త్రీ లైంగిక జీవితమే టార్గెట్టా! ఫేసు బుక్కుల్లో, యూ ట్యూబుల్లో మీ వాగుళ్లు, వాచాలత్వాలు చూసి రోదిస్తున్నాను. మా కడుపులో పెరిగి, మా రక్తం పీల్చి, మా గర్భం చీల్చి, మా రొమ్ము పాలు తాగి మా మీదే దాడి చేస్తున్నారా!

మాకు తెలుసు, ఇది మీకు పుట్టిన బుద్ధి కాదని. వెనక ఆడిస్తున్న అజ్ఞాత శక్తి ఎవరో మాకు తెలుసు. మిమ్మల్ని అమానవీయం చేసిన ఆ విష సంస్కృతి ఏవిటో మాకు తెలుసు.

మానవ జాతి చరిత్రలో ఏనాడైతే జంట వివాహం రద్దయిందో ఆనాడే మాతృస్వామ్యం రద్దయ్యింది. ఆస్తి వారసత్వం కోసం దంపతీ వివాహం ఎప్పుడు మొదలయ్యిందో అప్పుడే పితృస్వామ్యం, దాంతోపాటే క్షీణ దశ ఆరంభమయ్యింది.



ఎస్ పుణ్యవతి

ఆటవిక సమూహంలో ఉన్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు పొందిన మా స్త్రీ జాతి మాది. ఆస్తి వారసత్వం కోసం.. మీ కులం, వంశం నిలపడం కోసం.. ఒక స్త్రీని ఇల్లాల్ని చేశారు. మీ శారీరక సుఖం కోసం మరో స్త్రీని, పర స్త్రీని వెలయాల్ని చేశారు. అయినా లొంగక వ్యక్తిత్వమున్న, వ్యక్తిగత లైంగిక జీవితాన్ని కాపాడుకోదల్చిన నాలాంటి స్త్రీని శూర్పణఖను చేశారు. ముక్కు, చెవులు కోశారు.

మీరు రాసిన చరిత్రలో రాణి పద్మినీ వందలాది అంతఃపుర స్త్రీలతో సహా నిప్పుల్లో దూకితేగాని మీరు చల్లబడలేదు కదరా! కత్తి బట్టి కదన రంగాన దూకగలిగే సత్తా ఒక్క మీకే ఉన్నట్టు చెప్పుకోడానికే కదా ఈ ప్రయత్నం! రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీ బాయి మీరు జీర్ణించుకోలేని చారిత్రక వాస్తవాలు కదా!

అసలు స్త్రీకి ఏం కావాలో తెలుసా మీకు? రాణి పద్మిని నడుం కనబడితేనే మీ వంశ ప్రతిష్ఠలు మంటగలిశాయని వీధుల్లో వీరంగం చేశారే! భన్వారీదేవి అలాంటి స్త్రీ కాదా! అందరు స్త్రీలు అలాంటి వారు కాదా! రాంగోపాల్‌వర్మ నీచ నేరపూరిత వాచాలత్వం మీద కన్నెర్రజెయ్యరేం! ఇప్పుడు ఓ దేవి, ఓ మణి, మరెందరో మహిళా కార్యకర్తలు, స్త్రీలను అణచిపెట్టే సంస్కృతిని ఎదిరించి నిలిచింది ఎవరి కోసం? జనం కోసం. జన సంస్కృతి కోసం! మానవతా వాదం వెల్లివిరియడం కోసం! మానవ జాతి శ్రేయస్సు కోసం కాదా!



అయ్యా చంద్రబాబూ! తెల్లారి లేస్తే అరెస్టులు, ప్రజానాయకుల మీద కేసులు, రౌడీ షీట్లు, హక్కుల కోసం పోరాడితే లాఠీ దెబ్బలు-జైళ్లు. ఇదేనా మీ పరిపాలన? మహిళల ఆందోళన కనిపించదా! పబ్లిగ్గా టివి చర్చల్లో ఆడకూతుళ్లని, వాళ్ల వ్యక్తిత్వాన్ని అవమానిస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదు? చట్టం తెలియదా! ఏమైపోయింది మీ పోలీసు డిపార్టుమెంటు? లేక ప్రజా నాయకులు విలన్లగాను, రాంగోపాల్ వర్మ హీరోగాను కనిపిస్తున్నారా!

అయ్యా చంద్రబాబూ! తెల్లారి లేస్తే అరెస్టులు, ప్రజానాయకుల మీద కేసులు, రౌడీ షీట్లు, హక్కుల కోసం పోరాడితే లాఠీ దెబ్బలు-జైళ్లు. ఇదేనా మీ పరిపాలన? మహిళల ఆందోళన కనిపించదా! పబ్లిగ్గా టివి చర్చల్లో ఆడకూతుళ్లని, వాళ్ల వ్యక్తిత్వాన్ని అవమానిస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదు? చట్టం తెలియదా! ఏమైపోయింది మీ పోలీసు డిపార్టుమెంటు? లేక ప్రజా నాయకులు విలన్లగాను, రాంగోపాల్ వర్మ హీరోగాను కనిపిస్తున్నారా!

లైంగికేచ్ఛ ప్రకృతి ధర్మం. జీవజాలం మనుగడ కొనసాగడం కోసం మనుషుల్లోనైనా, పశుపక్ష్యాదుల్లోనైనా లైంగికేచ్ఛ ప్రకృతి పెట్టిన నియమం. ఎవరూ కాదనలేదు. అయితే మానవుల్లోనే కాదు, జంతుజాతుల్లో కూడా 'ఇచ్ఛ' లేకుండా ఒకదానికొకటి పొందు కోరలేదు. పొందలేవు. అటువంటిది ఇంత నాగరికత పెరిగాక, ఈ మాత్రం ఇంగితం తెలియదా! స్త్రీ మగాడి ఇష్టాలు తీర్చే యంత్రమా! పక్కలోకి రమ్మన్నప్పుడు రావడానికి ఒద్దన్నప్పుడు పోవడానికి తను మర మనిషా! లేక మీకు బానిసా?

మానవ జాతి చరిత్రను ఒకసారి తిరగేయండి. జంట వివాహంలోనే స్త్రీ, పురుష సాంగత్య ప్రేమ జనించింది. 'ప్రేమ లేని ముద్దు ములక పంటి గిజరు' అన్నాడు వేమన. అది తెలియని మూర్ఖులే ఆర్జీవీ వారసులు, ఉచ్ఛనీచాలు మరచి, స్త్రీలపై, పిల్లలపై లైంగిక దాడికి తెగబడ్డానికి కారణం పోర్నోగ్రఫీ కాదా?

చలం చెప్పినట్లు స్త్రీ హృదయానికి జ్ఞానం కావాలి. మనసుకు స్పందన కావాలి. శరీరానికి అనుభూతి కావాలి. ఈ సమాజం బలవంతంగా రుద్దిన వేశ్యా వృత్తిలోని స్త్రీ కూడా మనసు కోరుతుంది. 'కాపు మనిషినై (ఇక్కడ కులం కాదు, రైతు స్త్రీ) పొలం పని చేసి పంట పండించే స్త్రీగా పుట్టకపోతినే' అని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి చేత చెప్పిస్తాడు గురజాడ. స్త్రీ మనసు ఎందుకు అర్థం కాదో! భార్య ప్రేమ పొందడం తెలియాలి. పోర్నోగ్రఫీని కీర్తించే రాంగోపాల్ వర్మకే కాదు, ఫేసుబుక్కు వీరులకు కూడా!

ఏంటీ రాంగోపాల్ వర్మగారూ! ఏం సెలవిచ్చారు? మీరు అగౌరవ పర్చిన మహిళా కార్యకర్తలకు వారి కుటుంబాల నుండి ఏమైనా ఇబ్బందులు వచ్చాయేమోనని అపాలజీ చెప్తారా! శభాష్! ఒకవైపు న్యూడ్‌గా సినిమాలు తీస్తారా. మరో వైపు స్త్రీలు భర్త అధీనంలో, వారి కుటుంబాల అధీనంలో ఉండాలన్న మాట. స్త్రీల గౌరవానికి, కుటుంబ గౌరవానికి ఎంచక్కా ముడి పెట్టారండీ! స్త్రీ గౌరవం, అభిమానం ఆమె స్వవిషయాలు కావన్నమాట. స్త్రీ స్వేచ్ఛాజీవి కాదన్నమాట! ఎంత గొప్ప 'సాంప్రదాయ' వాదులండీ మీరు! ఒక్కటి తెలుసుకోండి. తమంత సంస్కార హీనులు కారు వారి కుటుంబ సభ్యులు.

నాయనలారా! బొమ్మల్లో ఎందుకు? పోర్నోగ్రఫీతో ఎవడైనా సంతోషంగా ఉన్నాడా? మనస్సున్న మనుషుల్లా మరో మనిషికి మనసిచ్చి పెళ్లి చేసుకోండి. కలసి జీవించండి. కలసి పోరాడండి. స్త్రీని అంగడి సరుకుగా మార్చిన విష సంస్కృతిలో భాగం కాకండి.

'మాయ మర్మము లేని నేస్తము/ మగువలకు, మగవారికియు నొక్కటే/ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును/ప్రేమ వచ్చిన ప్రేమ నిలుచును' అన్నాడు మహాకవి గురజాడ.

చివరగా ఒక్కమాట. మార్చి 8 వస్తున్నది. చరిత్ర గతినే మార్చివేసిన అక్టోబరు విప్లవానికి నాంది పలికింది మార్చి 8. స్త్రీ, పురుష కార్మికులు ఇరువురూ భుజం భుజం కలిపి పోరాడారు. దోపిడీ, దుర్మార్గాలపై ధ్వజమెత్తారు. అక్టోబరు విప్లవాన్ని దిగ్విజయం చేశారు. అదే కావాలి స్త్రీపురుషుల గమ్యం.




పది రూపాయలుంటే.. ఎవరినైనా ప్రశ్నించొచ్చు!

సోషల్ మీడియా ... నేడొక బలమైన ఆయుధం.
గురి చూసి ప్రయోగిస్తే - సామాన్యుడి చేతిలో పదునైన బాణం.
అభిప్రాయమే కావొచ్చు... ఆవేదనే అవ్వొచ్చు. ఆందోళన చెందటమే కావొచ్చు. ఆగ్రహం ప్రదర్శించటానికే అవ్వొచ్చు. ఫేస్‌బుక్‌ను ఒక అభిప్రాయ వెల్లడి వేదికగా, వేనవేల ప్రశ్నలు గుప్పించే ఆధునిక రచ్చబండగా ఉపయోగించటం సరికొత్త మార్పు. అణచివేయబడ్డ జనాలు తమ స్వరాలను, ఏళ్ల తరబడి దాచుకున్న అనుభవాలను ఎలుగెత్తి చాటటానికి ఇదొక మంచి అవకాశంగా ముందుకొచ్చింది. ఫేస్‌బుక్ వేదికను చర్చించదగిన అనేక ప్రశ్నలకు, సందర్భాలకు బలమైన గొంతుగా మార్చారు ఇండస్ మార్టిన్.
తాను విన్న, కన్న, స్వయంగా చవిచూసిన జీవిత అనుభవాలను కథలుగా రాసి, పెద్ద చర్చకు తెర తీశారు. 'కటికపూలు' పేరిట పుస్తకంగా కూడా వెలువడ్డ సందర్భంగా జీవనతో మార్టిన్ సంభాషణ ఇది. చదవండి.

వృత్తిరీత్యా నేను మానవవనరుల విభాగంలో పనిచేస్తూ, దానికి సంబంధించి శిక్షణిచ్చే ఒక ఉద్యోగిని. గుంటూరు జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో పుట్టాను. అమ్మ గవర్నమెంటు ఉద్యోగి, నాన్న క్రైస్తవ మత బోధకుడు. మతభావాలున్న ఇంట్లో పుట్టాను. కోస్తాజిల్లాల్లో ఈ మతం అనగానే ప్రధానంగా గుర్తుకొచ్చేది దళితులేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక దళితుడిగా నా జీవితం అంతా దానితోనే ముడిపడి ఉంది. నేను చదువుకున్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ చుట్టూ ఉన్న సమాజంలో కులవివక్షను వివిధ రూపాల్లో ఎదుర్కొన్నవాళ్ళమే. ఒక విధంగా వెలివేతల వ్యధలని చెప్పొచ్చు. ఇలాంటి వాతావరణంలోనే నేను పెరిగాను. అయితే చాలా మంది దళిత జీవితాల్లో ఉన్నట్లే నా జీవితంలోనూ మతం, సమాజం అనే రెండు సంఘర్షణలు అంటిపెట్టుకునే ఉన్నాయి. మతంలో ఉండే క్రతువులూ, విధానం, భక్తి వంటివి ఒకవైపు నుంచి లాగుతుంటే.. మరోవైపు సామాజికంగా బతకలేనితనం.. అంటే తింటానికే తిండిలేని పరిస్థితులవల్ల కలిగే అవమానాల జీవితం వేధిస్తుండేది. తర్వాత నేను పెద్దవాడయ్యాక, ఉద్యోగం సంపాదించుకుని, దేశదేశాలు తిరగడం వల్ల నన్ను నేను ఎటువైపు నిలబెట్టుకోవాలీ అనే స్పష్టత వచ్చింది. అప్పుడు నేను 'బతుకువైపే' ఉండాలని నిర్ణయించుకున్నాను. నా చుట్టూ జరిగిన సంఘటనలను నెమరేసుకున్నాను. అలాంటి పరిస్థితుల్లో నేను ఒక ప్రేక్షకుడిగానైనా ఉన్నానా..? లేకపోతే నేనే ఒక పాత్రగా ఉన్నానా? అలా నా జ్ఞాపకాలూ, సంఘటనలన్నీ ఫేస్‌బుక్‌లో ఒక సీరీస్‌లా రాసుకుంటూ వచ్చాను. అవన్నీ కేవలం 30 రోజుల్లో రాసినవే. ఈ పుస్తకంలో ఉన్న వాటిల్లో చిన్నచిన్న లిరిక్స్ కనిపిస్తాయ్. ఇవన్నీ మా బతుకుపాటలే. అందులో 'బతుకుపాట' అనే కథ ఉంది. ఎవరైన చచ్చిపోతే వలపోతలని ఒక తంతు జరుగుద్ది. చచ్చిపోయిన కొడుకు దగ్గర కూర్చొని, తల్లి రాగయుక్తంగా ఏడుస్తుంది. ఇలాంటివి మా జీవితాల్లో అడుగడుగునా ఉండే కవిత్వం.. ఈ కథల్లో కనిపిస్తుంది. దీనికి 'జానపదం' అని పేరుపెట్టి శాస్త్రీయ సాహిత్యంలో మా జీవితాల్ని చేరనీయకుండా చేశారు.

ఫేస్‌బుక్కే వేదిక

సోషల్ మీడియా సమాజాన్ని చాలా ప్రభావితం చేసిందని అందరికీ తెలిసిన విషయమే. అలాంటి వేదికపైన "అసలు కులమే లేదు. 21వ శతాబ్దంలో కూడా కుల వివక్ష ఉందా? అందరం అన్నదమ్ముల్లా కలిసుంటున్నాం కదా! కులాలు ఎప్పుడో అంతరించిపోయాయి. మీరొచ్చి ఇప్పుడేదో కొత్తగా మళ్లీ కులమంటూ మాట్లాడుతున్నారు..." అనే కొత్తరకం మేధావులు తయారయ్యారు. అంటే, ప్రస్తుత సమాజంలోని నిజస్వరూపాన్ని తెలుసుకోకుండా, హైటెక్ సంస్కృతికి అలవాటుపడిన చాలామంది సిటీ సిటిజన్లు, పైపైన కనిపించే నగర వాతావరణాన్ని చూస్తూ "ఇంకా కులం ఎక్కడుంది?" అంటూ మాట్లాడుతున్నారు. వాళ్లకు రెండు విషయాలు తెలియాలి. కులం అనేది కనిపించే నిజం. ఇది గమనించడానికి ఇష్టపడని మనుషులు "కులం లేదు" అని చెప్పుకోవడంలో ఘనత సాధించినట్లు అనుకుంటారు. దీనికి కారణం ఏంటంటే, వాళ్ల అగ్రకులంగానో, దోపిడీ కులంగానో ఉండాలంటే కులం లేదని మభ్యపెట్టక తప్పదుగనుక. ఇది వాళ్ల ఉనికి. అయితే ఉందని చెప్పుకోవడంలో నా ఉనికి ఏంటంటే, అలాంటి వారి మధ్యనే బాధలుపడే దళితులూ ఉన్నారు కనుక. అందుకే నేటికాలంలో కులవివక్షకు సంబంధించిన అనుభవాలను ఫేస్‌బుక్ వేదికగా రాసుకున్నాను. ఇలాంటి ఒక పరిస్థితుల్లో నన్ను ప్రధానస్రవంతిలోకి రానీయకుండా చాలామంది అడ్డుకున్నారు కూడా. దానికి కారణం నా రాతలే అనుకుంటాను. అందులో నేను వాడిన భాష అలాంటిది. అందుకే వాళ్లంతా నన్ను అక్కున చేర్చుకుని, నా వాదన వినిపించే అవకాశం ఇస్తారని ఆశపడలేదు. చేతిలో ఫోన్ ఉండి, పది రూపాయల డేటా బ్యాలన్స్ ఉంటే డోనాల్డ్ ట్రంప్‌నీ ప్రశ్నించగలిగే అవకాశం సోషల్ మీడియాలో ఉంది. నాలాంటి చాలా మంది అణిచివేయబడ్డ గొంతులకు అది గొప్ప వేదికగా మారింది. అక్కడ నేను నాలాంటి వారందరికీ గొంతై ఉండాలని అనుకున్నాను. అణిచివేతకు గురైన జీవితాల కథలను రాయలని అనుకున్నాను. అయితే మాకంటే ముందే సోషల్ మీడియా దోపిడీవర్గాల చేతుల్లోకి వెళ్లింది. నాలాంటి కొద్దిమంది సామాజిక సత్యాన్ని మాట్లాడితే మాపై దాడులకు దిగడం వారికి అలవాటే గనుక కథల రూపంలో చెప్పాలని నిర్ణయించుకున్నాను. నేను, మా చెల్లి, మా నాన్న, అమ్మ, మా జేజి అనే ఐదు పాత్రల ద్వారా మా కథలన్నీ చెప్పాను. అలా పుట్టింది ఒక పార్శ్వం.



రెండో పార్శ్వం

ఈ కథల్లో రెండో పార్శ్వం కూడా ఉంది. అది భాష. మేము మాట్లాడే భాష కూడా వెలివేతకు గురైంది. భాష అనే ప్రధాన కారణాన్ని పెట్టుకుని భాషా ప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయి. మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అయితే ఇందులో కూడా ఇంకొక మాండలీకం హేళనకు గురైంది. తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోవడానికి భాష కూడా ఒక కారణమని అందరికీ తెలిసిన విషయమే. ఈ రెండు సందర్భాల్లోనూ మరిచిపోలేని విషయం ఏంటంటే 'ఏలుతున్న భాష', అంటే గుంటూరు కృష్ణాజిల్లాల్లోని ఒక వర్గం మాట్లాడే భాషనే అధికారికంగా చెలాయించడం. ఒక అధికారం చెలాయించే భాష నుంచి మరో అధికారం చెలాయించు కోవాలనుకునే భాష విడిపడింది. అంతే తప్ప. అణిచివేతకు గురవుతున్నవారి భాష ఎక్కడా కనిపించలేదు. తెలుగు మహాసభలు, ప్రపంచ తెలుగు మహాసభలంటూ భాష గురించి పెద్దపెద్ద సభలు పెడుతున్నారు. మరి మా భాష వీటిలో ఎక్కడైనా కనిపించిందా? అంటే మాకు భాష లేదా? మేము మాట్లాడేదీ ఒక భాషే. అది యాస కాదు. అలాంటి మా భాషకి ఎక్కడా గుర్తింపులేదు. రాష్ట్రంలో ఏ పల్లెకెళ్లినా మా భాష వినబడుతుంది. మరి అలాంటి భాషకు సముచిత స్థానం ఎందుకివ్వలేదు? నిమ్నత్వంలోకి తోయబడిన కులాలే మా భాష మాట్లాడతాయి. అందుకే దాన్ని గుర్తించట్లేదు. కొందరు రచయితలు మా భాషలోనూ రచనలు చేశారు. వాటికి దళిత సాహిత్యమంటూ పేరుపెట్టి, విడదీసి, దాన్ని పక్కనపెట్టారు. ఈ భాషని 'కరుకు' భాష అన్నారు. నా జీవితంలో ఎంతో తేటదనముంది. ప్రేమ, ఆదరణలున్నాయి. ఇన్ని ఉన్నాగానీ, మా జీవితాల భాషకు మోటుతనం, కరుకుతనం ఆపాదించి పక్కనపెట్టారు. ఇలాంటి పరిస్థితిని బద్దలుకొట్టాలనే ఉద్దేశంతో రాయడం మొదలుపెట్టాను. అందుకే నా సొంత భాషలో రాయాలనుకున్నా.. నా కథల్ని నా భాషలో రాస్తేనే కదా వాటికి జీవం ఉండేది.

మౌనంగా ఉండటం తప్పు

సమాజంలో రెండు రకాల వర్గాలుంటాయి. ఒకటి అణచివేసేవారు, మరొకరు అణచివేతకు గురవుతున్నవారు. నేను స్పష్టంగా అణిచివేతకు గురవుతున్నవారివైపు నిలబడాలని నిర్ణయించుకున్నాను. ఒక ఏనుగు ఎలుక తోకను తొక్కుతున్నప్పుడు ఆ సందర్భంలో మిమ్మల్ని కలుగజేసుకోమంటే, 'లేదు నేను కలుగజేసుకోనూ... నాకెందుకు ఈ గొడవలన్నీ' అనుకుని మౌనంగా ఉండటం.. పీడిస్తున్నవారికి మద్దతు పలకడమే అవుతుంది. ఎవరైతే ఒక పక్షం తీసుకోకుండా మధ్యస్థంగా ఉంటారో వాళ్లు వేషధారులు. ఇలాంటి వారి వల్ల సమాజానికి కలిగే మేలు ఏమీ లేకపోగా, బాధితుడు మరింత బాధకు గురవుతూనే ఉంటాడు. అందుకే ఇకపైనా నేను రాస్తూనే ఉంటాను. ఫేస్‌బుక్‌లోనే రాస్తాను. అవి పుస్తకాల రూపంలో ఉంటే బాగుటుందని అనుకునేవాళ్లు ప్రచురిస్తారు. నా మటుకైతే నేను మాట్లాడుతూనే ఉంటాను. ప్రశ్నిస్తూనే ఉంటాను. 'కటికపూలు' పుస్తకాన్ని తీసుకొని నాకు తెలిసిన పల్లెటూర్లన్నీ వెళతాను. వాళ్లకి ఈ పుస్తకాన్ని ఇస్తాను. చదువుకుని, మరొకరికి ఇమ్మని చెబుతాను. ఎందుకంటే ఎవరి గురించి రాశామో అది వారి దగ్గరికి చేరినప్పుడే దీనికొక అర్థం ఉంటుందని నా ఉద్దేశం.

సంభాషణ : ప్రవీణ్ వెలువోలు
ఫొటో : రమణ



చేతిలో ఫోన్ ఉండి, పది రూపాయల డేటా బ్యాలన్స్ ఉంటే డోనాల్డ్ ట్రంప్‌నీ ప్రశ్నించగలిగే అవకాశం సోషల్ మీడియాలో ఉంది. నాలాంటి చాలామంది అణిచివేయబడ్డ గొంతులకు అది గొప్ప వేదికగా మారింది.

జీవన సౌరభం — **అహం వలన ఏర్పడిన అంధకారం.. చీకటి కంటే భయంకరమైంది.**

మీ కోసం — **రోజ్‌వాటర్‌లో ముంచిన దూదిని హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకుంటే మంచి సువాసన వస్తుంది.**



బెడ్ షీట్స్‌ను మారుస్తుండాలి

బెడ్ షీట్స్ ఎప్పటికప్పుడు మార్చకపోతే ఆస్తమా వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు. చాలామంది బెడ్ మీద కూర్చొనే తినటం, తాగటం చేస్తుంటారు. దీంతో దుమ్మూధూళి, పురుగులు, మరికొన్ని రకాల బ్యాక్టీరియా, చర్మకణాలు బెడ్‌షీట్స్‌ను ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉంటాయి. చాలాకాలం పాటు బెడ్‌షీట్స్‌ను మార్చకపోవటంవల్ల వీటికి అంటుకున్న దుమ్మూధూళి, పురుగులు, చర్మకణాలు, ముక్కులోని శ్లేష్మపొర ద్వారాల్లోనికి వెళ్లి ఆస్తమాకు దారితీస్తాయి. అంతేకాదు గజ్జి, తామరలాంటి చర్మవ్యాధులూ సంక్రమిస్తాయి. కాబట్టి వారానికి కనీసం రెండుసార్లు బెడ్‌షీట్స్ మార్చితే మంచిది. నిద్రలేచిన వెంటనే కనీసం బెడ్‌షీట్స్‌ను చక్కగా దులిపి ఆరుబయట కాసేపు ఆరేయాలి. దీనివల్ల ఇలాంటి చెడు బ్యాక్టీరియా మళ్లీ ఇంట్లోకి ప్రవేశించదు. అలాగే పిల్లో కవర్స్‌నూ రెండువారాలకు ఒకసారి మార్చితే మంచిది. ఎందుకంటే చుండ్రు తదితర వాటిని నివారించుకోవటమే కాకుండా.. దుమ్మూధూళి లేకుండా జుట్టు శుభ్రంగా ఉంటుంది. నాణ్యమైన బెడ్‌షీట్స్ వేసుకోవటంవల్ల పరుపులో ఉండే దుమ్మూధూళీ, బ్యాక్టీరియా మన శరీరానికి అంటుకోకుండా అడ్డుకుంటుంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తవు. అంతేకాదు, ఇల్లు కూడా పరిశుభ్రంగా కనిపిస్తుంది. ★



మొక్కలు పెంచుతున్నారా?!

ఇళ్లల్లో పెంచుకునే మొక్కల విషయంలో తగినంత జాగ్రత్త తీసుకోవడం చాలా అవసరం. ఇంట్లో స్వచ్ఛమైన గాలిని అందించే ఇండోర్ ప్లాంట్స్ విషయంలో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం సూర్యరశ్మి నేరుగా సోకని ప్రాంతాలలో మొక్కలను ఏర్పాటు చేసుకోవాలి. మొక్కలను ట్రిమ్ చేయడం, ఎండిన ఆకులను, కొమ్మలను తొలగించడం వంటివి తప్పకుండా చేయాలి. సాధారణంగా మొక్కలకు నీళ్లు ఎంత అవసరం అన్న సంగతి కుండీలోని మట్టిని తాకగానే తెలిసిపోతుంది. ఒకసారి తాకగానే ఎండినట్లు కనిపిస్తే వెంటనే నీటిని పోయాలని అర్థంచేసుకోవాలి. కుండీలో ఏర్పాటుచేసే మొక్కలకు చెదలు పట్టవు. పురుగుల బెడదా తక్కువే. అయినప్పటికీ కనీసం నెలకోసారి, సరిపడే ఎరువులను నీటిలో కలిపి మొక్కలకు పోస్తే ఆరోగ్యంగా కనిపిస్తాయి. అయితే ఎరువుల మోతాదు ఏమాత్రం పెరిగినా మొక్కలు చనిపోయే అవకాశం ఉంది. అలాగే మొక్కలు పెరిగే కొద్దీ వాటి వేర్లు విస్తరిస్తుంటాయి. మొక్కల సైజును బట్టి చిన్న కుండీల నుంచి పెద్ద కుండీలలోకి మార్పు చేయటానికి వేసవి అనువైన కాలం. వేసవిలో గది ఉష్ణోగ్రత ఈ మొక్కలకు సరిపోతుంది. మిగతా కాలాల్లో అయితే అప్పుడప్పుడు కొద్ది సమయం బయట ఉంచి, తిరిగి లోపల పెట్టుకోవాలి. మొక్కలను ఎప్పుడూ ఒకేచోట, ఒకే కోణంలో ఉంచకూడదు. ఒకటి లేదా రెండు వారాలకు ఒకసారి వాటిని మారుస్తూ ఉండాలి. ★



పేదపిల్లల్ని చదివించే టాక్సీ డ్రైవర్

కోట్లకు పడగలెత్తినవారు సైతం పక్కవారు ఆపదలో ఉంటే పైసా సహాయమూ చేయనివాళ్ళని ఎందరినో చూస్తుంటాం. కానీ తనకొచ్చే చాలీచాలని ఆదాయంతో తనలాంటి వందలాది మంది జీవితాలకు వెలుగులిస్తున్న ఓ టాక్సీ డ్రైవర్ గురించి మీకు తెలుసా!? తను కారు నడిపితే వచ్చిన డబ్బులతో రెండు పాఠశాలల్ని, ఓ అనాథాశ్రమాన్నీ నడుపుతున్నాడు. అతని పేరు మహమ్మద్ జలాలుద్దీన్ ఘాజీ. జగమంత కుటుంబం నాది అనే తత్త్వం అతనిది.! మనవళ్లకు, మునిమనవళ్లకు అంటూ తినీతినక డబ్బులు కూడబెడుతున్న ఈ కాలంలో రోజూ తన శ్రమకు ఫలితంగా వచ్చే 500-1000 రూపాయలతో రెండు స్కూల్స్, ఓ అనాథాశ్రమాన్ని నడుపుతున్న గొప్ప వ్యక్తి. మండుటెండల్లో, వర్షంలో.. ఆరోగ్యం సహకరించకపోయినా టాక్సీ నడిపి, దాని ద్వారా వచ్చే సంపాదనను ఈ సేవాకార్యక్రమాలకు ఉపయోగిస్తాడు. "నేను పనిచేయడం ఆపితే సుమారు 400 మంది విద్యార్థులు తమ చదువుకు దూరం అవుతారు.. 150 మంది వృద్ధులు అర్థాకలితో అలమటిస్తారు.. కాబట్టి ఒక్కరోజూ నా డ్యూటీని మానలేను" అంటాడు ఈ ఘాజీ!





కోల్‌కతాలోని జోయానగర్‌లో 62 ఏళ్ల కిందట ఘాజీ ఓ నిరు పేద కుటుంబంలో పుట్టాడు. మూడేళ్ళ వయస్సు నుంచే బిచ్చగాడిగా బతుకుతూ.. అలా స్కూల్లో చేరి మూడో తరగతి పాస్ అయ్యాడు, కానీ నాల్గవ తరగతి చదివే స్తోమత లేదు.. చదివించే పరిస్థితి వారి కుటుంబానికీ లేదు. కాస్త వయసు పెరిగాక ఇక బిచ్చమెత్తుకోవడం తప్పని భావించి, రిక్షా కార్మికుడిగా మారాడు. అలా పదేళ్ళు గడిచాక సొంత టాక్సీ కొనుక్కొని, అప్పటి నుంచి ఇప్పటిదాకా అదే టాక్సీ డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు.



ఈ క్రమంలోనే తాను చదువుకు దూరమై ఎంతగా బాధపడ్డాడో..ఆ బాధ తన చుట్టుపక్కల వారెవ్వరికీ కలగకూడదని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఒక పూట మాత్రమే తిని, మిగిలిన తన సంపాదనంతా పొదుపుచేసేవాడు. ఆ మొత్తంతో రెండు పాఠశాలలు కట్టించాడు. వాస్తవ పరిస్థితిని వివరించి, కొంతమంది దగ్గర విరాళాలూ స్వీకరించాడు. అలా మొత్తం 400 మంది విద్యార్థులు, 16 మంది టీచర్లతో ఘాజీ నడుపుతున్న స్కూల్స్ చాలామంది పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దుతున్నాయి. రెండు దశాబ్దాల కిందట 1998లో ఏర్పాటు చేసిన ఈ స్కూళ్లల్లో చదివిన విద్యార్థుల్లో కొందరు ఇదే స్కూళ్లల్లో టీచర్లుగా పనిచేస్తుండడం చెప్పుకోదగ్గ విశేషం. ఈ స్కూళ్ళు, అనాథాశ్రమం దక్షిణ 24పరగణాల జిల్లాలోని ఠాకూర్చర్ గ్రామ పరిసరాలలో అతని ఆదర్శాలను అందరికీ పరిచయం చేస్తూనే ఉంటాయి. మహమ్మద్ జలాలుద్దీన్ ఘాజీకి వ్యక్తిగతంగా సాయమందించి, అతని ఆశయానికి తోడ్పాటు అందించాలనుకునేవారు 09735562504 అనే ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు. ★



మైనరుకి పెళ్లి చేయడం నేరం

న్యాయ సూత్రం

నాకు ఇంకా మైనారిటీ తీరలేదు. మా మేనత్త కొడుకుని పెళ్లి చేసుకోమని బలవంతం చేస్తున్నారు. నేనిప్పుడు పదోతరగతి చదువుతున్నాను. ఇంకా చదవాలనుకుంటున్నాను. పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు. నేనేం చెయ్యాలి?

- పల్లవి, మార్కాపురం



మైనరుకి పెళ్లి చెయ్యటం చట్ట ప్రకారం నేరం. అందుకని బాధ్యులైనవారు శిక్షార్హులు. కొన్ని కుటుంబాల్లో మైనర్లకు పెళ్లి చెయ్యడం ఒక దురాచారంగా ఉంది. దీనివల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయి. ముఖ్యంగా ఆడపిల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. చిన్న వయస్సులో సంతానం కలిగితే, వారికి అనేక ఆరోగ్యసమస్యలు ఉంటాయి.

మీరు మీ స్నేహితురాళ్ల సాయంతో నిర్భయంగా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయండి. పోలీసులు మీ పెద్దల్ని పిలిచి మందలిస్తారు. అవసరమైతే హెచ్చరిస్తారు. మీ స్నేహితురాళ్లలో ఎవరికైనా ఇలాంటి సమస్య ఎదురైతే వారికి అండగా ఉండి, పోలీసుల సహాయం కోరండి. ఒక మంచి పనికి అందరూ ఒకరికొకరు సహకరించుకోవాలి. అప్పుడే స్నేహానికి విలువ, అర్థం ఉంటుంది. ★



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com

MATHAMETICS FOR TET



S.LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

PRACTICE PAPER - 1

Compound Intrest

Important facts and formulas

Let principle = p, Rate = R per annum and Time = n years. Then,

1. When interest is compound annually

$$\text{Amount} = P\left[1+\frac{R}{100}\right]^{n}$$

2. When interest is compound half yearly

$$\text{Amount} = P\left[1+\frac{R/2}{100}\right]^{2n}$$

3. When interest is compound quarterly

$$\text{Amount} = P\left[1+\frac{R/4}{100}\right]^{4n}$$

4. When in compound annually but time is in fraction, say $3^2/5$ years

$$\text{Amount} = P\left[1+\frac{R}{100}\right]^{3} \times \left[1+\frac{2/5\,R}{100}\right]$$

5. When rate are different for different years, say R1%, R2%, R3%, for 1st, 2nd, 3rd, Years respectively

$$\text{Amount} = P\left[1+\frac{R1}{100}\right]\left[1+\frac{R2}{100}\right]\left[1+\frac{R3}{100}\right]$$

6. Present worth of rupees X due in n year hence is given by

$$\text{Present worth} = \frac{X}{\left[1+\frac{R}{100}\right]^{n}}$$

1. Albert invested an amount of rupees 8000 in a fixed deposit scheme for 2 years at compound interest rate 5% per annum how much amount will Albert get on maturity of the fixed deposit?
A. Rupees 8,600
B. Rupees 8,620
C. Rupees 8,800
D. Rupees 8,840
E. None of these

2. What will be the compound interest on a sum of rupees 25000 after 3 years at the rate of 12% per annum?
A. Rupees 9,000. 30
B. Rupees 9,720
C. Rupees 10,123.20
D. Rupees 10,483.20
E. None of these

3. The compound interest on Rupees 20480 at 6 1/4% per annum for 2 years 73 days is
A. Rupees 2,929
B. Rupees 3,000
C. Rupees 3,131
D. Rupees 3,636

4. A man saves rupees 200 at the end of each year and lens the money at 5% compound interest How much it will become at the end of the 3 years?
A. Rupees 565.25
B. Rupees 635
C. Rupees 662.02
D. Rupee 666.50

5. Sam invested rupees 15000 at the rate of 10% per annum for one year. if the interest is compound of early half yearly, then the amount received by the Sam at the end of the Year will be
A. Rupees 16,500
B. Rupees 16,525.50
C. Rope 16,537.50
D. Rupees 18,150
E. None of these

6. A bank offers 5% compound interest calculated on half-yearly basis a customer deposit rupees 16000 each on 1st January and 1st July of a year at the end of the year the amount he would have gained by way of interest is
A. Rupees 120
B. Rupees 121
C. Rupees 122
D. Rupees 123

7. What is the difference between the compound interest on rupees 5000 for 1 1/2 year at 4% per annum compound yearly and half yearly?
A. Rupees 2.04
B. Rupees 3.06
C. Rupees 4.80
D. Rupees 8.30

8. Find the compound interest on rupees 15,625 for 9 months at 16% per-annum compounded quarterly.
A. Rupees 1,851
B. Rupees 1,941
C. Rupees 1,951
D. Rupees 1,961

9. If the simple interest on a sum of money for 2 years. at 5% per annum is rupees. what is the compound interest on the same sum at the same rate for the same time?
A. Rupees 51.25
B. Rupees 52
C. Rupees 54.25
D. Rupees 60

10. What will be the difference between simple and compound interest @10% per annum on a sum of rupees 1,000 after 4 years?
A. Rupees 31
B. Rupees 32.10
C. Rupees 40.40
D. Rupees 64.10
E. None of these

11. The difference between simple and compound interest on rupees 1200 for 1 years at 10% per annum reckoned half yearly is
A. Rupees 2.50
B. Rupees 3
C. Rupees 3.75
D. Rupees 4
E. None of these

12. The compound interest on rupees 30,000 at 7% per annum is 4,347. the period in year is
A. 2 B. 2 1/2
C. 3 D. 4

13. At what rate of compound interest per annum will a sum of rupees 1,200 become rupees 1,348.32 in 2 years?
A. 6% B. 6.5%
C. 7% D. 7.5%

14. The principle. that amounts to rupees 4,913 in 3 years. at 6 1/4% per annum compound interest compounded annually is..
A. Rupees 3,096
B. Rupees 4,076
C. Rupees 4,085
D. Rupees 4,096

15. The present worth of rupees 169 due in 2 years at 4% per annum.



Compound interest is
A. Rupees 150.50
B. Rupees 154.75
C. Rupees 156.25
D. Rupees 158

16. In how many years. will a sum of rupees 800 at 10% per annum compounded semi-annually become rupees 926.10?
A. 1 1/3 B. 1 1/2
C. 2 1/3 D. 2 1/2

17. In the Compound interest on a sum. for 2 years. at 12 1/2 percent per annum is rupees 510 the simple interest on the same sum at the same rate for the same period of time
a) Rupees 400
b) Rupees 450
c) Rupees 460
d) Rupees 480

18. The compound interest on a certain sum for 2 years at 10% per annum is rupees 525. the simple interest on the same sum for double time and the half rate percent per annum is
a) Rupees 400
b) Rupees 500
c) Rupee 600 d) Rupees 800

19. The simple interest on a certain sum of money for 3 years at 8% per annum is half the compound interest on rupees 4,000 for 2 years. for 2 years at 10% per annum the someplace on simple interest is
a) Rupees 1,550
b) Rupees 1,650
c) Rupees 1,750
d) Rupees 2,000

20. There is 60% increase in an amount in 6 years at simple interest. What will be the compound interest of rupees 12,000 after 3 years at the same rate?
a) Rupees 2,160
b) Rupees 3,120
c) Rupees 3,972
d) Rupees 6,240
e) None of these

★

Answer:

1. e	2. c	3. a	4. c	5. c
6. b	7. a	8. c	9. a	10. d
11. b	12. a	13. a	14. d	15. c
16. b	17. d	18. b	19. c	20. c

తగ్గిన భారత వృద్ధి

- నోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావం
- మొండి బాకీలు ఆందోళనకరమే
- నాలుగేళ్లలో ఎన్‌పిఎలు రెట్టింపు

అమెరికా అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు



వాషింగ్టన్ : భారత వృద్ధి రేటు తగ్గిందని అమెరికా అడ్మినిస్ట్రేషన్ ఒక రిపోర్టులో పేర్కొంది. దేశంలో చేపట్టిన సంస్థాగత సంస్కరణల వల్లే ఈ పరిస్థితి చోటు చేసుకుందని తెలిపింది. భారత్‌తో పాటు మరో మూడు ప్రధాన దేశాల వృద్ధి రేటు కూడా తగ్గిందని ఎకనామిక్ రిపోర్టు ఆఫ్ ది ప్రెసిడెంట్ (ఇఆర్‌పి) పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. నోట్ల రద్దు, జిఎస్‌టి లాంటి చర్యలు దేశ వృద్ధి రేటును దెబ్బతీశాయి. నవంబర్ 2016లో ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు వల్ల 86 శాతం నగదు ప్రవాహం ఆగిపోయింది. దేశంలో దాదాపుగా 90 శాతం నగదు లావాదేవీలే జరుగుతాయి. నోట్ల రద్దు దెబ్బతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడింది. జులై 2017లో ఒకే దేశం ఒకే పన్ను పేరుతో అందుబాటులోకి తెచ్చిన వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కూడా స్వల్ప కాల అనిశ్చితిని సృష్టించింది. అదే విధంగా బ్యాంకుల్లో భారీగా పెరుగుతున్న మొండి బాకీలపై ఈ రిపోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి భవిష్యత్తులో మరి న్ని రిస్కుల కు దారి తీయను న్నాయి. వివిధ ఆధా రాలు, ఐఎంఎఫ్ గణం కాల ప్రకారం 2017 డిసెం బర్ త్రైమా సికం ముగింపు నాటికి భారత్‌లో మొండి బాకీలు 9.7 శాతానికి ఎగిశాయి. అదే చైనాలో బ్యాంకుల నిరర్థక ఆస్తులు కేవలం 1.7 శాతంగా ఉన్నాయి. భారత్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న మొండి బాకీలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 2014-15తో పోల్చితే 2017 ముగింపు నాటికి భారత మొండి బాకీల రుణాలు రెట్టింపు అయ్యాయి. భారత బ్యాంకింగ్ రంగంలో భారీగా పారు బకాయిలు పెరుగుతున్నాయనడానికి ఎస్‌బిఐ ఫలితాలే నిదర్శనం. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా రిపోర్టు ప్రకారం 2018 తొలి త్రైమాసికం ముగింపు నాటికి బ్యాంకుల ఎన్‌పిఎలు 10.8 శాతానికి చేరొచ్చు. అదే సెప్టెంబర్ ముగింపు నాటికి 11.1 శాతానికి ఎగియవచ్చు. ఏది ఏమైన భారత బ్యాంకింగ్ రంగంపై ప్రస్తుతమున్న ఒత్తిడి నుంచి భవిష్యత్తులో ఉపశమనం లభించవచ్చు. బయో టెక్నలాజీ వ్యవసాయ ఉత్పత్తులకు చైనా, యూరోపియన్ యూనియన్, భారత్‌లు త్వరితగతిన అనుమతులు ఇవ్వడం లేదు. అదే విధంగా భారత్ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) నిబంధనలు అమలు చేయడం లేదని అమెరికా విమర్శించింది. అమెరికా పౌల్ట్రీ రంగం ఎగుమతులను భారత్ అనుమతించాలని తెలిపింది. 2007 నుంచి భారత్ పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలు పెట్టింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్, చైనా లాంటి వర్ధమాన దేశాల్లో పెరుగుతున్న మొండి బాకీల రుణాలు విత్త రంగంలో రిస్కులకు దారి తీసేలా ఉంది. చైనాలో రుణాలకు మంచి డిమాండ్ ఉందని, దీంతో అంతర్జాతీయంగా ఆ దేశ పెట్టుబడులు, ఎగుమతులు పెరుగొచ్చు.

ఉద్యోగాలు

ఐవోసీఎల్ ఈస్టర్న్ రీజియన్‌లో 175 ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఈస్టర్న్ రీజియన్ వివిధ విభాగాల్లోని 175 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు: ట్రేడ్ అప్రెంటీస్-113 (ఫిట్టర్/ ఎలక్ట్రీషియన్/ ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/ మెషినిస్ట్-38 + అకౌంటెంట్-75), టెక్నికల్ అప్రెంటీస్-62 (మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ సివిల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్).
ఈస్టర్న్ రీజియన్‌లోని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల వారీ ఖాళీలు: అండమాన్, నికోబార్-2, అరుణాచల్‌ప్రదేశ్-4, బిహార్-20, జార్ఖండ్-10, మణిపూర్-11, మిజోరాం-2, నాగాలాండ్-4, ఒడిశా-19, సిక్కిం-2, త్రిపుర-7, పశ్చిమబెంగాల్-80, అసోం-14.
అర్హతలు: టెక్నీషియన్ అప్రెంటీస్‌కు సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, ట్రేడ్ అప్రెంటీస్‌కు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్ విభాగాల్లో ఐటీఐ.
వయసు: 2018, జనవరి 31 నాటికి 18-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ట్రేడ్ అప్రెంటీస్‌లోని అకౌంటెంట్ విభాగానికి జనరల్ ఆప్టిట్యూడ్ (క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌తో సహా), రీజనింగ్ ఎబిలిటీస్, బేసిక్ లాంగ్వేజ్ స్కిల్స్ నుంచి, మిగిలిన విభాగాలకు (ట్రేడ్/ టెక్నీషియన్) ఈ అంశాలతోపాటు సంబంధిత విభాగంలో టెక్నికల్ ఆక్యుమెన్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.iocl.com

ఓఎన్‌జీసీ మంగుళూరు పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌లో 17 ఖాళీలు

మంగళూరులోని ఓఎన్‌జీసీ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఓఎంపీ ఎల్). 17 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-12 (కెమికల్ ఇంజనీరింగ్-4 + ఈఈఈ-4 + ఈసీఈ-1 + ఈఐఈ-1 + ఎంఈ-2), టెక్నీషియన్ అప్రెంటీస్-5 (కెమికల్ ఇంజనీరింగ్-2 + ఈఈఈ-2 + ఈఐఈ-1).
స్టైపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-4,984, టెక్నీషియన్ అప్రెంటీస్-రూ.3,542.
అర్హతలు: సంబంధిత విభాగాలను అనుసరించి గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిగ్రీ, టెక్నీషియన్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిప్లొమా 2015/ 2016/ 2017లో ఉత్తీర్ణులై ఉండాలి. అన్‌రిజర్వుడ్‌కు కనీసం 55 శాతం, ఓబీసీ-కనీసం 45 శాతం, ఎస్సీ/ ఎస్టీకి కనీసం 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 1, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.ompl.co.inv

ఆస్తులమ్మి
రుణాలు చెల్లిస్తాం : పిఎన్‌బి

ముంబయి : వజ్రాల వ్యాపారీ, బ్యాంకుల మోసగాడు నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు దాదాపు రూ.11,500 కోట్ల కుచ్చుటోపి పెట్టారు. ఈ చెల్లింపుల్లో ఇతర బ్యాంకులకు హామీగా వ్యవహరించిన తాము వాటిని చెల్లిస్తామని పిఎన్‌బి హామీ ఇచ్చింది. ఇందుకోసం వనరులను సమీకరించే పనిలో ఉన్నట్లు ఆ బ్యాంకు పేర్కొంది. ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలకు సరిపడా ఆస్తులున్నాయని వెల్లడించింది. బకాయిలు పడ్డ బ్యాంకర్లకు చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని రూ.6వేల కోట్లు మాత్రమే చెల్లిస్తామని పిఎన్‌బి ఇంతక్రితం పేర్కొంది. పిఎన్‌బి వద్ద ఒకవేళ నిధులు లేకపోతే, బ్యాంకుకు చెందిన నాన్ కోర్ ఆస్తులను అమ్మకానికి పెట్టి నిధులు సమకూర్చాలని ఓ ప్రభుత్వ సీనియర్ అధికారి స్పష్టం చేశారు. దీంతో పిఎన్‌బి ఎలాగైన అప్పులు చెల్లిస్తామని వివరణ ఇచ్చింది.

డ్యుయోపిక్స్ 'ఎఫ్9' విడుదల

హైదరాబాద్ : సన్‌ఎయిర్‌వాయిస్ బ్రాండ్లలో ఒకటైన జియోక్స్ తన డ్యుయోపిక్స్ సిరీస్‌లో కొత్త 'డ్యుయోపిక్స్ ఎఫ్9'ను విడుదల చేసింది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను డ్యూయల్ సెల్ఫీ కెమెరా 8 ఎంపి, 2 ఎంపి ఆటో ఫోకస్‌లతో ఆవిష్కరించామని జియోక్స్ మొబైల్స్ సిఇఒ దీపక్ కాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెనుక వైపు 8 ఎంపి రియర్ కెమెరా తక్కువ వెలుతురు ఉన్న మెరుగైన పోటోలు తీయగలుగుతుందన్నారు. 5 అంగుళాల హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, 2.5డి కర్వ్‌డ్ డిస్‌ప్లే, 1 జిబి ర్యామ్, 1.3 గిగాహెర్జ్ క్వాడ్ కోర్ ప్రాసెసర్‌తో దీన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ధర రూ.6,499గా నిర్ణయించామన్నారు.

ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు సిద్ధం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి వ్యవసాయ శాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ కోరారు. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం 13 జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ 2018-19లో వివిధ పథకాల అమలు, పంటల విస్తీర్ణం పెరుగుదల, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు రూపొందించాలన్నారు.రానున్న వ్యవసాయ బడ్జెట్‌లో జిల్లాల వారీగా కేటాయింపులపై కూడా చర్చించారు.



గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం 13 జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు

పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - నందిగామ

నందిగామ నియోజకవర్గం పరిధిలోని పెద్దవరం వద్ద పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కృష్ణాజిల్లా నందిగామలోని చండ్ర రాజేశ్వరరావు భవన్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో పేపరు పరిశ్రమ ఏర్పాటు అనే అంశంపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి జరబన నాగేశ్వరరావు అధ్యక్షతవహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన కాగితం తయారీ సంస్థ ఆసియా ఫల్స్ పేపర్ (ఎపిపి) రాష్ట్రంలో పేపర్ పరిశ్రమ పెట్టేందుకు ముందుకొచ్చిన దృష్ట్యా పెద్దవరంలో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. సిపిఎం నాయకులు సయ్యద్‌ఖాసిం మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్ పరిశ్రమ ఏర్పాటుకు హామీఇచ్చిందని గుర్తుచేశారు. వైసిపి జిల్లా కార్యదర్శి ఎం కొండారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూటికి 75 శాతం మంది రైతులు పండిస్తున్న సుబాబుల్, సరుకుడు, యూకలిప్టస్ పంటను పరిశ్రమలు కొనుగోలు చేసేలా ఒప్పించి రైతుకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, ఎఎంసి మాజీ చైర్మన్ పాలేటి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలు రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఎంసి చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పేపర్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి, మంత్రులను అఖిలపక్షంగా వెళ్లి కలిసేందుకు కృషి చేస్తానన్నారు.

శివాజీపై దాడిని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

సినీ నటుడు శివాజీపై బిజెపి కార్యకర్తల దాడిని ఖండిస్తూ ఎపి ప్రత్యేక హోదా విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో గురువారం గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ శివాజీపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శివాజీకి బిజెపి నాయకులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా కోసం పోరాడే శివాజీపై ఎవరైనా దాడులకు దిగితే వారి పార్టీ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. హోదా సాధన కోసం ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసులు, శివాజీ ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, సభలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మార్చి 5 నుంచి 9 వరకు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేయాలని యువతకు పిలుపునిచ్చారని తెలిపారు. జెఎసి రాష్ట్ర కన్వీనర్ దాసరి అంజయ్య ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

ముగిసిన బేడ, బుడగ జంగాల దీక్షలు

ప్రజాశక్తి-పశ్చిమగోదావరి యంత్రాంగం

తమను దళితుల్లో చేర్చాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పశ్చిమగోదావరి జిల్లాలో మూడోరోజు గురువారం కొనసాగాయి. పెనుమంట్రలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ప్రసాదం శివ మాట్లాడారు. ఈ సందర్భంగా పచ్చగడ్డి తిని నిరసన తెలిపారు. అనంతరం గుంటూరులో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న తమ నేత మధు దీక్ష విరమించారని తెలిసి దీక్షలు విరమించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంగువ చిన సత్యనారాయణ మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు గురువారం తమ నేత మధుకు హామీ ఇచ్చారని చెప్పారు. మధుకు మంత్రి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారని తెలిపారు.

కొండరెడ్లకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)

పోలవరం ప్యాకేజీ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ విఆర్ పురం మండలం జీడిగుప్పకు చెందిన 16 మంది కొండరెడ్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండోరోజుకు చేరాయి. వీటిని విఆర్ పురం ఎంపిపి కారం శిరమయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులు కొండరెడ్లకు మాయమాటలు చెప్పి మోసగించారన్నారు. కొండరెడ్లకు ఇవ్వాల్సిన పరిహారాన్ని తమ బ్యాంకు ఖాతాల్లో గిరిజనేతరులు వేయించుకున్నారని చెప్పారు. మోసపోయిన కొండరెడ్ల సాగులో ఉన్న భూములకు పరిహారం ఇప్పించాలని కోరారు.

ప్రజ్ఞ

జవాబులు

1. వై హెచ్ మలేగామ్ కమిటీ
2. ఎన్‌టిటి ఎటి (జపాన్)
3. భారత్
4. మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎం)
5. ఫిబ్రవరి 21

న్యాయం చేయాలని కోరితే కౌంటర్ కేసులా?

- ఇదేనా ప్రభుత్వం చేపట్టే 'దళితతేజం'
- డిఎస్‌ఎంఎం జాతీయ కన్వీనర్ వి. శ్రీనివాసరావు



దళిత ప్రజాసంఘాల దీక్షల్లో పాల్గొని మద్దతు తెలియజేస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇలాకాలో తప్పు పెత్తందారులు చేస్తే శిక్ష దళితులకు వేయడమేంటి? అంటూ దళిత్‌శోషన్ ముక్తిమంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా కలికిరి మండలం కూరాకులవారి పల్లెలో దళిత యువతి పట్ల అనుచితంగా మాట్లాడాన్ని, ప్రశ్నించినందుకు దళితవాడపై పెత్తందారులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. కెవిపిఎస్, దళిత ప్రజాసంఘాలు చేపట్టిన నిరాహారదీక్షలో ఆయన గురువారం పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మాజీ, ప్రస్తుత ముఖ్యమంత్రుల సొంత జిల్లాల్లోనే దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడు కిషోర్‌కుమార్‌రెడ్డి పెత్తం దారులకు కొమ్ముకాస్తూ దళితులపై దాడి చేసిన వారిపైనే కౌంటర్‌కేసులు పెట్టించేందుకు సహకరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత యువతిని కులంపేరుతో దూషించి, పరుషపదజాలంతో ఈవ్‌టీజింగ్ చేసిన పెత్తం దారులపై కఠిన చర్యలు తీసుకోకుండా 25 మంది దళితు లపై కౌంటర్‌కేసులు నమోదు చేశారన్నారు. ఈ ఘటనలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా పక్షపాతం చూపుతూ బాధితులను మరింత క్షోభకు గురిచేస్తున్నారని మండి పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓ వైపు దళితతేజం అంటూ వారి ఓట్లకోసం గాలం వేస్తూ ఎస్‌సి, ఎస్‌టి చుట్టూ తిరుగుతూనే మరోవైపు వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దళిత, మైనార్టీలపై దాడులు నిత్యకృత్యమయ్యాయని వాపోయారు. ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు బనాయించడం, హత్యలు చేయడం రివాజుగా మారిందన్నారు. దళిత, ప్రజాసంఘా లన్నీ ఏకమై వివక్ష, దౌర్జన్యాలపై పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బాధితులకు దళిత్‌శోషన్ ముక్తిమంచ్ అండగా ఉంటుందని ఉద్ఘాటించారు. అనంతరం తహశీల్దార్ నటరాజ్‌తో చర్చించి బాధితులకు తక్షణ సాయంగా 50 కిలోల బియ్యాన్ని అందించారు. తహశీల్దార్‌తో కలిసి కూరాకులవారిపల్లెను సందర్శించి బాది తులను పరామర్శించారు. దళితులపై పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తేసి, పెత్తందారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి సుబ్రమణ్యం, ఆర్‌పిఐ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, మాలమహానాడు రాష్ట్ర నాయకులు యమలా సుదర్శన్, సిపిఎం తిరుపతి, చిత్తూరు జిల్లాల కార్యదర్శులు అంగేరి పుల్లయ్య, చల్లావెంకటయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెసురేంద్ర, మారెళ్లశ్రీనివాసులు, వాడగంగరాజు, సుఫీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల వినూత్న ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తక్షణం క్రమబద్ధీకరించాలని, పీస్‌రేటు పద్ధతిని రద్దు చేసి సంస్థ నుంచి జీతాలివ్వాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు వినూత్న రీతిలో ఆందోళనలు చేసి నిరసన తెలిపారు.

తిరుపతిలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యుత్ సంస్థల లాభాలే లక్ష్యంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికుల డిమాండ్లన్నీ నెరవేర్చాలని అన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ వద్ద ఉద్యోగులు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. బొబ్బిలిలో సమ్మె విచ్చిన్నం చేసేందుకు బయట వ్యక్తులను తీసుకొచ్చి పనులు చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా, ఉద్యోగులంతా అడ్డుకున్నారు. కార్మికులకు వైసిపి, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని ఎపి ఇపిడిసిఎల్ ఎస్‌ఇ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు అర్ధనగ్నంగా ధర్నా చేశారు. సిఐటియు, విద్యుత్ ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ కార్మికుల సమస్యలను శాసన మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలమంతా లేవనెత్తి, న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి, విద్యుత్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వానికి విద్యుత్ కార్మికులు కరెంట్ షాక్ తగిలించాలని అన్నారు. భీమవరంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న 1,250 మంది కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్య ఇంజినీర్ కార్యాలయం వద్ద కార్మికుల రిలే నిరాహార దీక్ష రెండోరోజుకు చేరింది. వీరి సమ్మెకు సిపిఎంతోపాటు సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి.

గుంటూరు జిల్లా పొన్నూరు రోడ్డు ట్రాన్స్‌కో జిల్లా కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ శివకుమారి సందర్శించి, మద్దతు తెలిపారు. విజయవాడ, ఇబ్రహీంపట్నంలోని ధర్నా చౌక్ వద్ద విద్యుత్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. వారికి మద్దతుగా వన్‌టౌన్ చేపల మార్కెట్ వద్ద గల కొరగంజి ఫంక్షన్ హాల్‌లో సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సమ్మె కొనసాగింది. కర్నూలు కృష్ణ దేవరాయల సర్కిల్‌లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక చైర్మన్ శరత్ కుమార్ మూడోరోజు దీక్షలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నివేదికల పేరున కాలయాపన చేస్తే పాలకులకు పతనం తప్పదని హెచ్చరించారు. అనంతపురం జిల్లాలో దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, వైసిపి ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, సిపిఎం నాయకులు వెంకటనారాయణ సంఘీభావం తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆపేది లేదని నెల్లూరులో యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు తెలిపారు.

పెదగొట్టిపాడులో కెఎన్‌పిఎస్ నాయకుల అరెస్టు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు/గుంటూరు

పెత్తందార్ల దాడికి నిరసనగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళితవాడలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిని పరామర్శించేందుకు వచ్చిన కెఎన్‌పిఎస్ (కుల నిర్మూలనా పోరాట సంఘం) నాయకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సెక్షన్ 30ని ఉల్లంఘించారని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, కార్యకర్త విల్సన్, గొట్టిపాడు గ్రామానికి చెందిన దళిత నాయకుడు ప్రకాష్‌బాబులను అరెస్టు చేసి ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అనుమతి లేకుండా గ్రామంలోకి బయట వ్యక్తులు రాకూడదని పోలీసులు హుకుం జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకూ, నాయకులకూ మధ్య వాగ్వివాదం జరిగింది. తాము బాధితులకు అండగా ఉంటున్నామని, ఎక్కడా ఎటువంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయలేదని కృష్ణ పోలీసులకు స్పష్టం చేశారు. అయినా వీరిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం తూర్పు, పశ్చిమ జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య తీవ్రంగా ఖండించారు. ఘటన జరిగి రెండు నెలలు అవుతున్నా గ్రామంలో పోలీసుల ఆంక్షలు కొనసాగించడం దారుణమన్నారు.



పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కెఎన్‌పిఎస్ నాయకులు

మార్చి 3కి 'చలో గుంటూరు' వాయిదా

పెదగొట్టిపాడు దళితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 23న నిర్వహించాల్సిన 'చలో గుంటూరు' కార్యక్రమాన్ని మార్చి 3కి వాయిదా వేసినట్లు పెదగొట్టిపాడు దళిత బాధిత సంఘీభావ పోరాట కమిటీ ప్రకటించింది. ఈ మేరకు గుంటూరులో గురువారం పాత్రికేయుల సమావేశంలో కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ మాట్లాడారు. 20 రోజుల క్రితమే బహిరంగ సభకు అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసినా వారు నాన్చివేత ధోరణితో వ్యవహరించారనీ, చివరి వరకూ అనుమతిపై తేల్చలేదనీ చెప్పారు. అంతేగాక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కార్యక్రమానికి ఆటంకాలు సృష్టించటానికి ప్రయత్నాలు చేశారన్నారు. బహిరంగ సభకు ఎంపిక చేసిన స్థల యాజమాన్యంపై బెదిరింపులకు పాల్పడి వారు అనుమతులు విరమించుకునేలా ఒత్తిడి చేశారని విమర్శించారు. ఈ క్రమంలో పాత దరఖాస్తుకు సమయం తక్కువగా ఉందనీ, మళ్లీ కొత్తగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో కార్యక్రమం 3వ తేదీకి వాయిదా పడిందనీ పేర్కొన్నారు.

అణు, థర్మల్ ప్లాంట్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్, పోలాకి థర్మల్ పవర్ ప్లాంట్లను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని సుందరయ్య భవన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎక్కడా పరీక్షించని రియాక్టర్లతో ఏర్పాటు చేస్తున్న కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం ద్వారా తీవ్ర ముప్పు పొంచి ఉందన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఉత్తరాంధ్ర జిల్లాలు భస్మీపటలం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ (కాకరాపల్లి థర్మల్ విద్యుత్ ప్లాంట్)ని రద్దు చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించిన నేపథ్యంలో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన 1107 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాకరాపల్లి ప్లాంట్ నిర్మాణానికి జాతీయ బ్యాంకులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ.మూడు వేల కోట్ల రుణాన్ని ఈస్ట్‌కోస్ట్ యాజమాన్యం నుంచి రాబట్టాలన్నారు. సోంపేట, కాకరాపల్లి థర్మల్ పవర్ ప్లాంట్లకు బొగ్గును దిగుమతి చేసుకునేందుకే భావనపాడు పోర్టును నిర్మిస్తున్నామని ప్రభుత్వ పెద్దలు గతంలో చెప్పారని, ఈ ప్లాంట్లు ఇప్పుడు రద్దయినందున పోర్టు అవసరమేమిటని ప్రశ్నించారు.

భవానీపురం సిఐని సస్పెండ్ చేయాలని న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కేసును తీసుకోని భవానీపురం సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ న్యాయవాదులు గురువారం కోర్టు ఎరురుగా రిలే నిరహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గంటా రమేష్‌మనోహర్ మాట్లాడుతూ న్యాయవాది ఇచ్చిన కేసును తీసుకోకుండా రౌడీ షీటర్‌కు అండగా నిలవడం సరికాదన్నారు. సిఐ తీరుకు నిరసనగా రెండు రోజుల నుంచి విధులు బహిష్కరించి ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కేసు నమోదు చేయాలని, రౌడీ షీటర్‌ను అరెస్టు చేయించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కొనసాగిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆందోళన


ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం కూడా కొనసాగాయి. జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి ఉన్న రూ. 20 కోట్లను వెంటనే విడుదల చేయాలని చేపట్టిన రెండో రోజు దీక్షా శిబిరాన్ని కొత్తవలస సిఐటియు నాయకులు దేగల అప్పలరాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం బడిపిల్లల భోజన పథకం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులు సృష్టించి తద్వారా వారిలో అసంతృప్తిని పెంచుతోందని విమర్శించారు. పథకాన్ని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి కాంట్రాక్టర్లను, బడాబాబులను పెంచేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ పథకాన్ని కాపాడుకోవడానికి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. దీక్షల్లో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, కొత్తవలస నుంచి వచ్చిన కె.అచ్చియ్యమ్మ, బి.మంగమ్మ, బి.లక్ష్మి, వరాలమ్మ, జె.లక్ష్మి, బి.దుర్గమ్మ, ఎం.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కిడ్నీ వ్యాధి బాధితులను ఆదుకోవాలి

- సిపిఎం నేతలు బాబూరావు, డివి కృష్ణ డిమాండ్
- ఎ.కొండూరు మండలం కిడ్నీబాధితులకు సిపిఎం బృందం పరామర్శ



కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు, డి.వి.కృష్ణ తదితరులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

కిడ్నీ వ్యాధి బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ డిమాండ్‌చేశారు. కృష్ణాజిల్లా ఎ.కొం డూరు మండలంలోని దీప్లానగర్, మాన్‌సింగ్, మత్రియా గిరిజన తండాలు, రామచంద్రాపురం శివారు లక్ష్మీపురం గ్రామాల్లో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. గత నాలుగైదేళ్లుగా కిడ్నీ వ్యాధి సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా మని బృందానికి బాధితులు వివరించారు. ఆర్‌ఒ ప్లాంట్లు ఉన్నా నిరుపయోగంగానే ఉన్నాయనీ, నీటిలో ఫ్లోరైడ్ శాతం చాలా ఎక్కువగా ఉందన్నారు. చికిత్స కోసం ప్రతినెలా విజయవాడ రావాల్సి వస్తోందన్నారు. మందులకు నెలకు రూ.8వేలకుపైగా ఖర్చు అవుతుందని దీప్లానగర్ వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. బృందంలో పశ్చిమకృష్ణా కార్యదర్శివర్గసభ్యులు పి.వి.ఆంజనే యులు, పశ్చిమకృష్ణా కమిటీ సభ్యులు జి.విజయ్ ప్రకాష్, ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు శెనగల రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఆనందరావు, గిరిజన సంఘం నాయ కులు బి.గోపిరాజునాయక్ తదితరులు ఉన్నారు. అనంతరం తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్‌ను సిపిఎం ప్రతినిధి బృందం కలిసి కిడ్నీ వ్యాధుల సమస్య, తీవ్రత గురించి వివరించింది.

ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని 16 నుంచి 20 గ్రామాల్లో వందలాది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న దృష్ట్యా ఆయా మండలాలను కిడ్నీ బాధిత ప్రాంతంగా ప్రత్యేకం గా గుర్తించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎ.కొండూరులోని సిపిఎం కార్యాల యంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఉధృతమవుతున్న ప్రత్యేక హోదా ఉద్యమం

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన వివిధ కార్యక్రమాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతమవుతోంది. రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు, వివిధ కార్యక్రమాల ద్వారా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు విస్తృత మద్దతు కూడగడుతున్నాయి. విజయనగరం జిల్లా పార్వతీపురంలో సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరగడానికి టిడిపి ప్రభుత్వం చేతగానితనమే కారణమని విమర్శించారు. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళంలోని రెవెన్యూ అతిథి గృహంలో నాన్ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రత్యేక హోదా కోసం రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపిలు రాజీనామా చేయాలని, లేకుంటే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎ.శ్రీహరినాయుడు హెచ్చరించారు. ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా మార్చి మూడో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు రిలేనిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగున ఎపి భవన్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామన్నారు. ఐదున ఎపి భవన్ వద్ద భిక్షాటన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరున ఎపి కేంద్ర మంత్రులు, ఎంపిలకు వినతిపత్రాలు సమర్పిస్తా మన్నారు. సమావేశంలో నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అయ్యస్వామి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఐఎఫ్‌టియు నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం మార్చి ఆరున తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో కర్నూలులోని ఎస్‌టియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ, వైసిపి, జనసేన పార్టీ, బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలని, ప్రత్యేక హోదా ఉద్యమం దిగ్విజయం కావాలని కోరుతూ చిత్తూరు జిల్లా అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత విద్యార్థులు, యువకులు కొబ్బరి కాయ కొట్టారు. అనంతరం అక్కడి నుంచి కార్పొరేషన్ కార్యాలయ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పిసిసి రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు అధ్యక్షతన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. పిసిసి ఉపాధ్యక్షులు ఎన్.తులసిరెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక హోదా కోసం శివసేన ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.



కర్నూలులో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పశ్చిమ కర్నూలు జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

కారులో కమల్-రజనీ రహస్య భేటీ

న్యూఢిల్లీ : రాజకీయాల్లోకి కొత్తగా అడుగుపెట్టిన ప్రముఖ నటులు కమల్ హాసన్, రజనీకాంత్‌లు గురువారం ఒక 'రహస్య' సమావేశం జరపడం సంచలనం సృష్టించింది. రాజకీయంగా ప్రత్యర్థులయినప్పటికీ పరస్పర గౌరవంతో వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుసోంది. ప్రముఖ తమిళ వార పత్రిక ఆనంద వికటన్‌కు రాసిన కాలమ్‌లో కమల్ తమ 'రహస్య' సమావేశం విషయాన్ని బహిర్గతం చేశారు. అయితే ఈ సమావేశం ఎప్పుడు జరిగిందో ఆయన వెల్లడించలేదు. చెన్నైకి సమీపంలోని పూనమల్లేలోని ఒక ప్రైవేట్ స్టూడియోలో బిగ్ బాస్ టీవీ ప్రోగ్రామ్ షూటింగ్ సమయంలో ఒక కారులో ఈ సమావేశం జరిగినట్లు తెలిపారు. కమల్ హాసన్ వ్యాఖ్యాతగా ఉన్న బిగ్ బాస్ కార్యక్రమం గత ఏడాది ప్రసారమయింది.



ప్రారంభం
త్రిస్సూర్‌లో సిపిఎం కేరళ రాష్ట్ర మహాసభ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

బిజెపి ప్రభుత్వ నిష్క్రమణతోనే ప్రజా సంక్షేమం సాధ్యం : ఏచూరి

త్రిస్సూర్ (కేరళ) : ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గద్దె దిగిపోతేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని, అప్పటి వరకూ అది అసాధ్యమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామం ఏచూరి పేర్కొన్నారు. ఇక్కడ సిపిఎం కేరళ రాష్ట్ర మహాసభను సీతారామ్ ప్రారంభించారు. మతతత్వం, నయా ఉదారవాద విధానాలపై పోరాటంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పునరుద్ఘాటించారు. బిజెపి మత విధానాలపై, పెట్టుబడీదారి విధానాలపై పోరాటం కొనసాగిస్తామని, పెట్టుబడీదారి విధానం, గుత్తాధిపత్యానికి ప్రత్యామ్నాయానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించాలంటే సిపిఎం మరింత బలోపేతం కావాలని అన్నారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమిని ఓడించడానికి సరైన ఎన్నికల వ్యూహాలు అవసరమని, అయితే దీని అర్థం కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకుంటామని కాదని సీతారాం తెలిపారు. రాజకీయ హింస సిపిఎం సంస్కృతి కాదని, కేరళలో సిపిఎం కార్యకర్తలు నిరంతరం దాడులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిపిఎం కార్యకర్తలపై ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం దాడులకు ప్రయత్నిస్తుందని, స్వీయ రక్షణతో హింసను ఎదుర్కొంటామని సీతారామ్ తెలిపారు.

వయోజనులైన 'జంట' వివాహాలను రద్దు చేయలేం : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఇద్దరు వయోజనులైన స్త్రీ, పురుషులు సమ్మతితో చేసుకున్న వివాహ బంధాన్నీ న్యాయస్థానాలు రద్దు చేయలేవని సుప్రీం కోర్టు గురువారం పేర్కొంది. హదియా కేసును విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఆ వివాహం సరైనదా కాదా, వారి సంబంధం నిజమైనదేనా అనే విషయం కోర్టు చెప్పగలదా అని ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఆమె(హదియా) సరైన వ్యక్తిని వివాహం చేసుకుందా లేదా అన్నా విషయం కూడా న్యాయస్థానం చెప్పలేదని, తన ఇష్టపూర్వకంగానే అతనిని వివాహం చేసుకున్నట్లు హదియా తెలిపిందని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. హోమియోపతి విద్యార్థి అయిన హదియా ముస్లిం మతంలోకి మారి అనంతరం ముస్లిం యువకుడిని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ వివాహాన్ని కేరళ హైకోర్టు రద్దు చేసింది. తమ కుమార్తెను బలవంతంగా ఇందుకు ఒప్పించారని తండ్రి ఆందోళన చెందుతున్నాడని అశోక్ తరుపు న్యాయవాది శ్యామ్ దివాన్ కోర్టుకు తెలిపారు. ఇటువంటి సమాచారం అందితే దానిని ఆపడానికి ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయని చంద్రచూడ్ స్పష్టం చేశారు తన కుమార్తె చిన్న పిల్ల కావడం వల్ల అతని పట్ల ఆకర్షితురాలైందనిహదియా తండ్రి భావిస్తున్నారని, కాని ఆమె వయోజనురాలని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో తదుపరి విచారణ మార్చి 8న జరుగుతుంది.

ఢిల్లీ సిఎస్ వ్యాఖ్యలపై నిరసనకు యత్నించిన ఆప్ మంత్రి అరెస్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ ఛీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాష్ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసం ముందు గురువారం నిరసన తెలపడానికి వెళుతున్న ఆప్ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్షు ప్రకాష్ చేసిన 'కులతత్వ వ్యాఖ్యలు'కు వ్యతిరేకంగా కొంత మంది కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపడానికి ఆప్ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్ ప్రయత్నించారు. సోమవారం ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో జరిగిన సమావేశంలో సిఎస్ అన్షు ప్రకాష్ తమపై కులవ్యాఖ్యలు చేశారని, అనుచితమైన భాష ఉపయోగించారని ఆప్ ఎమ్మెల్యేలు ప్రకాష్ జర్వాల్ (డోలి నియోజకవర్గం), అజయ్ దత్ (అంబేద్కర్ నగర్) ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై వారు ఢిల్లీ పోలీసులకు, జాతీయ షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అన్షు ప్రకాష్ కుల వ్యాఖ్యలకు వ్యతిరేకించడంతోపాటు, తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయడంపై ఆప్ నిరసనలు వ్యక్తం చేస్తోంది. పోలీసులు ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండానే, ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎమ్మెల్యేలను అరెస్టు చేశారని ఆప్ పేర్కొంటోంది. కేజ్రీవాల్ నివాసంలో ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేశారని సిఎస్ అన్షు ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కేసులో ఎమ్మెల్యేలు అమానుతుల్లా ఖాన్, ప్రకాష్ జార్వల్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు.

అన్షు ప్రకాశ్‌పై జరిగిన దాడిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజుల్ నుండి నివేదిక అందినట్లు హోం మంత్రి త్వ శాఖ తెలిపింది. ఆ నివేదికను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై ఢిల్లీ పోలీసులు క్రిమి నల్ చర్యలు తీసుకోవాలనే అంశంపై జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని, అయితే దీని వల్ల పాలనాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న ఆలోచనలో హోం శాఖ ఉందని తెలిపారు.

వసుంధర సర్కార్ అణచివేత చర్యలను ఖండించిన సిపిఎం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన తెలియచేస్తున్న రైతాంగంపై రాజస్థాన్‌లోని వసుంధరా రాజే సర్కారు అనుసరిస్తున్న అణచివేత చర్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. అఖిల భారత కిసాన్‌సభకు చెందిన వందలాది మంది రైతు నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి వారిపై తప్పుడు కేసులు బనాయించారని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. అరెస్టయిన వారిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు అమ్రారామ్, మాజీ ఎమ్మెల్యేలు పేమారామ్, పవన్ దుగ్గల్ వంటి వారున్నారని వివరించింది. 2017 ఎన్నికల్లో వ్యవసాయ రుణాల మాఫీ, గిట్టుబాటు ధర వంటి వాటిపై ఇచ్చిన హామీలను బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కటాన్ని నిరసిస్తూ రాష్ట్ర రాజధాని జైపూర్ వైపు ప్రదర్శన కొనసాగిస్తున్న సమయంలో వీరిని అరెస్ట్ చేశారని పొలిట్ బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. నిరసన వ్యక్తం చేయటం కనీస ప్రజాతంత్ర హక్కు అన్న విషయాన్ని విస్మరించిన వసుంధర సర్కారు కిసాన్ ఉద్యమ నేతలపై పోలీసు బలగాన్ని ఉపయోగించటం ద్వారా తన నియంతృత్వ వైఖరిని ప్రదర్శించిందని దుయ్యబట్టింది. అరెస్టయిన వారందరినీ వెంటనే విడుదల చేసి వారిపై నమోదు చేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని, చట్టబద్ధమైన కిసాన్‌సభ డిమాండ్లను ఆమోదించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ఢిల్లీలో ప్రజాపంపిణీ, కనీస వేతనాలపై సిపిఎం ఆందోళన

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

దేశ రాజధాని హస్తినలో ప్రజాపంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలని, అసంఘటిత రంగంలోని ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ సచివాలయం ఎదుట గురువారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కెఎం తివారీ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు,కార్యకర్తలు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. అంతకు ముందు నిరసన ప్రదర్శన కొనసాగిస్తున్న వారిని పోలీసులు అడ్డుకోవటంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

రొటోమాక్ యజమాని అరెస్టు

న్యూఢిల్లీ : బ్యాంకులకు రుణ ఏగవేత కేసులో రొటోమాక్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీ, అతడి కుమారుడు రాహుల్ కొఠారీని సిబిఐ గురువారం అరెస్టు చేసింది. ప్రముఖ పెన్నుల కంపెనీ రొటోమాక్ యజమాని విక్రమ్ కొఠారి రూ.3,695 కోట్ల మేర మోసానికి పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో సిబిఐ వీరిద్దరినీ బుధవారం నుంచి విచారిస్తోంది. ఆయన ఇంటిపై కూడా దాడులు చేసింది. అయితే విచారణకు వీరు సహకరించడం లేదని, అందుకే అరెస్టు చేశామని సిబిఐ అధికారులు తెలిపారు. రొటామాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెట్‌కు విక్రమ్ కొఠారీ, రాహుల్ కొఠారీ, అతని భార్య సాధన కొఠారీ డైరెక్టర్లుగా ఉన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి కొఠారీ సుమారు రూ.3700కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విక్రమ్ కొఠారీపై బ్యాంక్ ఆఫ్ బరోడా ఫిర్యాదుతో ఈ నెల 18న సిబిఐ కేసు నమోదు చేసింది. విక్రమ్ కొఠారీ కూడా దేశం విడిచిపారిపోతాడనే భయంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఫిర్యాదు చేసింది. అలాగే ముంబయిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.485 కోట్లు, కోల్‌కతాలోని అలహాబాద్ బ్యాంక్ నుంచి రూ.352 కోట్లు తీసుకొని ఏడాది తర్వాత కూడా అసలు గానీ, వడ్డీగాని కొఠారీ చెల్లించలేదు. కానీ సిబిఐ విచారణలో మాత్రం కొఠారి తాను ఎటువంటి తప్పు చేయలేదని చెబుతున్నారు. తాను బ్యాంకు నుంచి రుణం తీసుకున్నది నిజమే.. కానీ తిరిగి చెల్లించలేదనడంలో వాస్తవం లేదని తెలిపారు.

మొత్తం దేశ సంపదలో 15 శాతం శతకోటీశ్వర్లదే !

భారత్‌లో అసమానతలు సరళీకరణ విధానాల ఫలితమే

పేదలు మరింత పేదరికంలోకి..

ఆక్స్ ఫామ్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో మూడు దశాబ్దాల నుంచి ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయిలో పెరిగిపోతున్నాయని ఆక్స్‌ఫామ్ ఇండియా వెల్లడించింది. ఏకపక్ష విధానాల ఫలితంగా భారతలోని శతకోటీశ్వర్ల సంపద దేశ స్థూల జాతీయోత్పత్తిలో 15 శాతానికి సమానంగా ఉందని పేర్కొంది. పేదలు మరింత పేదలుగా మిగులుతున్నారని ఆక్స్‌ఫామ్ ఇండియా గురువారం విడుదల చేసిన నివేదికలో ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ విధానాల కారణంగా ఇది జరుగుతుందని తెలిపింది. భారత్‌లో సృష్టించబడుతున్న మొత్తం సంపదలో అత్యధిక భాగాన్ని ఆశ్రిత పెట్టుబడిదారులకే వారసత్వంగా మిగిలిపోతుండగా, ప్రజలను పేదరికం నుంచి మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని నివేదిక స్పష్టం చేసింది.

1991లో దేశంలో పెద్ద ఎత్తున తీసుకొచ్చిన ఆర్థిక సరళీకరణ ఫలితాల మూలానే భారత్‌లో అసమానతలు అంతకంతకూ పెరిగిపోతూవచ్చాయని ఆక్స్‌ఫామ్ ఇండియా సిఈఓ నిషా అగర్వాల్ విశ్లేషించారు. ఐదేళ్ల కిందట జిడిపిలో పది శాతానికి సమానంగా ఉన్న భారత శతకోటీశ్వర్ల సంపద తాజా అంచనా ప్రకారం 15 శాతానికి పెరిగిందని తెలిపారు. 'ది వైడెంగ్ గ్యాప్స్ : ఇండియా ఇనిక్వాలిటీ రిపోర్ట్ 2018' పేరుతో ఆక్స్‌ఫామ్ ఈ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 2017 లెక్కల ప్రకారం భారత్‌లో 101 మంది శతకోటీశ్వర్లు ఉన్నారు. ఆదాయం, వినియోగం, సంపద వంటి అన్ని ప్రామాణికాల్లోనూ ప్రపంచంలోని అత్యంత అసమనతలున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, కార్పొరేట్‌లకు అనుకూలంగా ప్రభుత్వాలు ఏకపక్షంగా అమల్జేస్తున్న విధానాలే దీనికి ప్రధానకారణమని తెలిపింది. కార్మిక ప్రయోజనాల స్థానంలో పెట్టుబడి సానుకూల విధానాలే ప్రభుత్వాలకు పరమావధిగా మారిన ప్రమాదకర దోరణి భారత్‌లో తిష్టవేసిందని వ్యాఖ్యానించింది. 1980 వరకూ దేశంలో అసమానతలు స్థిరంగా వున్నా, 1991 నుంచి 2017 వరకూ తీవ్రంగా పెరిగాయని వివిధ అధ్యయనాల విశ్లేషించిన తర్వాత అర్థమౌతోందని ఆక్స్ ఫామ్ నివేదించింది. ఇప్పటికే కుల, మత, ప్రాంత, లింగ వివక్షతల కారణంగా సామాజిక అసమానతలతో చితికిపోతున్న భారత్‌లో ఆర్థిక అసమానతలు అదనంగా చేరడం ప్రత్యేకంగా ఆందోళనకల్గించే అంశమని తెలిపింది. విచ్చమవుతున్న భారత సమాజంలోకి ఆర్థిక అసమానతలు కూడా చేరాయని తెలిపింది. అసమానతల తగ్గింపు కేంద్రీకృతంగా పనిచేయడం భారత ప్రజాస్వామిక నైతిక బాధ్యతగా ఉండాల్సిన అవసరముందని ఆక్స్‌ఫామ్ ప్రతినిధి అగర్వాల్ తెలిపారు. గత ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ హక్కుల విభాగం విడుదల చేసిన నివేదిక భారత్‌లో ఉత్పత్తి అవుతున్న సంపదలో 73 శాతం ఒక్క శాతం శతకోటీశ్వర్ల వద్ద పోగుబడిందని పేర్కొన్న సంగతి తెలిసిందే.

మెరుగైన రవాణాతో ఈశాన్య ప్రాంత అభివృద్ధి

న్యూఢిల్లీ : రవాణాను మెరుగుపరచడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధిపరచాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. నాగాలాండ్ జిల్లాలోని ట్యున్సెంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో మోడీ ప్రసంగించారు. బిజెపి-ఎన్‌డిపిపి కూటమిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజా ధనం వృదా అవడానికి కారణమవుతున్న లొసుగులు, లోపాలను సరిదిద్దడానికి, నాగాలాండ్‌లో రహదారుల అనుసంధానతను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికలు జరగనున్న మేఘాలయ, నాగాలాండ్‌ల్లో పలు బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళలోనే 500కిలోమీటర్లు అదనంగా జాతీయ రహదారులను విస్తరించామని చెప్పారు. నాగాలాండ్‌లో రోడ్ల అభివృద్ధికి 10వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని మారుస్తామని చెప్పారు. కోహిమాను స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దడానికి రు.1800కోట్లు ఖర్చు పెడతామన్నారు. అనంతరం మేఘాలయలోని ఫుల్‌బరిలో మరో బహిరంగ సభలో ప్రసంగించారు. బిజెపికి ఒక్క అవకాశం ఇస్తే ఈశాన్య ప్రాంతంలో అభివృద్ధిని తీసుకువస్తా మని చెప్పారు. మేఘాలయను మిగిలిన దేశంతో సక్రమంగా అనుసంధానించినట్లైతే రాష్ట్ర ప్రజల జీవితాలు అద్భుతంగా మారతాయని పేర్కొన్నారు.

జార్ఖండ్ పిఎఫ్ఐపై నిషేధం

రాంచీ : రాష్ట్రంలో విద్వేషపూరిత ప్రచారాన్ని సాగిస్తుందన్న ఆరోపణపై పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పిఎఫ్ఐ)ను జార్ఖండ్ ప్రభుత్వం నిషేధించింది. దీనిపై చర్యలకు హోం శాఖ అనుమతించిన అనంతరం న్యాయ శాఖ ఈ మేరకు నిర్ణయం గైకొంది. పిఎఫ్ఐను 1908 క్రిమినల్ లా సవరణ చట్టం సెక్షన్ 16 కింద నిషేధించారు. ఈ నిర్ణయంపై బిజెపి ఎమ్మెల్యే అనంత్ ఓజా ప్రశంసిస్తూ, ఈ ప్రాంతంలో సానుకూల మార్పులు రానున్నాయని పేర్కొన్నారు. ఈ పార్టీని నిషేధించినందుకు ముఖ్యమంత్రిని అభినందిస్తున్నానని పేర్కొన్నారు. కాగా, ఫిబ్రవరి 17న జార్ఖండ్‌లోని పకూర్ జిల్లాలో పిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. 2006లో నేషనల్ డెవలప్‌మెంట్ ఫ్రంట్(ఎన్‌డిఎఫ్) అనుబంధ సంస్థగా పిఎఫ్ఎ ఏర్పడింది. భారత్‌లో ఇది అతివాద, తీవ్రవాద ఇస్లామిక్ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్న సంస్థగా పేరు గాంచింది.

చైల్డ్ ఫోర్నోగ్రఫీ రాకెట్‌ను చేధించిన సిబిఐ

న్యూఢిల్లీ : వివిధ దేశాల నుండి 119 మంది సభ్యులతో కూడిన వాట్సప్ గ్రూప్ ద్వారా నడుస్తున్న చైల్డ్ ఫోర్నోగ్రఫీ రాకెట్ (పిల్లల అశ్లీల చిత్రాల రాకెట్)ను గురువారం సిబిఐ చేధించింది. ఉత్తరప్రదేశ్ లోని కన్నౌజ్‌కు చెందిన వాట్సప్ గ్రూప్ నిర్వాహకుడు నికిల్ వర్మను సిబిఐ అరెస్టు చేసింది. ముంబయికి చెందిన సత్యేంద్ర చౌహన్, ఢిల్లీకి చెందిన నఫీస్ రాజా, జాహీద్, నోయిడాకు చెందిన ఆదర్శ్ అనే వ్యక్తులు వాటప్స్ గ్రూప్ నిర్వాహకులుగా గుర్తించింది. కిడ్స్ -ఇఇఇ పేరుతో వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నారని, ఇందులో శ్రీలంక, పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, యుఎస్, మెక్సికో, న్యూజిలాండ్, చైనా, నైజీరియా, కెన్యాకు చెందిన వారు కూడా ఉన్నారని సంస్థ పేర్కొంది.

ట్రూడో కార్యక్రమంలో ఖలిస్తాన్ వేర్పాటు వాది కలకలం

న్యూఢిల్లీ : తాను ఖలిస్తానీ వేర్పాటు వాదులను ఏ మాత్రం సమర్ధించబోనంటూ ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించిన మరునాడే, ముంబయిలో ఆయన పాల్గొన్న కార్యక్రమంలో ఖలిస్తాన్ వేర్పాటు వాదనేత జస్పాల్ అత్వాల్ పాల్గొనటం కలకలం సృష్టించింది. అంతేకాదు ట్రూడో ఢిల్లీలో పాల్గొనే మరో కార్యక్రమానికి కూడా జస్పాల్‌కు ఆహ్వానం అందినట్లు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. 1986లో అప్పటి పంజాబ్ మంత్రి మాల్కియత్ శోధిని కాల్చిచంపిన కేసులో జస్పాల్ అత్వాల్ శిక్షకు గురైన విషయం తెలిసిందే. ఢిల్లీలో గురువారంనాడు కెనడా హైకమిషనర్ ప్రధాని ట్రూడో గౌరవార్థం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొనేందుకు అత్వాల్‌కు ఆహ్వానం అందిందని కెనడియన్ మీడియా తన వార్తా కథనాలలో ప్రసారం చేసింది. కాగా అత్వాల్‌కు ఆహ్వానం పంపిన విషయంపై స్పందించేందుకు ఢిల్లీలోని కెనడియన్ హైకమిషన్ నిరాకరించింది. ప్రధాని భద్రతకు సంబంధించిన వ్యవహారాలపై తాము స్పందించ బోమని హైకమిషన్ వెల్లడించింది. మంగళవారం నాడు ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రూడో భార్య సోఫీ గ్రెగరీ ట్రూడో, కేబినెట్ మంత్రి అమర్‌జిత్ శోధితో కలిసి అత్వాల్ దిగిన ఫొటోలను కెనడియన్ మీడియా తన కథనాలలో ప్రసారం చేసింది. ఈ కథనాలపై తరువాత స్పందించిన ప్రధాని ట్రూడో మీడియాతో మాట్లాడుతూ అత్వాల్‌కు ఆహ్వానం పంపి వుండాల్సింది కాదన్నారు. దీనిని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. వ్యక్తిగతం గా తాము ఎవరికీ ఆహ్వానం పంపబోమని ఆయన వివరించారు.

కావేరీ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

ప్రధానిని కలువనున్న అఖిల పక్ష బృందం

చెన్నై : కావేరీ జలాల పంపిణీపై తక్షణమే కావేరి మేనెజ్‌మెంట్ బోరును ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీపై తమిళనాడు అఖిల పక్ష బృందం వత్తిడి తేనున్నది. ముఖ్యమంత్రి ఎడప్పడి పళనిస్వామి నేతృత్వంలోని అఖిల పక్ష బృందం ఇందుకు సమాయత్తమౌతోంది. వివిధ రైతు సంఘాలను, రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యుల ప్రతినిధుల ఇందుకు కలిసి రావాలని పళనిస్వామి పిలుపునిచ్చారు. గురువారం సెయింట్ జార్జ్ ఫోర్ట్ లో ముఖ్యమంత్రి అధ్యక్షత వహించిన అఖిల పక్ష సమావేశంలో ఈ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ఆమోదించారు. ఫిబ్రవరి 16, 2018 న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఆరు వారాల్లో కావేరి మేనెజ్‌మెంట్ బోర్డు, కావేరి వాటర్ రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రధానంగా తీర్మానించారు.

యోగి ఆదిత్యనాథ్‌పై సిబిఐ విచారణకు హైకోర్టు 'నో'

న్యూఢిల్లీ : 2007 గోరఖ్‌పూర్ అల్లర్ల సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు గురువారం తిరస్కరించింది. జస్టిస్ కృష్ణ మురారి, ఎసి శర్మ కూడిన డివిజనల్ బెంచ్ ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ పోలీసుల దర్యాప్తులో కానీ, యోగి ఆదిత్యనాథ్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడంలో ఎటువంటి వివక్ష చోటుచేసుకున్నట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొంది. 2008లో సిఎం చేసిన ద్వేషపూరిత ప్రసంగమే ఈ అల్లర్లకు కారణమంటూ మహ్మద్ అసద్ హయాత్, పర్వేజ్‌లు పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ అల్లర్లలో ఒక వ్యక్తి మృతి చెందారు. అల్లర్లకు సంబంధం ఉందని పర్వేజ్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. హయాత్ ప్రత్యక్షసాక్షి.

రాజకీయ వ్యాఖ్యలు చేయవద్దు

ఆర్మీ చీఫ్‌కు ఎఐయుడిఎఫ్ సూచన

గౌహతి : రాజకీయ వ్యాఖ్యలు చేయవద్దని భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్‌కు ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) సూచించింది. బిపిన్ రావత్ చేసిన 'రాజకీయ వ్యాఖ్యలు'ను గమనించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విజ్ఞప్తి చేసింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ మాట్లాడుతూ 'బిజెపి కంటే వేగంగా అస్సోంలో ఎఐయుడిఎఫ్ ఎదుగుతుంది' అని వ్యాఖ్యానించారు. బిజెపి ఎదగడానికి చాలా కొన్ని సంవత్సరాలు పడితే, ఎఐయుడిఎఫ్ చాలా వేగంగా ఎదుగుతోంది అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎఐయుడిఎఫ్ వ్యవస్థాపకుడు, ఎంపి మౌలానా బద్రుద్దీన్ అజ్మాల్ గురువారం మాట్లాడుతూ 'బిపిన్‌రావత్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయి' అని అన్నారు. ఒక పార్టీ ప్రజాస్వామ్యం, లౌకిక విలువల ఆధారంగా వృద్ధి చెందుతుంటే ఆందోళన ఎందుకని ప్రశ్నించారు. పెద్ద పార్టీల ప్రభుత్వాలు సక్రమంగా లేకపోవడంతోనే ఎఐయుడిఎఫ్, ఆప్ వంటి పార్టీలు వృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్యానించారు. కాగా, ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు అస్సోం అసెంబ్లీలోనూ చర్చకు దారితీసాయి. 'బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన ముస్లింలు ఎఐయుడిఎఫ్‌కు మద్దతు నిస్తున్నారని ఆర్మీ చీఫ్ వద్ద ఆధారాలుంటే ఎఐయుడిఎఫ్‌ను ప్రభుత్వం నిషేధించాలి' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే జాకిర్ హుస్సైన్ సిక్దర్ అన్నారు. 2005లో ఎఐయుడిఎఫ్‌ను మౌలానా బద్రుద్దీన్ అజ్మాల్ స్థాపించారు. ఆ పార్టీకి ప్రస్తుతం ముగ్గురు లోక్‌సభ సభ్యులు, 13 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

ప్రత్యేకం

పెరుగుతున్న 'అదృశ్య' కేసులు

అపరిష్కృతంగా మెజారిటీ కేసులు

ఐక్యరాజ్య సమితి కమిటీ వెల్లడి

మానవ హక్కుల పరిరక్షణ పోరుకు ఎదురుదెబ్బ



ఐక్యరాజ్య సమితి : ప్రపంచవ్యాప్తంగా 'అదృశ్యమవుతున్న' కేసులు పెరుగుతున్నాయి. ఈ కేసుల్లో కూడా మెజారిటీ కేసులు పరిష్కారం కాకుండానే మిగిలిపోతున్నాయి. అదృశ్యమైన వారి మృత దేహాలు కనిపించకపోవడం, ఫోరెన్సిక్ సాక్ష్యాధారాలు లేకపోవడం, కనీసం ప్రత్యక్షంగా చూసిన వారు కూడా లేకపోవడంతో ఇటువంటి ఘటనలకు కారకులైన వ్యక్తులు, గ్రూపులు ఎలాంటి శిక్ష పడకుండా తప్పించుకుంటున్నాయి. దీంతో మానవ హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి ఎదురు దెబ్బ తగులుతోంది. అనూహ్య మైన రీతిలో దుష్ఫలితాలు కలుగుతున్నాయి. ప్రభుత్వాలు కూడా తమ రాజకీయ ప్రత్యర్థులను వదిలించుకోవడానికి వ్యూహాలను మార్చినట్లు కనిపిస్తోంది. ప్రత్యర్థులను హతమార్చడానికి బదులుగా వారిని, ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోవాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారి వివరాలేవీ తెలియకుండా పోతున్నాయి. ఫలితంగా నేతల చర్యలకు జవాబుదారీతనం లేకుండా పోతోంది. సింగ్రనెల్లి అండ్ రిచర్డ్స్ హ్యూమన్ రైట్స్ డేటాబేస్ అందించిన వివరాల ప్రకారం, 50 అంతకన్నా ఎక్కువ అదృశ్యమైన కేసులు కలిగివున్న దేశాల సంఖ్య 2012లో 12గా వుండగా 2015నాటికి ఆ సంఖ్య 19కి పెరిగింది. 2017 సెప్టెంబరు నాటికి 91 దేశాల్లో 45,120 అదృశ్య కేసులున్నట్లు గుర్తించామని, ఈ సంఖ్య ఇంకా ఎక్కువే వుండవచ్చునని ఎన్‌ఫోర్స్‌డ్ ఆర్ ఇన్‌వలంటరీ డిజప్పియరెన్స్‌పై ఐక్యరాజ్య సమితి వర్కింగ్ గ్రూపు పేర్కొంది. 1980 నుండి ఈ వర్కింగ్ గ్రూపు ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తోంది. 1980కి ముందున్న అనేక కేసులు పరిష్కారం కాకుండానే వుండిపోయాయి. ఇలా బలవంతంగా, ఒత్తిడితో అదృశ్యమవుతున్న కేసులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. దాని కన్నా కలవరపరిచే అంశం మరొకటుందని మానవ హక్కుల జర్నల్ వ్యాసం పేర్కొంది. ప్రజల హక్కులు, స్వేచ్ఛ, భద్రతలకు హామి కల్పించే పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడికపై సంతకాలు చేసిన దేశాలు, సంతకాలు చేయని దేశాల కన్నా ఎక్కువగా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకూ అక్రమంగా, అన్యాయంగా తమ ప్రత్యర్థులను హత్య చేస్తూ వచ్చిన దేశాలు ఇప్పుడు బలవంతపు అదృశ్య, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నాయని ఆ వ్యాసం పేర్కొంది. ఘర్షణలు, యుద్ధాలు, అంతర్యుద్ధాలు జరుగుతున్న దేశాల్లో ఇటువంటి పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపింది. యుగోస్లో వియా, గ్వాటెమాలా, అర్జెంటైనా, క్రొయేషియా, కొసావో, బోస్నియా,హెర్జెగోవినా దేశాల్లో అదృశ్య మవడం చాలా సర్వసాధారణ చర్యగా మారిందని పేర్కొంది. ఇటువంటి వారికి సంబంధించి దాదాపు 26వేల మంది సాక్ష్యాధారాలను ఐక్యరాజ్య సమితికి చెందిన మిస్సింగ్ పర్సన్స్ కమిటీ సేకరించగలిగింది. అయితే నిర్దిష్ట సాక్ష్యాధారాలు కొరవడడంతో ఈ నేరాలకు ఆదేశించిన వారి వివరాలు వెలుగు చూడడం కష్టంగా మారిందని కమిటీ పేర్కొంది.

సంక్షిప్తం

'నమ్మ' మెట్రోలో 'ఈల'లకు స్వస్తి

బెంగళూరు : నో విజిల్ బ్లోవర్(ఈలలు ఊదొద్దు) విధానంతో బెంగుళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిఎంఆర్‌సిఎల్) ముందుకు వచ్చింది. నమ్మ మెట్రో ఫ్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రయాణీకులను రద్దీని దృష్టిలో పెట్టుకొని వారిని నియంత్రించడానికి విజిల్‌ను ఉపయోగిస్తుంటారు. ఎందుకు ఈ 'నో విజిల్ బ్లోవర్' విధానాన్ని ఉపయోగిస్తున్నారని భద్రతా సిబ్బందిని ప్రశ్నించగా, విజిల్ శబ్దం విసుగు తెప్పిస్తుందని పలువురు ప్రయాణీకులు ఫిర్యాదు చేశారని తెలిపారు.

అత్వాల్ ఆహ్వానాన్ని రద్దు చేసిన కెనడా

న్యూఢిల్లీ : ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గౌరవార్థం ఏర్పాటు చేసిన విందుకు ఖలిస్తాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్‌కు అందించిన ఆహ్వానాన్ని రద్దు చేసినట్లు ఇక్కడి కెనడా దౌత్యకార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. అత్వాల్‌కు పంపిన ఆహ్వానాన్ని రద్దు చేశామని, ప్రధాని భద్రతకు సంబంధించిన అంశాలపై తాము స్పందించ బోమని కెనడియన్ హై కమిషన్ తన ప్రకటనలో వివరించింది.

భారత్, కెనడా విదేశాంగ మంత్రుల చర్చలు



న్యూఢిల్లీ : భారత్, కెనడాలు శుక్రవారం ద్వైపాక్షిక సమావేశం జరగనున్న నేపథ్యంలో గురువారం ఇరు దేశాల విదేశాంగ మంత్రులు వ్యూహాత్మక చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సహకారం అవసరమైన పలు అంశాలను వారు చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సైబర్ భద్రత, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాల్లో సంబంధాలను బలోపేతం చేయడం, ఇతర సంబంధిత ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలను ఇరువురు నేతలు చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ట్వీట్ చేశారు.


పెరూలో ఘోర బస్సు ప్రమాదం

లిమా : పెరూలో బుధవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో కనీసం 44 మంది మరణించారని, మరో 24 మందికి పైగా గాయాల పాలయ్యారని అధికారులు చెప్పారు. పెరూలోని అరెకిపా ప్రాంతంలో ప్రయాణీకులతో వస్తున్న ఒక బస్సు రోడ్ పక్కకు జారి నదిలో పడినపుడు ఈ ప్రమాదం జరిగిందని వివరించారు. క్షతగాత్రుల్లో ముగ్గురు చిన్నారులతో సహా ఏడుగురి పరిస్థితి విషమంగా వుందని అధికారులు చెప్పారు. ఈ బస్సు రోడ్డుపై నుండి జారి నదిలో పడటానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నట్లు అధికారులుచెప్పారు. ఈ బస్సుకు పర్మిట్ లేదని రవాణా



ప్రమాదం పెరూలోని అరెకిపా ప్రాంతంలో ప్రమాదవశాత్తూ నదిలో పడిన బస్సు వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

ఉభయ కొరియాల మధ్య చర్చలు క్రమం సాగాలి : బాన్ కి మూన్



ఐక్యరాజ్య సమితి : దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ సూచించినట్లుగా ఉత్తర కొరియాతో చర్చలు జరపడంలో అమెరికా కీలక పాత్ర పోషించాలని ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి బాన్ కి మూన్ పేర్కొన్నారు. వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉభయ కొరియాల మధ్య మొదలైన చర్చల క్రమం సజీవంగా వుండాలని, శాంతి, సామరస్యత నెలకొనడానికి, అణు నిరాయుధీకరణకు దారి తీయాలని కోరారు. యుఎన్ చీఫ్‌గా పనిచేయడానికి ముందు బాన్ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిగా వున్నారు. ఉత్తర, దక్షిణ కొరియా అధికారుల మధ్య చర్చల క్రమం నిరంతరంగా కొనసాగడం వల్ల ప్రస్తుత సామరస్య వాతావరణం మరింత అభివృద్ధి చెందగలదని అన్నారు.

వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉత్తర కొరియా అధికారులతో చర్చలు జరపడానికి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ సంసిద్ధులయ్యారని, కానీ చివరి నిముషంలో కిమ్ ప్రభుత్వం చర్చలను రద్దు చేసిందని ట్రంప్ ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది.

సిరియాపై దాడులను ఖండించాలి

డమాస్కస్ : సిరియా రాజధాని దాని పరిసర ప్రాంతాల్లో తూర్పు ఘౌటా ప్రాంతానికి చెందిన తీవ్రవాద గ్రూపుల దాడులు పెరిగి పోవడాన్ని ఐక్యరాజ్య సమితి ఖండించాలని సిరియా ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి ఒక లేఖ రాసింది. డమాస్కస్‌లోను, పరిసర గ్రామీణ ప్రాంతాల్లోనూ గత కొద్ది గంటల వ్యవధిలో 40కి పైగా హోవిట్జర్ శతఘ్నులను తీవ్రవాదులు ప్రయోగించారని సిరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా, 29మంది గాయపడ్డారు. ఆస్తి నష్టం కూడా భారీగా సంభవించింది. గత ఏడు వారాల్లో 1500కి పైగా మోర్టార్లు, రాకెట్లు ప్రయోగించారని, వందలాది మరణాలు సంభవించాయని, వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలేనని ఆ లేఖ తెలిపింది. కొంతమంది పశ్చిమ దేశాల అధికారులు కూడా ఈ దాడుల్లో పాల్గొని నేరానికి ఒడిగట్టినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

టీచర్లకు ఆయుధాలివ్వాలి



ఫ్లోరిడా హైస్కూల్ జరిగిన కాల్పులపై విద్యార్థుల నిరసన ప్రదర్శన

ట్రంప్ సూచన
అమెరికా వ్యాప్తంగా విద్యార్థులు నిరసన ప్రదర్శనలు



తుపాకీ సంస్కృతిపై వైట్‌హౌస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ట్రంప్

వాషింగ్టన్ : భవిష్యత్తులో మూక్కుమడి కాల్పులను నిలువరించాలంటే టీచర్లకు ఆయుధాలు ఇవ్వాలని అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. ఫ్లోరిడా హైస్కూల్లో 17మంది హత్య జరిగిన నేపథ్యంలో ఆ కాల్పుల నుండి బయటపడిన వారితో వైట్‌హౌస్‌లో బుధవారం ట్రంప్ సమావేశం నిర్వహించారు. కాల్పులు జరిగిన రోజు పరిస్థితులను బాధితుల తల్లిదండ్రులు, వారి స్నేహితులు, ఈ కాల్పుల నుండి తృటిలో తప్పించుకున్న విద్యార్థుల నుండి విన్న ట్రంప్ దానిపై స్పందిస్తూ తుపాకీ యజమానులపై పటిష్టమైన నిఘా వుండేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో టీచర్ దగ్గర ఆయుధం వుంటే, వెంటనే చాలా వేగంగా స్పందించడానికి వీలు కలుగుతుందని ట్రంప్ ట్వీట్ చేశారు. 20శాతం మంది స్కూలు టీచర్లకు రహస్యంగా ఆయుధాలను తీసుకెళ్ళడ మెలా అని శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశాన్ని టివిలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. కాగా మరోవైపు కఠినమైన తుపాకీ చట్టాలు తీసుకురావాలని కోరుతూ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. "ఇటువంటి సంఘటనలు పునరావృతం కారాదు, ఈ తరహా హింసను ఆపడానికి చర్యలు తీసుకోవాలి." అని నినాదాలు చేశారు. పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని ఆ సమావేశంలో వెళ్ళగక్కారు. విమానాశ్రయాలను, స్టేడియం లను, ఎంబసీలను మనం కాపాడుకో గలుగుతున్నాం. కానీ చిన్నారులను భావి పౌరులుగా తీర్చిదిద్దే విద్యాలయాల్లో మనం వారిని కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రులు వ్యాఖ్యానించారు. ఒక వాటర్ బాటిల్‌ను విమానంలోకి తీసుకెళ్ళలేం గానీ స్కూల్లోకి ఒక మృగం నడిచి వస్తుంటే మాత్రం అడ్డుకునే పరిస్థితి లేదని వాపోయారు.

కాలేజీలో తీవ్రవాదుల దాడితో 46 మంది విద్యార్థినుల అదృశ్యం

అబుజా : ఈ వారం ప్రారంభంలో ఈశాన్య యోబె రాష్ట్రంలో బాలికల కళాశాలలో బోకో హారం తీవ్రవాద సంస్థ దాడి జరిపిన తర్వాత 46మంది విద్యార్థులు అదృశ్యమయ్యారని నైజీరియా ప్రభుత్వం బుధవారం తెలిపింది. సోమవారం రాత్రి దాడి జరిగిన తర్వాత గర్ల్స్ టెక్నికల్ కాలేజీలో విద్యార్థుల సంఖ్యను అధికారులు లెక్కించారు. 94మంది విద్యార్థుల ఆచూకీ తెలియరాలేదని వెల్లడైంది. అయితే, మంగళవారం పొద్దు పోయిన తర్వాత 28మంది విద్యార్థినులు తిరిగి వచ్చారని, బుధవారం తెల్లవారు జామున మరో 20మంది వచ్చారని, ఇంకా మిగిలిన 46మంది ఆచూకీ తెలియరావాల్సి వుందని తెలిపారు. తీవ్రవాదులు కాలేజీ ఆవరణపై దాడి చేయడంతో వీరందరూ అక్కడ నుండి పారిపోయారు. మిగిలినవారు కూడా త్వరలో తిరిగి వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. బోకోహారం వారిని కిడ్నాప్ చేసి వుంటుందన్న భయాలను రాష్ట్ర పోలీసు చీఫ్ తోసిపుచ్చారు.

మాదేశాధికారాన్ని ప్రశ్నిస్తే సహించం : కంబోడియా ప్రధాని హన్‌సెన్

నాంఫెన్ : దేశీయంగా తాము తీసుకుం టున్న రాజకీయ అణచివేత చర్యపై తాను ఒత్తిడిని ఎదుర్కొంటే వచ్చే నెల్లో సిడ్నీలో జరగనున్న ప్రాంతీయ శిఖరాగ్ర సదస్సులో సంయుక్త ప్రకటన విడుదలవకుండా నిలువరిస్తానని, ఇది ఆస్ట్రేలియాకు సిగ్గుచేటైన విషయమని కంబోడియా ప్రధాని హన్‌సెన్ హెచ్చరించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీని రద్దు చేయడం, ఇండిపెండెంట్ వార్తా కేంద్రాలను మూసివేయడం ద్వారా ఇటీవలి కాలంలో హన్‌సెన్ కంబోడియాలో ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ చర్యలు తీసుకున్నారు. తమ దేశ రాజకీయాలపై ఎవరు, ఎలాంటి ఒత్తిడి తీసుకువచ్చినా సహించేది లేదని స్పష్టం చేశారు. మార్చిలో ఆస్ట్రేలియా ఆతిథ్యమిచ్చే ఆసియాన్ సమావేశానికి హాజరైనపుడు తమ దేశ రాజకీయాల గురించి ఎవరూ మాట్లాడ రాదని చెప్పారు. ఆస్ట్రేలియా అటువంటి సాహసం చేయబోదని భావిస్తున్నానన్నారు.

జుమా నిష్క్రమణతో దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన గుప్తా సామ్రాజ్యం



అతుల, రాజేష్, అజయ్‌గుప్తాలు

జోహన్నెస్‌బర్గ్: అధికార పక్ష దోస్తీతో దక్షిణాఫ్రికాలో ఇప్పటి వరకూ ఓ వెలుగు వెలిగిన భారత సంతతి వ్యాపార వేత్తలు గుప్తాల వ్యాపార సామ్రాజ్యం ఇప్పుడు అధ్యక్షుడు జాకబ్ జుమా నిష్క్రమణతో కుప్పకూలిపోయిందని పరిశీలకులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా దక్షిణా ఫ్రికాలో ప్రముఖ వ్యాపార వేత్తలుగా వెలుగొందుతున్న అజయ్, అతుల, రాజేష్‌గుప్తా అధ్యక్షుడు జాకబ్‌జుమాకు అత్యంత సన్నిహితులుగా వుండటంతో వారి ప్రత్యేక విమానం అత్యంత పటిష్టమైన భద్రత వున్న సైనిక స్థావరంలో దిగేది. అక్కడే ప్రైవేటు వివాహ వేడుకలు కూడా జరుపుకునే వారు. అంతేకాదు కేబినెట్ నియామకాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన గుప్తా సోదరులు లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరిపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పటం తప్ప ప్రభుత్వ నిఘా, దర్యాప్తు సంస్థలేవీ వీరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించవు. అయితే ఇప్పుడు ఈ పరిస్థితి అంతా మారిపోయింది. పదవి నుండి తప్పుకుని తీరాల్సిందేనంటూ ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ ఈ నెల 14న జారీ చేసిన ఆదేశం మేరకు మొదట మొండికేసినా, తీవ్రమైన వత్తిడి రావటంతో అధ్యక్షుడు జాకబ్ జుమా తన పదవికి రాజీ నామా చేయక తప్పలేదు. అదే రోజు పోలీసు అధికారులు జోహన్నెస్‌బర్గ్ శివార్లలో వున్న గుప్తాల ఎస్టేట్ 'శాక్సన్ వల్డ్' పై దాడులు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వారి వ్యాపార సంస్థలకు చెందిన కొందరు ఉన్నతాధికారులను అరెస్ట్ చేయ టంతో పాటు వారి పెద్ద సోదరుడు అజయ్‌ని నేరస్తుడిగా ప్రకటించారు. ఈ రెండు ఘటనలకు, అవి జరిగిన సమ యానికి ఏ మాత్రం పొంతన కుదరటం లేదని స్టాలిన్‌బోష్ యూనివర్శిటీకి చెందిన ప్రొ.మార్క్ స్విల్లింగ్ చెబుతున్నారు. జుమా, గుప్తాలకు వ్యతిరేకంగా గత ఏడాది జరిగినట్లు చెబుతున్న 'నిశ్శబ్ద కుట్ర'పై ఆయన అధ్యయనం చేశారు. జుమా-గుప్తా నెట్‌వర్క్‌పై బహుళంచెల దాడి జరిగిందని ఆయన అంటున్నారు. ఇందులో ఒకటి జుమాను పదవి నుండి తప్పించేందుకు ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ప్రారంభమైన రాజకీయ పరమైన దాడి అని ఆయన గుర్తు చేస్తున్నారు. గుప్తాలపై నేరనిరోధక వ్యవస్థ తన చర్యలు ప్రారంభించటం మరో దాడి అని ఆయన వివరించారు.

మొదటి పేజీ తరువాయి

మాట తప్పొద్దు

శాంతి భద్రతల విఘాతం కలుగకుండా ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని చెప్పారు.

ఫ్రేమ్‌వర్కు ఇన్‌స్టాలేషన్‌కు శంకుస్థాపన...

అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలోని యర్రమంచి వద్ద ఏర్పాటు కాబోతున్న 'కియో' కార్ల తయారీ పరిశ్రమకు సంబంధించి 'ఫ్రేమ్ ఇన్‌స్టాలేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్లాంటులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కియో పరిశ్రమ అధ్యక్షులు, సిఇఒ హాన్ హూ పార్కుతో కలసి పాల్గొన్నారు. ఇద్దరూ ఇనుప భీమ్‌పై సంతకాలు చేసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కియో కార్ల పరిశ్రమ రాష్ట్రానికి రావడం ఎంతో గర్వకారణమన్నారు. కరువు ప్రాంతమైన ఇక్కడ ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు ఇది ఎంతగానో దోహదం చేస్తాయని వివరించారు. సిఇఒ హాన్ హూ పార్కు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగా ఉందని చెప్పారు.

'తీవ్ర అవినీతి' దేశాల జాబితాలో భారత్

ఉటంకిస్తూ ట్రాన్స్‌పరెన్సీ సంస్థ వెల్లడించింది. తాజా ర్యాంకింగ్‌లలో న్యూజిలాండ్, డెన్మార్క్ వంటి దేశాలకు 88, 89 ర్యాంకులు లభించగా సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా వంటి దేశాలకు వరుసగా 14,12,9వ ర్యాంకులు దక్కాయి. ఈ జాబితాలో చైనా 41వ ర్యాంకుతో 77వ స్థానంలో నిలవగా, 37 పాయింట్ల స్కోరుతో బ్రెజిల్ 96వ స్థానంలోనూ, 29 పాయింట్ల స్కోరుతో రష్యా 135వ స్థానంలోనూ నిలిచాయి.

బిజెపిలో అసహనం

ప్రమేయం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే రోజు కాకినాడలో టివి 9 నిర్వహించిన చర్చాగోష్టిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వివిధ ప్రాంతాల్లో సాక్షి, ఎన్‌టివి నిర్వహిస్తున్న చర్చా గోష్టులలో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అనంతపురంలో రెండు రోజులు క్రితం ఒక ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ అడ్డుకున్నారు. బిజెపి కార్యకర్తలు ఒక వ్యూహం ప్రకారం చేస్తున్న ఈ దాడులతో బహిరంగ చర్చలు నిర్వహించడానికి, వాటికి రాజకీయ పార్టీలను ఆహ్వానించడానికి మీడియా సంస్థలు తటపటాయించే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాలో గురువారం నిర్వహించిన చర్చ కార్యక్రమానికి ఒక టివి ఛానల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను, కార్యకర్తలను అనుమతించలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రత్యేకహోదా అంశాలను వక్తలు ఏ మాత్రం ప్రస్తావించినా నినాదాలతోనూ, అరుపులతోనూ అడ్డుకునే ప్రయత్నాన్ని బిజెపి కార్యకర్తలు ఒక వ్యూహం ప్రకారమే చేస్తున్నారన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది.

జగన్ కేసులో మోడీకి నోటీసులు!

రెండో సారి రూ.14కోట్లు, మూడో సారి రూ.99కోట్ల పెట్టుబడులు పెట్టింది. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేశాక..అప్పటి నుంచి ఇందూ టెక్ జోన్ పనులు నిలిచిపోయాయి. దీంతో పెట్టుబడులు పెట్టిన తాము మోసపోయామంటూ 50 మిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇప్పించాలని మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.ఇందులో భాగంగానే మారిషస్ ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీకి కోర్టు నోటీసులు పంపినట్టు సమాచారం.

కారులో కమల్-రజనీ రహస్య భేటీ

ఒక కారులో ఈ సమావేశం జరిగినట్లు తెలిపారు. కమల్ హాసన్ వ్యాఖ్యాతగా ఉన్న బిగ్ బాస్ కార్యక్రమం గత ఏడాది ప్రసారమయింది. రజనీకాంత్ కూడా కాలా సినిమా కోసం అదే ప్రదేశంలో షూటింగ్‌లో ఉన్నారని, ఆ సమయంలో ఇద్దరం సమావేశమవుదామని తానే ప్రతిపాదన తీసుకుని వచ్చినట్లు కమల్ హాసన్ తెలిపారు. 'రహస్యంగా సమావేశామవుదామని తాను కోరానని, ఇద్దరం కారులో కూర్చుని చర్చించుకున్నామని, తాను తీసుకున్న నిర్ణయం గురించి రజనీకి చెప్పానని రజనీకి చెప్పానని తెలిపారు. రాజకీయాల్లో ప్రవేశించాలనే తన నిర్ణయాన్ని ఇతరులు తెలుసుకోకముందే రజనీకాంత్‌కు చెప్పాలని తాను కోరుకున్నానని కమల్ హాసన్ తెలిపారు. తన నిర్ణయంపై రజనీకాంత్ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.

'విద్యుత్తు' సమ్మెకు సర్కారుదే బాధ్యత

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఇటీవలి చర్చల్లో సమస్య పరిష్కారానికి గడువు ప్రకటించాలని మంత్రిని కోరితే, తగిన హామీ ఇవ్వలేకపోయారని, దీంతో ప్రభుత్వ తాత్సార వైఖరిని స్పష్టమవుతోందన్నారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరానికి గురువారం హాజరైన కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమ్మెకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల పూర్తి మద్దతు ప్రకటించారు. థర్డ్ పార్టీ విధానం రద్దు, దశల వారీగా కార్మికుల క్రమబద్ధీకరణ, పీసురేట్ విధానం రద్దు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే నాలుగు ప్రధాన డిమాండ్లను పరిష్కరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాన్ని

ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ కార్మికులను దశలవారీ క్రమబద్ధీకరణ చేస్తామని టిడిపి ఎన్నికల మ్యానిపెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా అమలు చేయలేదన్నారు. వైఎస్‌ఆర్ హయాంలో 7,500 మంది కార్మికులను క్రమబద్ధీకరించారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వస్తే విద్యుత్తు కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనానికి 50 శాతం పెంచి, నేరుగా కార్మికులకే చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోతే విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమ్మెను రాష్ట్ర కార్మికవర్గం సమ్మెగా మారుస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ గఫూర్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఉధృతంగా సాగుతోందని, యాజమాన్యం ఎత్తులను తిప్పికొట్టాలని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీనియర్ సిఎంను అని చెప్పుకునే చంద్రబాబు తెలంగాణ సిఎం కెసిఆర్ అన్ని వర్గాల కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుంటే ఇక్కడ ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.వి నర్సింహారావు, రైల్వే కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నర్సింహారావు తదితరులు ప్రసంగించారు.

మరింత ఉధృతానికి కార్యక్రమాలు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేదీ నుంచి చేపట్టిన సమ్మెను మరింత ఉధృతం చేయాలని ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని కమిటీ సెక్రెటరీ జనరల్ ఎం.బాలకాశి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 23న విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలతో జిల్లా కేంద్రాల్లో మహాప్రదర్శన, 24న కార్మికులు, ప్రజాసంఘాలతో కలిసి మానవ హారాలు నిర్వహించడం, 25న అన్ని జిల్లాల్లో నిరవధిక దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. ఇదిలావుండగా సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్లు, వర్కర్స్ జెఎసి మద్దతు తెలిపిందని జెఎసి చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎం.బాలకాశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంఘాలన్నీ ఆందోళనల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు అంతరాయం వస్తే ఎస్ఇలదే బాధ్యత: సిఎండి విజయానంద్

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, అత్యవసర సేవలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సరఫరాలో సమస్యలు తలెత్తితే సంబంధిత ఎస్ఇలదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో గురువారం ఆయన పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్‌ల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచార సేకరణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సబ్‌స్టేషన్‌ల రక్షణకు పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. సమ్మెలో పాల్గొంటున్న సిబ్బంది స్థానంలో కొత్తవారిని నియమించుకోవాలన్నారు.

విధులకు హాజరవుతున్న సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా కార్మికులు సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని కోరారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమీక్షలో జెఎండిలు దినేష్ పరుచూరి, ఉమాపతి, పిడి సుబ్రమహ్మణ్యం, అదనపు కార్యదర్శి సత్యవాణి, సిఇలు పాల్గొన్నారు.

చర్చా వేదికలపై దాడులు సరికాదు..

- **గుంటూరు రౌండ్‌టేబుల్‌కు వచ్చేందుకు యత్నిస్తా ..**
- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో జనసేన నేత పవన్‌కల్యాణ్ భేటీ**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలు తెలుపుకునే హక్కు ఉందని, అంతమాత్రాన దాడులు చేయడం సరికాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో పలు టీవీ ఛానళ్లు ఏర్పాటు చేస్తున్న చర్చా వేదికల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం మంచి పరిణామం కాదన్నారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణతో పవన్ సమావేశమయ్యారు. విద్యుత్ ఒప్పంద ఉద్యోగులు, అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలతో పాటు హోదా కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రానికి హోదా కోసం టీవీ ఛానళ్లు ఏర్పాటు చేస్తున్న చర్చా వేదికల్లో ఉద్రిక్త పరిస్థితులపై సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. సమావేశం అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ పరిణామం మంచిది కాదని, దీన్ని ప్రతి ఒక్కరు ఖండిచాలని పిలుపునిచ్చారు. తనపై రకరకాలుగా మాట్లాడుతున్నా వ్యక్తిగా భరిస్తున్నానని, పార్లమెంటులో ఆమోదించిన విభజన బిల్లుపై పూర్తి సమాచారం తెలుసుకునే హక్కు ప్రజలకుందని అన్నారు. ప్రజలు సంపూర్ణంగా, స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకొనేందుకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మార్చి 1న గుంటూరులో హెూదా, విభజన హామీల అమలుపై ఏర్పాటయ్యే రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు అయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు. జెఎఫ్‌సి కొనసాగింపుగానే పవన్‌తో భేటీ అయినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. విద్యుత్ ఒప్పంద ఉద్యోగుల సమస్యలను, అలాగే అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ముఖ్యమంత్రి చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. హోదా, విభజన హామీల అమలుపై మార్చి 1న గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సుకు అన్ని పార్టీల మద్దతు కోరుతున్నామన్నారు. ప్రత్యేక హోదా అంశంపై టీవీ చర్చా వేదికల్లో దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చర్చలపై దాడులు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు అంశాలపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడానికి వివిధ మీడియా, ఇతర సంస్థలు నిర్వహిస్తున్న చర్చలను అడ్డుకోవడానికి బిజెపి చేస్తున్న చర్యలను సిపిఎం ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు విడుదల చేసిన ఒక ప్రకటనలో చర్చలను అడ్డుకోవడం సరికాదని, ఇది పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛను భంగపరచడమేనని పేర్కొన్నారు. ఈ తరహా చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతంగా మారుతాయని అన్నారు.

హోంగార్డుల జీతాల పెంపుపై సర్కారు తాత్సార ధోరణి



- **రూ.వంద పెంపంటూ లీకులు**
- **కమిటీలంటూ అంటూ కాలయాపన**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసులకు దీటుగా పని చేస్తారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తూ అధికారులకు సలాం కొడతారు. ఆర్డర్లీకి కూడా వెనకాడరు. అయినా హోంగార్డులకు రోజు గడవడమే కష్టంగా మారింది. ముఖ్యమంత్రి నుంచి స్థానిక ఎమ్మెల్యే వరకు తమ సమస్యలను తీసుకెళ్లినా రాష్ట్ర విభజన తరువాత కూడా వారికి న్యాయం ఎండమావిగానే మిగిలింది. తాజాగా హోంగార్డుల జీతాలను పెంచుతామంటూ ప్రకటించినా ఎంత పెంచేది ప్రభుత్వం ఇంత వరకు స్పష్టం చేయలేదు. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 15,488 హోంగార్డుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. పది రోజుల క్రితం చివరి ప్రీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా హోం గార్డుల జీతాల పెంపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రూ.100 కంటే ఎక్కువ పెంచలేమని కొందరు ప్రభుత్వ పెద్దలు పోలీస్ అధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. జీతం ఎంత పెంచాలనే దానిపై ఒక స్పష్టతకు రావాలని ఆర్థిక మంత్రి యనమల పోలీస్ అధికారులకు సూచించారు. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశం సందర్భంగా హోంగార్డుల పెంపుపై సబ్‌కమిటీ వేస్తున్నట్లు మంత్రి కాల్వ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.

చెప్పిందే చేయమంటున్నాం..
ఏపి హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

తామేమీ అదనపు ప్రయోజనాలను ఆశించడంలేదని, అసెంబ్లీ సాక్షిగా హోంమంత్రి చిన్నరాజప్ప చెప్పినట్లు బేసిక్ పే, డిఎ, వాషింగ్ ఎలవెన్స్ మాత్రమే అడుగుతున్నామని హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. సామాన్య ప్రజలు చనిపోతేనే ప్రభుత్వం లక్షల రూపాయిలు నష్ట పరిహారం ఇస్తుందని ఎండనకా, వాననకా ఎంతో కష్టపడి విధులు నిర్వహించే తాము సహజంగా మరణిస్తే ప్రభుత్వం నుంచి రూపాయి కూడా నష్ట పరిహారం దక్కదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి రోజుకు రూ.400 ఇస్తున్నారని ఈ పరిస్థితుల్లో కేవలం మరో రూ.100 పెంచితే ఎలా బతకాలని, శ్రమకు తగ్గ ఫలితమెక్కడుందని ప్రశ్నించారు. పదవీ విరమణ తరువాత కనీసం గ్రాడ్యుటీ కూడా రాదని నిర్వేదంగా చెప్పారు. ఎటువంటి హెల్త్ కార్డులూ తమకు లేవన్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరణ అవుతాయనే ఆశతో గత 25 సంవత్సరాలుగా విధుల్లో ఉన్న హోంగార్డులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని మానవతా ధృక్పథంతో తమ గురించి ఆలోచించాలని కోరారు.



ఇరు నిర్మాతలైన దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసులతో సమావేశమైన దిల్‌రాజు, కె.ఎల్. నారాయణ, నాగబాబు

'ఆ' నిర్మాతల మధ్య ఒప్పందం

ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను'.. మే 4న 'నా పేరు సూర్య..'

ఏప్రిల్ 26నే 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' విడుదలవుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖులు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు సమక్షంలో ఈ రెండు చిత్రాల నిర్మాతలు ప్రత్యక్షంగా సమావేశం అయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒక రోజు విడుదలవడం ఇండస్ట్రీకి శ్రేయస్కరం కాదని భావించిన వీరు ఓ అంగీకారానికి వచ్చారు.

ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీదర్, బన్నీ వాసు మాట్లాడుతూ... "ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఉండాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చెయ్యడానికి నిర్ణయించాం. ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సపోర్ట్ చేసిన మా హీరోలకు, దర్శకులకు, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాం" అన్నారు.

దిల్‌రాజు. డా.కె.ఎల్. నారాయణ, నాగబాబుగార్లు మాట్లాడుతూ... సంక్రాంతి సీజన్‌ని మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చెయ్యడం వలన పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' నిర్మాతల మధ్య అంగీకారం కుదరడం ఓ శుభపరిణామంగా భావిస్తున్నాం" అన్నారు.



ముహూర్తపుషాట్‌కు స్విచ్చాన్ చేస్తున్న ఎంఎల్ఎ. శ్రీనివాసరావు, ఛోటాకెనాయుడు, చిత్ర దర్శకుడు శ్రీనివాస్; హీరోపై క్లాప్ కొడుతున్న వినాయక్

బెల్లంకొండ శ్రీనివాస్ చిత్రం ప్రారంభం

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నూతన దర్శకుడు శ్రీనివాస్ దర్శకత్వంలో రోమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న చిత్ర ప్రారంభోత్సవం గురువారం హైద్రాబాద్ రామానాయుడు స్టూడియోలో వైభవంగా జరిగింది. వంశధార క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నవీన్ శొంటీనేని (నాని) నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్ కొట్టగా తెలంగాణా ఎఫ్.డి.సి ఛైర్మన్ రామ్మోహన్రావు గౌరవ దర్శకత్వం వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఎం.ఎల్ఎ.జీవన్ రెడ్డి, మహేందర్ రెడ్డి కలిసి స్క్రిప్ట్‌ను చిత్ర బందానికి అందించారు.

నిర్మాత నవీన్ శొంటినేని మాట్లాడుతూ.. "మా బ్యానర్ నుంచి వస్తున్న మొదటి సినిమా ఇది. వినూత్నంగా ఉంటుంది. చక్కటి పాయింట్‌తో దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. మార్చి 2 నుంచి రెగ్యుల్ షూటింగ్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని ఎప్పట్నుంచో అనుకొంటున్నాను. ఇన్నాళ్లకు శ్రీనివాస్ చెప్పిన కథ నచ్చడంతో సెట్‌పైకి వచ్చింది. చిత్రసీమలో ఎవ్వరూ చూడని సరికొత్త పాయింట్ ఇందులో వుంది. ఛోటా కె.నాయుడుతో కలిసి 'అల్లుడు శీను'కి పని చేశాను. మళ్ళీ ఇన్నాళ్ల తర్వాత ఈ సినిమాకి పని చేయడం ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడు తమన్‌తో తొలిసారిగా పని చేయనున్నాను" అన్నారు.

చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 2వ తారీఖు నుంచి మొదలవ్వనుంది. ఈ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ సరసన ఇద్దరు నాయికలు నటించనున్నారు. వాళ్లెవరన్నది త్వరలోనే తెలియజేస్తాం" అన్నారు. కెమెరామెన్ ఛోటా కె.నాయుడు మాట్లాడుతూ.. "దర్శకుడు శ్రీనివాస్ నాకు చాలా కాలంగా తెలుసు. మంచి కథ, కథను మించిన చక్కటి స్క్రీన్ ప్లే వినిపించి మమ్మల్ని ఆశ్చర్యపరిచాడు. నిర్మాత భారీ బడ్జెట్‌లో సినిమా తీయమని మాకు పర్మిషన్ ఇచ్చిన ప్పటికీ.. కథకి అవసరమైనంతవరకే ఖర్చు చేసి ఆయనకి మంచి ఔట్ పుట్ ఇవ్వడం కష్టపడతాం. నవీన్ భవిష్యత్ లో మరిన్ని మంచి సినిమాలు తీయాలని ఆశిస్తున్నాను" అన్నారు.

హరీష్ శంకర్ దర్శకత్వంలో 'సిటీ మార్'



హరీష్ శంకర్

'గబ్బర్ సింగ్'తో విజయాన్ని సొంతం చేసుకున్న హరీష్ శంకర్ మరో ప్రయత్నాన్ని చేస్తున్నాడు. 'దువ్వాడ జగన్నాథమ్'లోని 'సీటీ మార్ సీటీ మార్' అనే సాంగ్ ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఇప్పుడు దాన్ని టైటిల్‌గా చేసుకుని సినిమా రాబోతోంది. హరీష్ శంకర్ ప్రస్తుతం దిల్‌రాజు బ్యానర్‌లో 'దాగుడుమూతలు' అనే సినిమాను రూపొందించే పనిలో భాగంగా స్క్రిప్ట్ వర్క్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తికాగానే 'జవాన్' చిత్రాన్ని నిర్మించిన అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కొమ్మలపాటి కష్ణ నిర్మాణంలో ఈ సినిమాను డైరెక్ట్ చేస్తారు. ప్రముఖ కథానాయకుడు ఈ సినిమాలో హీరోగా నటించనున్నారు. త్వరలోనే చిత్ర యూనిట్ పూర్తి వివరాలను తెలియజేస్తుంది.




శివ తాండేల్, నేహా దేశ్ పాండే

'వాడేనా' గీతావిష్కరణ

శివ తాండేల్, నేహా దేశ్ పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'వాడేనా'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో తెరక్కుతున్న ఈ చిత్రాన్ని మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తునారు. మ్యాంగో మ్యూజిక్ ద్వారా మార్కెట్‌లో లభ్యంకానున్న ఈ చిత్రం గీతావిష్కరణ బుధవారం సాయంత్రం ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగింది. దర్శకనిర్మాత ఎన్.శంకర్ సిడిని విడుదల చేయగా మరో నిర్మాత రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. "ట్రైలర్, పాటలు, రీరికార్డింగ్ బాగున్నాయి. టైటిల్‌లో ఆసక్తి ఉంటే సినిమా పై మరింత ఆసక్తి పెరుగుతుంది. అదే సర్ప్రైజ్ ఎలిమెంట్ టైటిల్‌లో ఉందని భావిస్తున్నా. మనం తరచుగా వాడే పదమే 'వాడేనా' క్యాచీగా ఉండే టైటిల్ కనుక తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నా" ననిఎన్.శంకర్ అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ.. "సైలెంట్‌గా వచ్చి పెద్ద హిట్ కొట్టే సినిమా అవుతుందని భావిస్తున్నా. ఈ సినిమా చిత్ర దర్శకనిర్మాతలకు మంచి పేరు తీసుకురావాలని కోరుకొంటున్నాను" అన్నారు. నిర్మాతల్లో ఒకరైన ధవ్ మాట్లాడుతూ.. "పాటల విషయంలో చాలా సంతప్తితో ఉన్నాను. ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుందని భావిస్తున్నామని అన్నారు. హీరోయిన్ నేహా దేశపాండే మాట్లాడుతూ.. "అడ్వెంచర్, ట్రెక్కింగ్ లాంటివి ఈ సినిమాలో చేశాం. సినిమా చాలా బాగా వచ్చిందని అన్నారు. దర్శకుడు సాయిసునీల్ నిమ్మల మాట్లాడుతూ.. 'పెళ్లిచూపులు' సినిమాను 22 సార్లు చూసి ఎంతో నేర్చుకున్నా. సినిమా సెకెండ్ హాఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సినిమాకు నేను దర్శకత్వంమే కాక నాలుగు పాటలు రాశాను. కొరియోగ్రఫీ కూడా చేశా. చాలా సినిమాలు చూసి, చాలా మందిని స్ఫూర్తిగా చేసుకొని సినిమా చేయడం జరిగింది. మా 'వాడేనా' మంచి విషయం ఉన్న సినిమాగా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలను" అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా '47డేస్'

సత్యదేవ్, పూజా ఝువేరీ, రోషిణి ప్రకాష్ హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం '47డేస్'. 'ద మిస్టరీ అన్ ఫోల్డ్స్' అనేది ఉపశీర్షిక. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుపుకుంటోంది. ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర ఓవర్సీస్ రైట్స్ అమ్ముడయ్యాయి.. త్రిశూల్ ఫిలిమ్స్ సంస్థ ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో విడుదల చేయబోతోంది. ఈ మధ్య వస్తోన్న థ్రిల్లర్ మూవీస్ మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. అందుకే ఈ మూవీ అవుట్ పుట్ తెలిసిన త్రిశూల్ సినిమాస్ ఈ సినిమా హక్కులు దక్కించుకుంది. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంగావస్తోన్న ఈ చిత్రానికి రఘు కుంచె సంగీతం అందిస్తున్నారు. ఇటీవలే పూరీ జగన్నాథ్ రిలీజ్ చేసిన "క్యా కరూన్" అనే పాటకు ఆదరణ వచ్చింది. టైటిల్ కార్డ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై దబ్బార శశిభూషణ్ నాయుడు, రఘు కుంచె, శ్రీధర్ మక్కువ, విజయ్ శంకర్ డొంకాడ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేసి వేసవిలో సినిమాను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెబుతున్నారు.



సత్యదేవ్, పూజా ఝువేరి



సుధీర్‌బాబు, అదితిరావు

సుధీర్ బాబు 'సమ్మోహనం'

సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ జంటగా మోహనకష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తోన్న చిత్రానికి 'సమ్మోహనం' అనే పేరును ఖరారు చేశారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ... సమ్మోహనం అంటే మంత్రముగ్ధుల్ని చేసే ఒక అందమైన ఆకర్షణ. ఒక మ్యాజికల్ ఎట్రాక్షన్. మా చిత్రంలో హీరో హీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమకథా చిత్రంగా ఉంటూనే ఆద్యంతం హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలు, ఉద్వేగ భరిత సన్నివేశాల సమాహారంగా తెరకెక్కుతోందని అన్నారు.

చిత్ర నిర్మాత తెలుపుతూ... కథకు సరిపడేలా 'సమ్మోహనం' టైటిల్‌ని ఖరారు చేశాం. ఇప్పటి వరకూ మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఈ నెల 22 నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. దాంతో 80 శాతం షూటింగ్ పూర్తవుతుంది. మార్చి 3వ వారం నుంచి ఏప్రిల్ 3 వరకూ హిమాచల్‌ప్రదేశ్, ముంబైలో షూటింగ్ చేస్తాం. 'పెళ్లిచూపులు' ఫేమ్ వివేక్ సాగర్ మంచి సంగీతాన్నిచ్చారు. పీజీ విందా కెమెరా సినిమాకు హైలైట్ అవుతుంది. ఇది ఫీల్ గుడ్ ఫిల్మ్. ప్రేమ, వినోదం ప్రధానాకర్షణలుగా నిలుస్తాయి. పూర్తి స్థాయి టెక్నికల్ వేల్యూస్‌తో తెరకెక్కిస్తున్నాం. మే మూడో వారంలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు.

అందుకే నెగిటివ్ పాత్రల్ని పక్కనపెట్టా : శ్రీకాంత్

సీనియర్ హీరో శ్రీకాంత్ మరో సినిమాతో సిద్ధమయ్యాడు. తన కెరీర్‌లోనే తొలిసారి హారర్, కామెడీ సబ్జెక్ట్‌తో 'రా..రా' అనే సినిమా చేశాడు. శుక్రవారమే థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమాలో చాలా ప్రత్యేకతలున్నాయంటున్నాడు శ్రీకాంత్. అంతేకాదు.. ఈ సినిమాకు దర్శకుడు లేడు. దర్శకుడు లేకుండా సినిమా ఎలా వచ్చింది..? ఆ వివరాలన్నీ మనతో పంచుకున్నాడు శ్రీకాంత్.

◆ ఇది నా 125వ సినిమా అనుకుంటా మొదటిసారి నా కెరీర్ లో హారర్ కామెడీ సబ్జెక్ట్ చేశాను. నాకు చాలా కొత్తగా అనిపించింది. సినిమా కూడా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది. హారర్ సినిమాలు చాలా వచ్చాయి. ప్రస్తుతం అదే ట్రెండ్ నడుస్తోంది. ఆ విషయాలన్నీ నాకు తెలుసు. కానీ హారర్‌లోనే ఇదొక కొత్త సబ్జెక్ట్. నేను ఈ కథ ఒప్పుకోవడానికి కారణమూ అదే. ఇందులో దెయ్యాలు మనుషులకి భయపడతాయ్. అలాగే వాటికి మనుషులకి మధ్య చిన్న సెంటిమెంట్ కూడా ఉంది.

◆ ఇందులో నేను సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తాను. హిట్ కోసం హారర్ సినిమా చేయాలనుకుని చివరికి దెయ్యాలతోనే సినిమా చేస్తాను. దెయ్యంతో ప్రేమలో కూడా పడతాను. చివరికి ఏం జరిగిందనేది తెరపై చూడాల్సిందే.



శ్రీకాంత్

◆ మా సినిమాకి దర్శకుడు లేడు. సినిమా మధ్యలో నిర్మాతకు, దర్శకుడికి పడలేదు. చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి. కాంప్రమైజ్ చేయడానికి ప్రయత్నించాను కానీ కుదర్లేదు. దాంతో దర్శకుడు తప్పుకున్నాడు. నేను ఎప్పుడూ ఇలాంటి విషయాల్లో నిర్మాతనే సపోర్ట్ చేస్తాను. ఎందుకంటే కోట్లు పెట్టి సినిమాలు తీసే నిర్మాత కంటే నాకెవరూ ఎక్కువ కాదు. ఇక దర్శకుడి విషయానికొస్తే కథ అతడిది కాదు కాబట్టి వేరే దర్శకుడ్ని పెట్టి తీశాం. అతని పేరు మాత్రం చెప్పను.

◆ 'యుద్ధం శరణం' సినిమాలో విలన్‌గా నటించాను. నా క్యారెక్టర్‌కు మంచి పేరు వచ్చింది. ఆ తర్వాత విలన్ రోల్స్ కూడా వచ్చాయి. కానీ దేన్నీ ఒప్పుకోలేదు. హీరోగా చేతిలో 3 సినిమాలున్నప్పుడు, సేమ్ టైం విలన్‌గా చేయడం మంచిది కాదనిపించింది. అందుకే నెగెటివ్ పాత్రల్ని పక్కనపెట్టాను. కొన్నాళ్ల ఆగి మళ్లీ చేస్తాను.

◆ 'ఆపరేషన్ దుర్యోధన' కాన్సెప్ట్‌కు దగ్గరగా 'ఆపరేషన్ 2019' అనే సినిమా చేస్తున్నాం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సినిమా ఉంటుంది. సినిమా మొత్తం పొలిటికల్ జానరే. నాయకులు ప్రజల్ని మోసం చేస్తున్నారా లేకపోతే ప్రజలే నాయకుల్ని మోసగిస్తున్నారా అనేది అందులో చూపిస్తాం. సినిమా చాలా కొత్తగా ఉంటుందని మాత్రం చెప్పగలను.

◆ దిల్ రాజు తీయబోతున్న 'శ్రీనివాస కల్యాణం' సినిమాలో నేను కూడా ఉన్నానని, ఓ కీలక పాత్ర కోసం నన్ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. అవి నా చెవిన కూడా పడ్డాయి. కానీ నేను ఆ ప్రాజెక్టులో లేను. ప్రస్తుతం ఉన్న సినిమాలతోనే నేను బిజీగా ఉన్నాను.

◆ పెద్దబ్బాయ్ రోషన్ హీరోగా మారాడు. ఇప్పుడు మా చిన్నబ్బాయ్ రోహన్ కూడా ఓ సినిమా చేస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్‌లోనే ఉన్నాడు. అది కూడ హారర్ సినిమానే. ప్రభుదేవాతో కలిసి అందులో నటిస్తున్నాడు మావాడు. ప్రభుదేవా కొడుకుగా చేస్తున్నాడు. హిందీ, తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో ఆ సినిమా ఒకేసారి రిలీజ్ అవుతుంది.

◆ రోషన్ ప్రస్తుతానికి సినిమాలు చేయడం లేదు. 'నిర్మలా కాన్వెంట్' సినిమా అతడిలో మంచి ఉత్సాహం తీసుకొచ్చింది. నమ్మకం లెవల్స్ పెరిగాయి. మరో మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయి హీరోగా వస్తాడు. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో నటనలో డిప్లమా కోర్స్ చేస్తున్నాడు.

◆ నేను ఇండస్ట్రీకి వస్తానని అనుకోలేదు. నా పిల్లలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తేనే నిలుస్తారు. నాకు వచ్చిన విజయాలు, అపజయాలు వారూ తెలుసుకున్నారు. ఏదిఏమైనా విధిప్రకారమే కెరీర్ నడుస్తుంది.

'హైదరాబాద్ లవ్ స్టోరీ' వస్తోంది



హైదరాబాద్ లవ్ స్టోరీలో జియ

హైదరాబాద్ అందాలతో రొమాంటిక్ సన్నివేశాలతో స్నేహానికి ప్రేమకి మంచి అర్థం చెప్పే చిత్రంగా 'హైదరాబాద్ లవ్ స్టోరీ' వుంటుందని రాహుల్ రవీంద్రన్ తెలియజేస్తున్నాడు. రేష్మీ మీనన్, జియ హీరోయిన్లుగా రాజ్ సత్య దర్శకత్వంలో ఏం.ఏల్.రాజు, ఆర్.ఏస్ కిషన్, వేణు గోపాల్ కొదుమగుళ్ళ సంయుక్తంగా 'సినిమా పీపుల్' పతాకం పై నిర్మించారు. ఈ శుక్రవారమే విడుదలవుతుంది. దర్శకుడు రాజ్ సత్య మాట్లాడుతూ "ఇది ఒక రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రం. ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో హైదరాబాద్ అందాలతో మంచి ఫీల్ గుడ్ సన్నివేశాలతో ప్రేమ కి స్నేహానికి మంచి అర్థం చెప్పే సినిమా. యూత్, ఫామిలీ ఆడియన్స్ తప్పక చూడదగ్గ చిత్రం. సునీల్ కశ్యప్ చక్కటి సంగీతం అందించారు. పాటలు మంచి ప్రేక్షకాదరణ పొందాయి. అలాగే సినిమా కూడా అందరికి నచ్చుతుందని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ "సినిమా చాలా బాగా వచ్చింది. రాజ్ సత్య ఆకట్టుకునేలా చిత్రీకరించారు.

రాహుల్ రవీంద్రన్ నటన, హీరోయిన్ల గ్లామర్, సునీల్ కశ్యప్ సంగీతం, రావు రమేష్ నటన హైలైట్‌గా నిలుస్తుంది. అత్యధిక థియేటర్లలో విడుదల చేస్తున్నామని తెలిపారు.

అగ్రి ప్లస్





పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మొదలయిన జంతువుల్లో సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు చాలా ప్రధానమైనది. దీన్నే వివిధ ప్రాంతాల్లో గాళ్లు, కాలివప్పె, కుండి, గాలి పోచమ్మ, అమ్మోరు, గాలి సెగ వంటి పేర్లతో పిలుస్తారు. ఈ వ్యాధి సోకడం వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ, పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుంది. జబ్బు సోకిన పశువుల పాలు తాగి, దూడలు మరణిస్తాయి. ఈ వ్యాధి యుక్త వయస్సులో ఉన్న పశువుల్లో, వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్న పశువుల్లో, దేశవాళీ పశువుల కన్నా సంకరజాతి పశవుల్లో ఎక్కువగా సోకుతుంది.

గాలికుంటు ఎంతో చేటు

ఈ వ్యాధి పశువులకు సోకి గాలి, ఇతర మార్గాల ద్వారా అతివేగంగా ఇతర పశువులకూ వ్యాపించే ఒకానొక తీవ్రమైన వైరల్ వ్యాధి. ఈ గాలిని ఆరోగ్యవంతమైన పశువులు నోటి ద్వారా గాని, ముక్కుద్వారా గాని పీల్చినపుడు వ్యాధి సంక్రమణకు కారణమవుతుంది. అంతేకాక వ్యాధిసోకిన పశువుల నుంచి విడుదలయ్యే అంతస్రావాలు, విసర్జకస్రావాలలో వైరస్ ఉండి వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి లక్షణాలు కనబడే నాలుగు రోజులు ముందు వరకూ పాలలో, వీర్యంలో కూడా వైరస్ ఉంటుంది. పాల ద్వారా దూడలకీ, పాల ట్యాంకుల ద్వారా వేరే పశువులశాలలకు వ్యాధి వ్యాపిస్తుంది. సాధారణంగా వ్యాధి సోకిన పశువులు ఆరోగ్యవంతమైన పశువులకు దగ్గరగా ఉండటం వల్ల వ్యాధి వ్యాప్తికి కారణమవుతాయి.

అలాగే వ్యాధి సోకిన పశువులు తిన్న గడ్డి ద్వారా, వైద్య పరీక్షల ద్వారా వ్యవసాయ పనిముట్ల ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లు ఎండాకాలంలో ఎండిపోయిన పేడలో అయితే 14 రోజులు, చలికాలములో ఉండే పేడలో ఆరు నెలలు, మూత్రంలో 39 రోజులు, మట్టిలో అయితే ఎండాకాలంలో మూడు రోజులు, చలికాలంలో 28 రోజులు బతకగలదు.

వ్యాధి లక్షణాలు :

- వ్యాధి లక్షణాలు గొర్రెలు, మేకలు కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 104 F – 106 F వరకు ఉంటుంది.
- నోటిలో చర్మపు పొరలు, పళ్ల చిగుళ్ళ, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో, బొబ్బలు ఏర్పడి, అవి 24 గంటల్లో చితికిపోవడం వల్ల, పశువులు నొప్పిచేత మేత తినవు. నోటి నుంచి విపరీతంగా చొంగ, నురుగును కారుస్తాయి.
- గిట్టల మధ్య, గిట్టలపైన వలయంగా ఉండే ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి, చితికి, నొప్పివల్ల నడువలేక కుంటుతాయి. అలాగే పాలిచ్చే పశువులు, చనుమొనలపై కూడా బొబ్బలు ఏర్పడి, పొదుగువాపు కూడా సంభవిస్తుంది.
- వ్యాధి సోకిన పశువుల పాలు తాగి, దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు పనులకు ఉపయోగపడవు. చూలి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.
- పశువులు రక్తహీనత కలిగి శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండవేడికి తట్టుకోలేక నీరసించిపోతాయి. ఈ పాంటింగ్ లక్షణాలన్నీ ఎక్కువుగా సంకరజాతి పశువుల్లో గమనించవచ్చు.

వ్యాధి చికిత్స

- వ్యాధి సోకిన పశువులను వేరు చేసి, సత్వర చికిత్స చేయించాలి. వైరస్ వ్యాధి కనుక మందులు పనిచేయవు. వ్యాధి లక్షణాలకు అనుగుణంగా చికిత్సచేయాలి.



- నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేటు నీళ్లల్లో శుభ్రం చేసి, వాటికి బోరోగ్లిజరిన్, యాంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ పూతగా పూయాలి. అలాగే కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లొరాక్సిన్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్ పూతగా పూయాలి.
- ఈగలు వాలకుండా వేపనూనె, లినమెంట్ వంటి వాటిని వాడాలి. అలాగే నోటిలోని చిగుర్లు, పుండ్ల పొరలు అభివృద్ధికి విటమిన్–సి కలిగి ఉండే పౌడర్ ఆప్తోకేర్ వంటి వాటిని వాడాలి.
- బ్యాక్టీరియా సంక్రమణ కాకుండా యాంటిబయోటిక్ మందులు 3–5 రోజులు వాడాలి. ఉపశమనం కోసం మెలోక్సికమ్ మందులు వాడాలి. అలాగే విటమిన్లు, బి–కాంప్లెక్స్‌తో కూడిన టానిక్‌లను ఇచ్చి వ్యాధి నిరోధకశక్తిని పెంచాలి.
- బొబ్బల వల్ల మేత మేయని పశువులకు సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. జావ/జొన్న అన్నం, చిటికెడు ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీనపడకుండా జాగ్రత్త వహించాలి. బలహీనత తీవ్రంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోనికి ఇవ్వాల్సి ఉంటుంది.

గృహవైద్యం

- పటికగానీ వెలిగారముగానీ కలిపిన నీటితో నోటిపుళ్ళు, కాలిపుళ్ళు కడగాలి.
- పావుకిలో రాగులు, పావుకిలో పెసలు ఉడకబెట్టి, 250 గ్రాములు నువ్వుల నూనెలో బాగా పిసికి ఆ మడ్డి కూడును రోజుకు రెండుసార్లు తినిపించాలి.
- కాళ్ళకు నువ్వుల నూనె కడియం వేయాలి.

ఔషధాలు :

- తుమ్మ చెక్క, రావి చెక్క కషాయంతో నోటిపుళ్ళు, కాళ్ళపుళ్ళు కడగాలి.
- పుళ్ళ మీద ఈగలు వాలకుండా వేపనూనె రాయాలి.
- పుళ్ళపై వేపాకు నూరి, పసుపు కలిపి రాయాలి.

మూలికా వైద్యం :

- జ్వరం తగ్గటానికి సురేకారం 20 గ్రాములు, ఉప్పు 30 గ్రాములు, నేలవేము 30 గ్రాములు, బెల్లం 120 గ్రాములు, అరలీటరు వేడినీళ్ళల్లో కలిపి రోజుకు రెండుసార్లు తాగించాలి.

హెరీమియో:

ఈ కింది వాటిలో ఏదైనా ఒక మందు

- వ్యాధి ప్రబలిన ప్రాంతంలో MERC SOL 200 గానీ KALL BICHROMICUM 200 గానీ, SYPHILINUM 200గానీ 10 మాత్రలు చొప్పున ప్రతిరోజూ తినిపిస్తే వ్యాధినిరోధకంగా పనిచేస్తుంది.
- వ్యాధి సోకితే తగ్గటానికి MERC SOL 200 లేదా KALI BICHROMICUM 200 లేదా SYPHILINUM 200 లేదా ECHI-NACEA 200 లేదా BORAX 200 లేదా KALI CHLORATUM 200 ఏదైనా ఒక మందు 10 మాత్రలు చొప్పున రోజుకు రెండుసార్లు దొన తినిపించాలి.
- నోరు పుళ్ళు పడినపుడు BORAX లేదా HYDRASTIS లేదా HYDRASTINUM MURIATICUM లేదా ECHINACEA 'Q'– ఏదైనా ఒక మందు మదర్ టింక్చర్‌ను మి.లీ. మందు 10 మి.లీ. నీళ్ళల్లో కలిపి నోటిపుళ్ళు కడగాలి. డెక్కల మధ్య పుళ్ళకు ECHI-NACEA లేక CALENDULA మదర్ టింక్చర్‌ను సమపాళ్ళల్లో కొబ్బరినూనెలో గానీ వ్యాజలైన్లో గానీ కలిపి రాయాలి.
- జ్వర తీవ్రత వుంటే HEPAR SULPH IM లేదా RHUS TOX IM 10 మాత్రలు చొప్పున రోజుకు రెండుసార్లు తినిపించాలి.

నివారణ :

- గాలికుంటు వ్యాధికి చికిత్సలేదు నివారణ మార్గాలపైనే శ్రద్ధ వహించాలి. గాలికుంటు వ్యాధి టీకాలు మొదటిసారి రెండు నెలల వయస్సులో, బూస్టర్ డోసు ఒక మాసం తర్వాత చేయించాలి. ఆ తర్వాత ప్రతి ఏడాదికి ఒకసారి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. టీకాలు వేసిన తర్వాత 2–3 వారాల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. సంవత్సరకాలం పనిచేస్తుంది.
- వ్యాధిగ్రస్త పశువుల నోటి చొంగలో వైరస్ అధికశాతం ఉండి మేత, దాణా, నీరు, మలమూత్రాదుల్లో ఏడాది వరకూ దాగి ఉండి అనుకూల పరిస్థితులలో వ్యాధిని కలుగజేస్తాయి. అందువల్ల పశువులశాలలను సాధారణ క్రిమిసంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2% ఫార్మాలిన్, 4% సోడియం కార్బోనేటు వంటి మందులతో శుభ్రం చేయడం వల్ల వైరస్ నశిస్తుంది.
- ఆంబోతుల, దున్నల వీర్యం ద్వారా వ్యాపిస్తుంది కనుక మూడు నెలల వరకూ సంపర్కానికి నియోగించకూడదు. కొత్త ప్రాంతాల నుంచి అనగా, సంత నుంచి తెచ్చిన పశువుల్ని మూడువారాలు విడిగా ఉంచి, పరిశీలించి, టీకాలు వేయించి ఆరోగ్యమైన వాటితో కలువనివ్వాలి. వ్యాధిగ్రస్తమయిన పశువుల కళేబరాల్ని లోతయిన గోయి తీసి, అందులో సున్నం వేసి పాతిపెట్టాలి లేదా కాల్చి వేయాలి.. తద్వార వ్యాధి అరికటవచ్చు.



- వ్యాధి నుంచి కోలుకున్న పశువుల్లో పాంటింగ్ (రోప్పడం)తో పాటు గర్భస్రావాలు, పొదుగు వాపు, వంధ్యత్వం, న్యూమోనియా, రక్త క్షీణత, గిట్టలు పోవడం వంటి దుష్పలితాలుంటాయి. క్రమం తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలి.

భారత ప్రభుత్వం వారు పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకా పంపిణీ కార్యక్రమము సంవత్సరంలో రెండుసార్లు చేస్తున్నారు. కనుక రైతులు సమీప పశు వైద్యుడిని సంప్రదించి, టీకాలు వేయించి, ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలరు.



డాక్టర్.జి.రాంబాబు,
పశువైద్యాధికారి, కడప.

లద్దె పురుగు నివారణ

రాష్ట్రంలో సాగు చేస్తున్న రబీ వేరుశనగ ప్రస్తుతం పంట పూత, ఊడలు, కాయ, గింజ అభివృద్ధి చెందే దశలలో ఉన్నది. ఈ దశలో రైతులు పంటకు నీటి ఎద్దడి తగలకుండా భూమి స్వభావాన్ని బట్టి సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో పాటు లద్దె పురుగును నివారించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు.



- 30 నుంచి 40 రోజుల దశలో ఉన్నటువంటి వేరుశనగ పంటపై రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించి అంతర్వాహిక మందులైన ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ. లేక డైమిథోయేట్ 400 మి.లీ. లేదా మోనోక్రొటోఫాస్ 320 మి.లీ.ను 200 లీటర్ల నీటికి కలిపి మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- లద్దె పురుగు నివారణ కొరకు ఎకరానికి 4 లింగాకర్షణ బుట్టలు పెట్టి మగ రెక్కల పురుగులను ఆకర్షించాలి. ఎకరా వేరుశనగ పొలంలో 30–40 ఆముదం, ప్రొద్దుతిరుగుడు మొక్కలు ఎర పంటలుగా పొలంలో విత్తుకోవాలి. గుడ్ల సముదాయాన్ని పిల్ల పురుగులను ఏరి వేయాలి. ఈ పురుగు నివారణకు వేప కషాయము (5 శాతం) లేక వేప సంబంధిత పురుగు మందులను 1000 మి.లీ. 200 లీటరు నీటికి సబ్బుపొడి 50 గ్రా. బక్కెట్ నీళ్ళకు కలిపి, పిచికారీ చేయాలి. తొలిదశ గొంగళిపురుగు నివారణకి క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేక మోనోక్రొటోఫాస్ 320 మి.లీ. మందును ఎదిగిన గొంగళిపురుగు నివారణకి థయోడికార్బ్ 200 గ్రా. లేక నోవల్యురాన్ 200 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 400 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బాగా ఎదిగిన లద్దెపురుగు నివారణకు విషపు ఎరను చిన్న చిన్న ఉండలుగా తయారుచేసి పొలంలో సమానంగా సాయంకాలంలో చల్లాలి.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత నంబరుకూ కాల్ చేయవచ్చు..
1800 425 0430



డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.

విరామం అవసరం

ఈ వారం **విజ్ఞాన వాణి**

గత రెండు–మూడేళ్ల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రధాన ప్రత్తి పంట పూర్తయిన వెంటనే విరామ సమయాన్ని పాటించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ వేసవిలో ప్రత్తి పంట సాగు చేయరాదు.

- పంట తీసిన తర్వాత పొలములో గొర్రెలు, మేకలు, పశువులను మేపాలి.
- ప్రత్తి మోళ్ళను, విచ్చుకోని కాయలను ట్రాక్టరు రోటావేటరుతో భూమిలో కలియదున్నటం ద్వారా కోశస్థ దశలోనున్న గులాబీరంగు పురుగును నాశనం చేయవచ్చు.
- నీటివసతి ఉన్నప్పటికీ ప్రత్తిని ఆరు నెలలకు మించి పొడిగించకుండా తీసివేయాలి. పంటకాలము పొడిగించుట ద్వారా రాబోయే పంటలో పురుగు ఉధృతి పంట తొలిదశలోనే ఎక్కువయ్యే అవకాశముంటుంది. వీటి వలన పురుగు జీవిత కాలచక్రాలను నిరోధించడానికి వీలవుతుంది. గనుక వచ్చే పంట కాలములో గులాబీ రంగు పురుగు ఉనికిని తగ్గించవచ్చు. ★



చిన్నారి






పొడుపు కథ

ఈగలు పూలపై వాలును,
వానిలోని మకరందాన్ని తాగును,
గుంపులుగా ఒక్కటౌను,
అందరికీ..తీపినిచ్చును?

జవాబు : తేనెటీగ

జోక్ :

తల్లి : ఒరేయ్ రాముా! స్కూలుకు టైం అవుతుంటే.. ఆ అద్దం ముందు అంతసేపు నిలబడి ఏం చేస్తున్నావ్?
రాము : ఉండమ్మా! ఈ అద్దంలోని వ్యక్తిని.. ఎక్కడో చూసినట్టుంది.. గుర్తురావట్లే..!



నీడ కనిపెట్టండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని ఒక పెట్టెలో సూర్యుడున్నాడు. పక్కన కొన్ని నీడలు ఉన్నాయి. అందులో సూర్యుని నీడ ఏదో కనిపెట్టండి!

కోతి.. ఏం తింటుంది?



పిల్లలూ..! మీకు కోతి అంటే చాలా ఇష్టం కదా! ఎక్కడైనా దేవాలయాల దగ్గర, రహదారి మధ్యలో, పార్కులలో మీరు కోతులను చూసే ఉంటారు. కోతిని చూడగానే మీరు చేసే పని మీ చేతిలో ఉన్న తినుబండారాలను దానికి చూపించడం.. అవును కదా?! చాలామంది కోతి శాఖాహారి మాత్రమే అని అనుకుంటుంటారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం 264 రకాల కోతి జాతులు ఉన్నాయి. ఎక్కువశాతం చెట్లనే నివాసంగా చేసుకుని జీవిస్తే, కొన్నిమాత్రం భూమిపైనే జీవించడానికి ఇష్టపడతాయి. కోతి శాకాహారాన్నే తింటుంది అనుకోవడం అపోహ మాత్రమే. కోతి మాంసాహారి కూడా. ఇవి సుమారు రెండు వందల రకాల పండ్లను తింటాయి. పిల్లలూ మీకు తెలియని ఇంకొక విషయం చెప్పమంటారా! రకరకాల పండ్లు తినడంతోపాటు క్రిమికీటకాలు, పక్షి గుడ్లు వంటి మాంసాహారాన్నీ కోతులు ఇష్టంగానే తింటాయి. అక్కడికి.. ఇక్కడికీ తిరుగుతూ పండ్లను తింటూనే వాటిలోని విత్తనాలను తెలివిగా నేలపై వెదజల్లుతాయి. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులోనూ ఆయా ఫలసంపద వాటికి అందుతుంది.





కోతుల్లో 'కపుచిన్' అనే కోతి చాలా తెలివైంది. వస్తువుల్ని వినియోగించుకోవడం, కొత్త విషయాలను నేర్చుకునే గ్రాహకశక్తి, ఇతర కోతులకు సంజ్ఞలతో ఏదైనా తెలియజెప్పడంలో నేర్పరి.

'మేన్‌డ్రిల్ 'అనే పేరుగల కోతి అత్యంత బలిష్టమైనది. ★


కాకి కథ

మా అమ్మ రోజూ నేను నిద్రపోయే ముందు కథలు చెబుతుంది. వాటిలో కాకి కథ అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ ఇప్పుడు మీకు చెబుతా.. వినండి!

అనగనగా ఒక చెట్టు ఉంది. దానిమీద ఒక కాకి ఉండేది. అదే చెట్టు తొర్రలో పాము ఒకటి ఉండేదట! కాకి గుడ్లను పెట్టి పొదుగుతుండేది. అది మధ్య మధ్యలో ఆహారం తెచ్చుకోవడానికి బయటకు వెళ్లేది. ఆ సమయంలో పాము వచ్చి, కాకి గుడ్లను తింటుండేది. తన గుడ్లు ఏమైపోతున్నాయో తెలియక కాకి ఏడుస్తుండేది. ఒకరోజు కాకి ఆహారం కోసం బయటకు వెళుతున్నట్లు వెళ్లి, అక్కడే దాక్కుదంట! కాకి లేదనుకుని పాము వచ్చి గుడ్లు తింటూంటే.. అప్పుడు కాకి వచ్చి, దానితో బాగా తగువులాడుతుంది. పాము "నీ ఇష్టం వచ్చింది చేసుకో!" అంటుంది. అప్పుడు కాకి ఏడుస్తూ తన స్నేహితుడైన నక్క దగ్గరకు వెళ్లి జరిగిన విషయం చెబుతుంది. అప్పుడు నక్క "మన యువరాణి రోజూ ఒక కొలనులో స్నానం చేయడానికి వస్తుంది. అప్పుడు ఆమె ఆభరణాలు గట్టుమీద పెడుతుంది. వాటిలో హారాన్ని ఒకటి తీసుకొచ్చి పాము పుట్టలో వేయి" అని చెబుతుంది. నక్క చెప్పినట్లే కాకి చేస్తుంది. భటులు ఆ పుట్టను తవ్వి, పామును చంపి హారాన్ని తీసుకెళతారు. తర్వాత కాకి తన పిల్లలతో చాలా సంతోషంగా ఉంటుంది.

మా అమ్మ నాకు ఎప్పుడూ చెబుతుంటుంది. 'మనం ఆపదలో ఉన్నప్పుడు మనల్ని ఎవరో ఒక స్నేహితుడు ఆదుకుంటాడు' అని.. అందుకే నాకు ఈ కథ చాలా ఇష్టం.

- బి. నిదీశ్,
యుకెజి,
గ్లోబల్ మైండ్స్,
నరసరావుపేట.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

టార్గెట్... ఒక్కరే!

ఒక్క స్పిన్నర్ చాలు మ్యాచ్ గెలవడానికైనా... ఓడిపోవడానికైనా... ఇది యజ్ఞేంద్ర చాహల్ విషయంలో నిజమైంది. ఆరు వన్డేల సిరీస్‌లో 16 వికెట్లు సాధించి భారతజట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడే రెండో టీ20లో ఓటమికీ కారణమయ్యాడు. టీమిండియాకు చుక్కలు చూపించింది సఫారీజట్టు వికెట్ కీపర్ హెన్రిక్ క్లేశన్. కేవలం 30 బంతుల్లో 69 పరుగులు చేసి జట్టు గెలుపులో ప్రధాన భూమిక పోషించాడు. వీరిద్దరే ప్రస్తుత జట్లకు టార్గెట్‌గా మిగిలారు.

- 24 బంతుల్లో 64 సమర్పించిన చాహల్


యజ్ఞేంద్ర చాహల్

(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య బుధవారం జరిగిన రెండో టీ20లో సఫారీజట్టు అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. భారతజట్టు నిర్దేశించిన 189 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 18.4 ఓవర్లలోనే సాధి ంచి టీ20 సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచి ంది. మన జట్టు ఓటమికి ఆఫ్ స్పిన్ బౌలర్ చాహల్ కారణ మైతే... ఆ జట్టు విజయానికి వికెట్ కీపర్ హెన్రిక్ క్లేశన్ ప్రధాన భూమిక నిర్వర్తించాడు. సఫారీజట్టు వికెట్లు పడగొట్టడంలో టీమిండియా ఘోరంగా విఫలమైంది. కేశన్ చాహల్ బౌలింగ్‌లో మొదట్లోనే క్రీజ్‌వదిలి ముందుకొచ్చినప్పుడు ధోనీ స్టంపింగ్ చేయడంలో విఫలమయ్యాడు. దీంతో వికెట్ కీపర్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. అతడు మన ఏకైక లెగ్‌బ్రేక్ స్పిన్నర్ యజ్ఞేంద్ర చాహల్ బౌలింగ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. వ్యక్తిగతంగా 30 బంతులను ఎదుర్కొని 3 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 69 పరుగులు రాబట్టాడు. దీంతో భారతజట్టు విజయం కాస్తా సఫారీలవైపు మొగ్గింది. టీ20ల్లో 189 పరుగుల విజయలక్ష్యం పెద్దదే అయినప్పటికీ 18.4 ఓవర్లలోనే సఫారీలు సాధించి రెండో టీ20లో విజయాన్ని సాధించింది. తొలి ఐదు ఓవర్లలో 38 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఆ జట్టును వికెట్ కీపర్ మైదానంలోకి రావడంతో ఒక్కసారిగా మ్యాచ్ స్వరూపం మారిపోయింది. క్లేశన్ అండతో ఆ జట్టు సారథి డుమిని తొలుత ఆచి... తూచి ఆడినప్పటికీ వికెట్లు పడకుండా జాగ్రత్తపడ్డాడు. డుమిని సైతం 40 బంతుల్లో అజేయంగా 64 పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి.


హెన్రిక్ క్లేశన్

అయితే భారత ఆఫ్ స్పిన్నర్ యజ్ఞేంద్ర చాహల్ వేసిన 13వ ఓవర్‌లో క్లాసెన్-డుమినీలు కలిసి 23 పరుగులు సాధించడంతో మ్యాచ్ స్వరూపం ఒక్కసారిగా మారిపోయింది. ఇందులో 17 పరుగులు సఫారీ జట్టు కీపర్ క్లేశన్ సాధించినవే కావడం విశేషం. విజయం అనంతరం తన హిట్టింగ్‌పై క్లేశన్ మాట్లాడుతూ.. 'లెగ్ స్పిన్నర్లను ఎదుర్కోవడం చాలా ఇష్టం. అందుకే చాహల్ బౌలింగ్‌లో హిట్టింగ్‌కు చేశా. నా కెరీర్‌లో ఇంకా చాలామంది లెగ్‌స్పిన్నర్లను ఎదుర్కోవాల్సి ఉంది. మాకు కీలకమైన రెండో టీ20లో నా వ్యూహం ఫలించింది. నేను బంతిని ఎక్కడకు ఎలా పంపిచాలనుకున్నానో అది చేసి చూపించా. నేను హిట్టింగ్ చేస్తానని చాహల్ అస్సలు ఊహించి ఉండ డు. ఇలా ఆడాలనే గేమ్ ప్లాన్‌తో నేను క్రీజ్‌లోకి రాలేదు. అప్పటి పరిస్థితిని బట్టి మాత్రమే ఆడా. చాహల్ వేసిన ఓవర్‌లో 20 పరుగులు సాధించాలనే లక్ష్యంతో ఎదురుదాడికి దిగా' అని క్లాసన్ పేర్కొన్నాడు.


ఆంధ్ర × ఢిల్లీ మ్యాచ్ దృశ్యం

విజయ్ హజారే ట్రోఫీ

సెమీస్‌కు ఆంధ్ర

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌జట్టు విజయ్ హజారే ట్రోఫీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం ఢిల్లీతో తలపడి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 32.1 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులో అత్యధికంగా రిషబ్ పంత్ 38 పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టు మీడియం పేసర్ శివకుమార్ కేవలం 29 పరుగులిచ్చి నాలుగు వికెట్లు... ఎడమచేతివాటం స్పిన్నర్ భార్గవ్ భట్ 28 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 28.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి గెలుపొందింది. ఆంధ్రజట్టు బ్యాట్స్‌మన్ రికీ భుయ్ 32, అశ్విన్ హెబ్బర్ 38 పరుగులతో జట్టును గెలుపుకు తోడ్పడ్డారు. ఢిల్లీ ఓపెనర్ ఉన్ముక్త్ చాంద్ కేవలం 4 పరుగులు మాత్రమే చేయగా... సీనియర్ బ్యాట్స్‌మన్ గౌతమ్ గంభీర్ 8 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. యువ క్రీడాకారుడు దలాల్ 11 పరుగులకు అవుటవ్వడంతో ఆ జట్టు 9 ఓవర్లలో కేవలం 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అనంతరం రిషబ్ పంత్ 38, ధ్రువ్ షోరీ 21 పరుగులతో రాణించడంతో పాటు ఆరో వికెట్ వీరిద్దరూ 35 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. వీరిద్దరి నిష్క్రమణ అనంతరం ఢిల్లీ జట్టు బ్యాట్స్‌మన్లు పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో ఆ జట్టు 20 ఓవర్ల ముందే 111 పరుగులకు ఇన్నింగ్స్‌ను ముగించేసింది. అనంతరం 112 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 28.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు బరోడాపై 3 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీస్‌కు చేరింది. సెమీఫైనల్స్, ఫైనల్ ఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్ల మైదానంలో జరగనున్నాయి.

సెమీఫైనల్స్...

(ఫిబ్రవరి 24)
మహారాష్ట్ర × కర్ణాటక

(ఫిబ్రవరి 25)
ఆంధ్రప్రదేశ్ × సౌరాష్ట్ర



ఇక డీఎస్పీగా హర్మన్‌ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ : భారత మహిళాజట్టు సంచలన క్రికెటర్, టీ20 జట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఆమెను పంజాబ్ రాష్ట్ర గౌరవ డీఎస్పీగా నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్ గురువారం తెలిపారు. అయితే.. ఇప్పటికే వెస్ట్రన్ రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హర్మన్‌ప్రీత్.. ఐదేళ్ల బాండ్‌పై సంతకం చేసి ఉండటంతో కొత్తగా పోలీస్ డీఎస్పీగా బాధ్యతలు చెప్పటేందుకు ఆమెకి అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో బాండ్ సమస్యని పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ దృష్టికి హర్మన్‌ప్రీత్ తీసుకెళ్లగా.. సిఎం రైల్వే మంత్రి పీయూస్ గోయల్‌కు లేఖ రాసి సమస్య పరిష్కారా నికి చొరవ చూపారు. హర్మన్‌ప్రీత్ గత ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన మహిళల ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చూపింది. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయంగా 171 పరుగులు సాధించి భారతజట్టు ప్రపంచకప్ ఫైనల్లోకి చేరడంలో కీలకపాత్ర పోషించింది. కౌర్‌కు ఇప్పటికే భారత ప్రభుత్వం అర్జున అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే.


పూనేలో జరిగిన 14వ పిఎస్‌పిబి బ్రిలియర్డ్స్ అండ్ స్నూకర్ టైటిల్‌ను సాధించిన ఒఎన్‌జిసి జట్టు సభ్యులు సౌరవ్ కొఠారి, పంకజ్ అద్వానీ, అశోక్ కుమార్


పాకిస్తాన్ సూపర్‌లీగ్-3 (పిఎస్ఎల్) ట్రోఫీతో ఆరుజట్ల సారథులు. గురువారం నుండి ఈ టోర్నీ దుబాయ్‌లో ప్రారంభం కానుంది.


ఫిగర్ స్కేటింగ్ సింగిల్ విభాగంలో అమెరికాకు చెందిన బ్రాడీ టెన్నెల్ విన్యాసం

మహిళా ఐస్ హాకీ విజేత అమెరికా

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : వింటర్ ఒలిపింక్స్ మహిళల ఐస్ హాకీలో బంగారు పతకాన్ని అమెరికా జట్టు కైవసం చేసుకుంది. గురువారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో ఆ జట్టు కెనడా జట్టును పెనాల్టీ షూటౌట్‌లో 3-2 గోల్స్ తేడాతో ఓడించి బంగారు పతకాన్ని సాధించింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 2-2 గోల్స్‌తో సమంగా ముగించాయి. దీంతో పెనాల్టీ షూటౌట్‌లో విజేతను ప్రకటించాల్సి వచ్చింది. దీంతో పటిష్టమైన కెనడా మహిళాజట్టుపై అమెరికా జట్టు గెలుపొంది తొలిసారి వింటర్ ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. అమెరికాకు చెందిన 20 ఏళ్ళ గోల్‌కీపర్ మాడియా రూనీ కెనడా ప్లేయర్ కొట్టిన గోల్‌ను నిలిపి ఆ జట్టుకు స్వర్ణపతకం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. నాలుగుసార్లు స్వర్ణపతక విజేత అయిన కెనడాను అమెరికా జట్టు తొలిసారి ఫైనల్లో ఓడించింది. పురుషుల కర్లింగ్ టీమ్ విభాగంలో స్విట్లర్లాండ్ జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది.


ఐస్ హాకీలో బంగారు పతకం సాధించిన అమెరికా మహిళా జట్టు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త దేవి, అధ్యక్షత వహించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి తదితరులు

రామ్‌గోపాల్ వర్మ అరెస్టుకు డిమాండ్

- నేటి నుంచి సంతకాల సేకరణ
- మహిళ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళను వ్యాపార వస్తువుగా, అభ్యంతరకరంగా చూపిస్తూ జిఎస్టీ సినిమాను చిత్రీకరించినందుకు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మను వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మహిళా సంఘాల నాయకులపై వర్మ చేసిన అనుచిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటైంది. వర్మను అరెస్ట్ చేయకుంటే వచ్చే నెల 6 నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని సంఘాలు ఐక్యంగా హెచ్చరించాయి. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఇంటర్నెట్‌లో అశ్లీల వీడియోలను నియంత్రించేందుకు ' మీడియా వాచ్ కమిటీ ' ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోర్నోగ్రఫీని కట్టడి చేసే వ్యవస్థను తీసుకువచ్చేలా మేధావులు, మహిళ, ప్రజా సంఘాలన్నీ కలిసి శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు సంతకాల సేకరణ చేపడతాయని చెప్పారు. సామాజిక కార్యకర్త దేవి మాట్లాడుతూ పాశ్చాత్య పోర్న్ వీడియోలు మన సెర్చ్ ఇంజిన్‌లోకి రాకుండా, చైనా తరహాలో పటిష్టంగా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నెంబర్ పెట్టాలని సూచించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలను గౌరవించేలా విద్యా వ్యవస్థలో మార్పు రావాలన్నారు. మహిళా సంఘాలు చేస్తున్న పోరాటాలకు మద్దతునిస్తామన్నారు. ప్రగతిశీల మహిళాసంఘం రాష్ట్ర నాయకురాలు గంగా భవాని మాట్లాడుతూ అశ్లీల వీడియోల నియంత్రణ కోసం పోరాడేందుకు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. కాంగ్రెస్ మహిళా విభాగ నాయకురాలు పద్మశ్రీ మాట్లాడుతూ మరోసారి మహిళలపై ఎవరూ అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండాలంటే వర్మను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు దుర్గాంబ మాట్లాడుతూ వర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ నన్నపనేని కూడా ఏమీ చేయలేననడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కోశాధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ వర్మ లాంటి వాళ్లు టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంపర శ్రీనివాస్ సుమోటోగానే కేసులు నమోదు చేయవచ్చని సూచించారు. శ్రామిక మహిళా ఫోరం నాయకురాలు శైలజ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్. సూర్యారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు సిపోర, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ, ఐద్వా నాయకులు శ్రీదేవి, సుప్రజ, సంగమం ప్రతినిధి వెంకట్, జాషువా సాంస్కృతిక వేదిక ప్రతినిధి నారాయణ, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నాగభూషణం, మీడియా ప్రతినిధి శ్రీనివాసాచారి, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు రామరాజు సమావేశంలో పాల్గొన్నారు.

మహిళ విజయం

- వర్మపై మరో మూడు సెక్షన్లలో కేసులు నమోదు
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ


నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేస్తున్న కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

మహిళలపై సినీదర్శకులు రామ్‌గోపాలవర్మ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఐద్వా, మహిళా సంఘాలు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షలను గురువారం రాత్రి విరమించారు. తాము డిమాండ్ చేసిన విధంగా పోలీసులు వర్మపై 354ఎ, నిర్భయ చట్టం, ఐటి యాక్ట్ 67, 500 సెక్షన్ల కింద మూడు కేసులు నమోదు చేయడంతో పాటు ఆయనను త్వరలో విశాఖకు పిలిచి విచారణ చేపడతామని పోలీసులు హామీ ఇవ్వడంతో దీక్షలను విరమిస్తున్నట్లు ఐద్వా నగర కార్యదర్శి మాధవి, సహాయ కార్యదర్శి మణి తెలిపారు. దీక్షలు విరమింపచేసినా పోరాటం ఆగదన్నారు. ఇప్పటికైనా రామ్‌గోపాలవర్మను పోలీసులు చెప్పిన ప్రకారం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిఎస్‌టి వంటి అశ్లీల సినిమాలను తీసి యువతను పెడదారి పెట్టిస్తున్న రామ్‌గోపాల్‌వర్మ వంటి వ్యక్తులు బయట ఉంటే ప్రమాదకరమన్నారు. అటువంటి వ్యక్తి జైల్లోనే ఉండాలన్నారు. ఎంవిపి కాలనీ పోలీసు స్టేషన్‌లో తూతూ మంత్రంగా బుధవారం రాత్రి 504, 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇవి కాకుండా ఇంకా కఠినమైన సెక్షన్లలో కేసులు పెట్టాలని గురువారం రాత్రి తిరిగి మహిళా సంఘాలు ఫిర్యాదు చేయడంతో పైన పేర్కొన్న సెక్షన్లపై కేసులు నమోదు చేసి ఆయన్ను అరెస్టు చేస్తామని పోలీసులు హామీలిచ్చినట్లు ఐద్వా నాయకులు తెలిపారు. ఆయనను అరెస్టు చేయకపోతే వెంటనే ఆందోళనలు చేపడతామన్నారు. వర్మపై పోరాటానికి మద్దతు పలికిన వైసిపి, సిపిఎంకు, ప్రజా సంఘాలకు ఈ సందర్భంగా ఐద్వా నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆందోళనతోనే వర్మపై కేసు

మహిళల ఆందోళన కారణంగా విశాఖలో రాంగోపాల్‌వర్మపై కేసు నమోదయిందన్నారు. విచారణ కోసం రాంగోపాల్ వర్మ విశాఖ వస్తే నిరసన తెలియజేస్తామని చెప్పారు. జరిగిన దానికి రాంగోపాల్‌వర్మ క్షమాపణ చెప్పాడనీ, దీంతో వెనక్కి తగ్గాలని ఎపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చెప్పడం మహిళలను అవమానించేదిగా ఉందన్నారు. ఆయన క్షమాపణ చెప్పిన తీరు ఆయనలో దాగి వున్న మహిళా ద్వేషాన్ని తెలిపేదిగా ఉందని పేర్కొన్నారు.

హోదా ఇవ్వాల్సిందే

- 10 టివి చర్చా వేదికలో వక్తలు
- చర్చను అడ్డుకోవడానికి ప్రయత్నించిన బిజెపి కార్యకర్తలు
- హోదా కావాలన్నవారు ద్రోహులే : బిజెపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, ఇందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని ప్రజలను టిడిపి, బిజెపి పట్టించుకోలేదనే భావన ప్రజల్లో ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం విజయవాడలో 10 టివి నిర్వహించిన బిగ్ డిబేట్‌లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. నాలుగేళ్లు టిడిపి, బిజెపి కలిసి పాలన చేసినా ఒక్కటీ అమలు కాలేదని తెలిపారు. యువతీ, యువకులకు వారి భవిష్యత్‌పై భయం పట్టుకుందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన విద్యా సంస్థలకు ఇంతవరకు నిధులు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు ఆందోళన చేస్తానని చెబుతున్నారని, మరొకసారి మోసపోవాల్సి వస్తుందా అని ప్రజలు ఆలోచనలో పడ్డారని పేర్కొన్నారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కోరితే ఎందుకని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మరో స్వతంత్ర పోరాటం చేస్తానంటున్నారని, మోసకారి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కలిసి పోరాటాలు నిర్వహించాలని ఆయన కోరారు. టిడిపి అధికార ప్రతినిధి వర్ల రామయ్య మాట్లాడుతూ రాష్ట్రం కేంద్రానికి ముంతలో నీళ్లు మట్టి తప్ప ఏమీ ఇవ్వలేదన్నారు. 14వ ఆర్థిక సంఘం నిబంధన వల్ల హోదా ఇవ్వలేకపోతున్నామని బిజెపి చెబుతోందని, అదే సమయంలో బుందేల్ ఖండ్‌కు హోదా ఇచ్చిందని చెప్పారు. ప్రముఖ సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ హోదా విషయంలో బిజెపి, టిడిపి ప్రధాన ముద్దాయి లని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం కూడా చేయాల్సినంత చేయలేదని తెలిపారు. వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు మాట్లాడుతూ తాము తొలి నుండి హోదా కోసం కట్టుబడి ఉన్నామని చెప్పారు. టిడిపి, బిజెపి ప్రజలను మోసం చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర బిజెపి యువజన విభాగం అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ఎంతో చేసిందని, అదే సమయంలో హోదా ఇవ్వబోమని తేల్చిచెప్పారు. లోపల ఒకమాట, బయట ఒక మాట చెప్పడం లేదని, హోదా గురించి అడిగేవాళ్లందరూ ద్రోహులేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జంగా గౌతమ్ మాట్లాడుతూ అనేక హోదాకు 14వ ఆర్థిక సంఘం అడ్డు అని చెబుతున్నారని, విభజన చేసే సమయానికి అసలు 14వ ఆర్థిక సంఘం లేనేలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతామని తెలిపారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా హామీలిచ్చి అమలు చేయకపోవడం చట్టరీత్యా నేరమన్నారు.

బిజెపి కార్యకర్తల వాగ్వివాదం

హోదాపై చర్చ జరుగుతున్న సమయంలో బిజెపి నాయకుల మధ్య వాగ్వివాదానికి దిగారు. అంతకుముందు మరో టివి ఛానల్లో హీరో శివాజితో వాగ్వివాదానికి దిగిన బృందంలో సభ్యులు పలువురు మరోసారి చర్చకు హాజరయ్యారు. చర్చ జరుగుతున్న సమయంలోనే హోదా గురించి విద్యార్థి, యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో తోపులాట జరిగింది. పోలీసులు సర్దిచెప్పి పంపించేశారు.

కిడ్నీ బాధితులకు న్యాయం చేస్తా

ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్

ప్రజాశక్తి-కనిగిరి

తాను అధికారంలోకొస్తే అందరి సమస్యలనూ పరిష్కరిస్తాననీ, కిడ్నీ బాధితులకు న్యాయం చేస్తాననీ వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలం రామాపురం నుంచి ప్రారంభమై కనిగిరి మండలం అజీస్‌పురం వరకూ సాగింది. అర్హులైన తమకు ఫించన్లు ఇవ్వటంలేదని వితంతువులు, వృద్ధులు, వికలాంగులు రామాపురం వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఫ్లోరోసిస్ భూతం తమను జీవచ్ఛవాలుగా మార్చుతోందనీ, తమను కిడ్నీవ్యాధుల బారినపడేలా చేస్తూ ప్రాణాలను హరిస్తోందనీ ఆయన దృష్టికెళ్లారు. కరువు కనిగిరి ప్రాంతంలో కరాళనృత్యం చేస్తోందనీ, కంది, శనగ, మినుము, పొగాకు, వరి పంటలు చేతికందకుండా పోయాయనీ, అరకొరా పండిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక చేసిన అప్పులు తీరక అవస్థలు పడుతున్నామనీ వాపోయారు. మేదరులు గంపలతోనూ, యానాదులు వలలతోనూ జగన్‌కు స్వాగతం పలికి తమ దుర్భర పరిస్థితులను, తమ కష్టాలను వివరించారు. అజీస్‌పురానికి చేరుకోగానే మహిళలు అధిక సంఖ్యలో బారులుతీరి జగన్‌కు స్వాగతం పలికారు. ఐదున్నర కిలోమీటర్లు సాగిన పాదయాత్ర అజీస్‌పురం వద్ద ముగిసింది. పాదయాత్ర పొడవునా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మాధుసూదన్ యాదవ్ జగన్ వెంటే ఉన్నారు. యాత్రలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు.


కిడ్నీ బాధితుల ఆవేదనను ఆలకిస్తున్న వైఎస్ జగన్

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68